# తుపాకీ రాజ్యం

## పెరుగుతున్న నిర్బంధం మీద నివేదిక



ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

# తుపాకీ రాజ్యం

కొనసాగుతున్న నిర్బంధంమీద నివేదిక

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
[ఎ. పి. సి. ఎల్. సి.]

తుపాకిరాజ్యం - కొనసాగుతున్న నిర్బంధంమీద నివేదిక

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం
(APCLC)

ముద్రణ : ఏప్రిల్, 1991

ప్రతులు : 3000

వెల : 3 రూపాయలు

ముద్రణ :
చైతన్య ప్రింటర్స్, విజయవాడ-2

ప్రతులకు :
ఎస్. ఎస్. సి. బోస్
డా॥ రామనాథం ఛాంబర్ ఆఫ్ లా
పెద్దిబొట్లవారి వీధి,
గవర్నరుపేట,
విజయవాడ-520 002

# తుపాకీ రాజ్యం

## కొనసాగుతున్న నిర్బంధంపైన నివేదిక

అనుభవం నుండి ఏమీ నేర్చుకోకపోవడం మన పాలకుల లక్షణం. అణచివేతతో ఏ రాజకీయ ఉద్యమమూ అణగారిపోదని ఈశాన్య భారతంలో, పంజాబ్‌లో, కాశ్మీర్‌లో, బీహార్‌లో, ఆంధ్రలో ఒకటికి పదిసార్లు చరిత్ర వాళ్ళకు నేర్పింది. అయినా వాళ్ళు నేర్చుకోదలచుకోలేదు.

ఇప్పుడిప్పుడు కొన్ని మాటలు మట్టుకు నేర్చుకుంటున్నారు. 'పంజాబు సమస్య' నుండి 'నక్సలైట్ సమస్య' దాకా ఏదీ కూడ శాంతిభద్రతల సమస్య కాదు; అన్నీ సామాజిక ఆర్థిక మూలాల నుండి పుట్టిన రాజకీయ పరిణామాలని అనడం నేర్చుకున్నారు. వీటి పరిష్కారానికి మా పోలీసు యంత్రాంగం ఉంది చాలునననడం మానేసి మేధావులనూ, ప్రజాస్వామికవాదులనూ పిలిచి, మాట్లాడి– ముచ్చటించి– పంపడం నేర్చుకున్నారు. ఉపకమిటీలూ, సలహాసంఘాలూ ఏర్పాటు చేయడం నేర్చుకున్నారు. ఈ మాటలూ, చేతలూ నేర్చుకున్నారుగానీ అంతకంటే లోతయిన అవగాహనేదీ అబ్బినట్టులేదు. ఎందుకంటే ఆచరణ యథావిధిగా సాగుతూవుంది.

1989 చివరి భాగంలో తెలుగుదేశం ప్రభుత్వమూ, 1990 ప్రథమార్థంలో కాంగ్రెస్ ప్రభుత్వమూ మేధావులనూ, పౌరహక్కుల సంఘాలనూ పిలిచి మాట్లాడినప్పుడు ఎ.పి.సి.ఎల్.సి. కొన్ని వాస్తవాలు ప్రభుత్వాల ముందు ఉంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కాబినెట్ కమిటీకి ఎ.పి.సి.ఎల్.సి. ఇచ్చిన లిఖితపూర్వకమయిన నివేదిక 'ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల పరిస్థితి' అనే పేరుమీద (ఇంగ్లీషులో) జనవరి 1990లో అచ్చయింది. పౌరహక్కులనూ, ప్రజాస్వామ్య విధానాలనూ పునరుద్ధరిస్తానని ఆర్భాటంగా పలికిన చెన్నారెడ్డి ప్రభుత్వం ఆ పలుకులను వాస్తవం చేయాలంటే నిజానికి ఏమేమి కనీస చర్యలు చేపట్టవలసి ఉంటుందో ఆ నివేదికలో వివరించాము. 11 నెలలు వేచిచూసి మళ్ళీ ముఖ్యమంత్రికి ఒక బహిరంగలేఖ రాశాము. 'పౌరహక్కుల పునరుద్ధరణ అయిపోయినట్టేనా, ముఖ్యమంత్రిగారూ?' అన్న శీర్షికతో జాపా లక్ష్మారెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా విడుదలచేసిన - ఆ బహిరంగలేఖలో చెన్నారెడ్డి ప్రభుత్వం మాటలకూ చేతలకూ మధ్యనున్న అంతరాన్ని ఎత్తిచూపాము.

ఏ దేశంలోనయినా పరిపాలనా యంత్రాంగం ఏమాత్రం ప్రజాస్వామికంగా నడుస్తోందనడానికి ఒక అంతిమ ప్రమాణం ఉంటుంది. బ్రిటిష్ ప్రభుత్వానికి ఉత్తర ఐర్లాండ్ ప్రమాణమయినట్లు, భారత ప్రభుత్వానికి పంజాబు, కాశ్మీర్‌లు, ఈశాన్య రాష్ట్రాలు ప్రమాణం అయినట్లు ఆంధ్రప్రదేశ్ పరిపాలనా యంత్రాంగానికి నక్సలైట్ ఉద్యమం ప్రమాణం. ఈ మాట ఒప్పుకోడానికి ఆయా ఉద్యమాలతో రాజకీయంగా ఏకీభవించనవసంలేదు, వాళ్ళు చేపట్టే అన్ని చర్యలనూ మెచ్చుకోనవసరంలేదు.

పరిపాలనా యంత్రాంగంలోని ఏ సంస్థా— పోలీసులు, జైళ్ళు, న్యాయస్థానాలు, పరిపాలనా నిర్వాహకశాఖ, అభివృద్ధి శాఖలు, సంక్షేమ శాఖలు, విద్యా వైద్య శాఖలు— బడుగువర్గాలకు ఎన్నడూ న్యాయం చేయలేవు. అట్టడుగు వర్గాలు సంఘటితమయి తిరగబడితే పరిపాలనా యంత్రాంగం మరింత అన్యాయంగా స్పందిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటిదాకా బడుగువర్గాల నుండి వచ్చిన బలమయిన తిరుగుబాటు నక్సలైట్ ఉద్యమం కాబట్టి ఆ గీటురాయితో పరీక్షిస్తే ఏ సంస్థలోనూ ఏ శాఖలోనూ ఆవగింజంతయినా ప్రజాస్వామ్యం మిగలదు. భవిష్యత్తులో బడుగు వర్గాల నుండి వేరే ఏ ఉద్యమం బలంగా ముందుకొచ్చినా పరిస్థితి ఇంతకంటే భిన్నంగా ఉండబోదు.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ పాలనా యంత్రాంగంతో మొదలవ్వాలని పౌరహక్కుల సంఘం ప్రభుత్వంతో చర్చలకు వెళ్ళినప్పుడు నొక్కి చెప్పింది. రాజకీయ శాంతి కావాలనుకుంటే ముందు రాజకీయ న్యాయం ఉండేటట్టు చూడాలి. సామాజిక శాంతి కావాలనుకుంటే సామాజిక న్యాయాన్ని అందియ్యాలి. వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో అలజడులూ, ఘర్షణలూ ఉండకూడదని కోరుకుంటే కార్మికులకూ, రైతులకూ, కూలీలకూ కనీస జీవన ప్రమాణాలు, గౌరవప్రదమయిన మనుగడ, ఆరోగ్యవంతమయిన పరిస్థితులు, శ్రమకుతగ్గ ఫలితం దొరికేలాగ చూడాలి. ఇదంతా ఒక్కరోజులో జరిగేపని కాదనీ, మనది వెనకబడ్డ దేశమనీ, బ్రిటిష్‌వాళ్ళు పీల్చి పిప్పి చేసిన దేశమనీ, నాలుగు దశాబ్దాలలో అందరికీ అన్నీ ఇచ్చేయాలంటే ఎట్లాగనీ అడుగుతారు. అది నిజమే. ఇవ్వాళే భూతల స్వర్గం కావాలని ఎవ్వరూ అనడంలేదు. కానీ సమగ్రమయిన ప్రగతిబాటలో మనం ప్రయాణం చేస్తున్నామన్న దాఖలాలు కావాలి. ఈ పాలనలో న్యాయం ఎప్పటికయినా జరుగుతుందన్న విశ్వాసం ప్రజలలో కలిగించగలగాలి. అందరికీ న్యాయం చేకూర్చే సమాజాన్ని నిర్మిస్తున్నాం, ఆ బాటలో ప్రయాణం చేస్తున్నామన్న భరోసా ప్రజలలో వాస్తవికంగా కలిగించగలగాలి. ప్రజా సంక్షేమం, న్యాయ విధేయత, చట్టబద్ధత, నిజాయితీ— ఈ లక్షణాలు పరిపాలనా యంత్రాంగంలోనూ, రాజకీయ ప్రభుత్వం

లోనూ కనబడ్డరోజున రాజకీయ శాంతి, సామాజిక శాంతి ప్రజాస్వామికంగా సాధ్యమవుతాయి. లేకపోతే తుపాకులతో మట్టుకే సాధ్యమవుతాయి.

రాజకీయ ప్రభుత్వాన్నీ, పరిపాలనా యంత్రాంగాన్నీ ప్రజాస్వామీకరించడానికి తక్షణం చేపట్టవలసిన చర్యలుగా పౌరహక్కుల సంఘం కొన్నిటిని చెన్నారెడ్డి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొనింది. వాటిని అదే వరసలో తిరిగి పేర్కొని ప్రస్తుతం వాటి పరిస్థితి ఏమిటో సోదాహరణంగా చూద్దాం. ఈ పరిశీలన 'నక్సలైట్ సమస్య'కే పరిమితంకాదు. అయినప్పటికీ ఆ ప్రస్తావన తరచురావడంలో ఆశ్చర్యంలేదు. పైన చెప్పినట్టు ఆ 'సమస్య' మన రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ప్రధానమయిన గీటురాయి.

**1.** పోలీసు యంత్రాంగం : నివేదికలో ఈ విధంగా అన్నాము-

> అన్నిటికంటె ముఖ్యమయిన కర్తవ్యం పోలీసు యంత్రాంగానికి సంబంధించినది. ఈ యంత్రాంగం తనకు తానే న్యాయనిర్ణేత అయింది. ఇది కేవలం తెలుగుదేశం ప్రభుత్వం సృష్టి అని మేము అనుకోవడంలేదు. గతంలోని మీ పార్టీ ప్రభుత్వాలు (తమరి గత ప్రభుత్వంతో సహా) ప్రారంభించిన సరళిని వాళ్ళు యధాశక్తి ముందుకు తీసుకుపోయారు. తత్ఫలితంగా ఇవ్వాళ పోలీసు యంత్రాంగంమీద ఏరకమయిన నియంత్రణా లేకుండాపోయింది. న్యాయస్థానాలు సహితం పోలీసుల నుండి పౌరులకు కనీస రక్షణ కల్పించలేకుండా ఉన్నాయి. శాంతిభద్రతలను సంరక్షించడం, నేరాలను అరికట్టడం అనే పేరుమీద ఎంతటి రాక్షసత్వాన్నయినా ప్రదర్శించ వచ్చుననీ, ఏ నేరమయినా చేయవచ్చుననీ పోలీసులనుకుంటున్నారు. అధికార పార్టీల సాయుధ బలంగా పోలీసు యంత్రాంగం మారిపోయింది. పోలీసు అధికారులు ఈ క్రమంలో అధికార దుర్వినియోగంతో ఆస్తులు సంపాదించుకుంటున్నారు. ప్రజలు పోలీసులను తమ సంరక్షకులుగా కాక పీడకులుగా చూస్తున్నారు. ఈ పరిస్థితిని ఇప్పటికయినా సవరించకపోతే భారతదేశాన్ని ప్రజాస్వామ్య దేశంగా వర్ణించడంలో అర్థంలేదు.

అటువంటి సవరణ ఏమాత్రం జరగలేదని చెప్పనవసరంలేదు. లాకప్పు మరణాలు, విచ్చలవిడి పోలీసు కాల్పులు, 'ఎన్‌కౌంటర్లు', అక్రమ నిర్బంధాలు, చిత్రహింసలు, సభలపై, సమావేశాలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

లాకప్పు మరణాలు మన రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం దాదాపు 20 జరుగుతాయి. ఒక్కోసారి 25 దాకా కూడ జరుగుతాయి. కొత్త సంవత్సరంలో అప్పుడే కర్నూలుజిల్లాలో రెండు, చిత్తూరు, గుంటూరు, మెదక్, ఆదిలాబాద్,

శ్రీకాకుళం జిల్లాలో ఒకటొకటి చొప్పున 7 లాకప్పు మరణాలు జరిగాయి. అంటే ఈ సంవత్సరం లోటు లేకుండ కోటా పూర్తి అవుతుందన్నమాట. లాకప్పు మరణాల విషయంలో చట్టం స్పష్టంగానే వుంది. ఎవరినుండయినా సమాచారం రాబట్టడంకోసం కస్టడీలో బలప్రయోగం చేస్తే అది నేరం అని భారత శిక్షాస్మృతి సెక్షన్లు 330, 331లలో అంటుంది. దీనికి గరిష్ట శిక్ష 10 సం॥దాకా ఉండగలదు ఈ చిత్రహింసల ఫలితంగా ప్రాణం పోతే అది హత్యే కాగలదు. అసలు పోలీసు కస్టడీలో మరణం ఎప్పుడు జరిగినా దానిని హత్యగానే భావించాలనీ, కాదని రుజువు చేసుకునే బాధ్యత పోలీసులమీదనే పెట్టాలనీ, చట్టంలో ఆ రకమయిన సవరణ తీసుకురావాలనీ లాకమీషన్ తన 113వ రిపోర్టులో చెప్పింది. అంతదూరం పోనవసరంలేదు. కనీసం అన్ని లాకప్పు మరణాలమీదా న్యాయవిచారణలు జరిపిస్తామన్న హామీ ఏదయితే తెలుగుదేశం ప్రభుత్వం 1986లో ఇచ్చి అరకొరగా నిలబెట్టుకుందో దానిని కూడ కాంగ్రెస్ ప్రభుత్వం తృణీకరిస్తూవుంది. తెలుగుదేశం పాలనలో జరిగిన లాకప్పు మరణాల న్యాయవిచారణ నివేదికలను ఆ ప్రభుత్వమూ అమలుచేయలేదు, కాంగ్రెస్ ప్రభుత్వమూ చేయడంలేదు. దీనికి ఒకటి రెండు మినహాయింపులు మాత్రమే ఉన్నాయి. దేశమంతటా సంచలనం కలిగించిన మురళీధరన్ హత్యకేసుమీద విచారణ ఇన్నేళ్ళకు ప్రారంభమయింది. అటువంటివి ఇంకొక రెండు మూడు ఉన్నాయి. మిగిలిన నివేదికలన్నీ డి.జి.పి.గారి ఆఫీసులో చెదలకు ఆహారమయ్యాయి. కాంగ్రెస్ పాలనలో జరిగిన లాకప్పు మరణాల మీదనయితే కనీసం న్యాయవిచారణల తంతు కూడ లేదు.

లాకప్పు మరణాలకు సంబంధించిన ఒక బిల్లు రాష్ట్ర అసెంబ్లీ ముందు వుంది. ఉబుసుపోనప్పుడల్లా పౌరహక్కుల సంఘాన్ని నిషేధించాలని ప్రెస్ కాన్ఫరెన్సులు పెట్టి శాసనసభ్యులు ఓంకార్‌గారు దీనిని ప్రవేశపెట్టారు. ఎక్కడ లాకప్ మరణం జరిగినట్టు తెలిసినా జిల్లా జడ్జి దానిని కేసుగా నమోదు చేసుకొని సాక్షులు పిలిపించి రికార్డుచేసి ప్రాసిక్యూషన్‌కు అప్పగించాలనీ, దానికి కావలసిన సవరణలు భారత శిక్షాస్మృతిలోనూ, నేర విచారణ స్మృతిలోనూ తీసుకురావాలనీ ఈ బిల్లు ప్రతిపాదన. దీనిని రాష్ట్ర అసెంబ్లీ ఒకసారయినా చర్చించిందో లేదో తెలియదు. ఈ బిల్లుకు, లా కమిషన్ సూచించినట్టు 'రుజువు చేసుకొనే బాధ్యత'ను పోలీసుల మీదనే పెట్టే అంశాన్నికూడా చేర్చి, విస్తృతంగా ప్రచారం చేయడం అవసరం. శాసనసభ్యులమీద ఒత్తిడిపెట్టి ఆమోదింపజేయడం అవసరం.

అయితే, చెన్నారెడ్డి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో చెప్పినట్టు—

> చట్టపరమయిన చర్యలకంటే ముఖ్యమైనది పోలీసు యంత్రాంగం పైన సరయిన నియంత్రణ ఉండడం, పోలీసు అత్యాచారాలను అంతం చేయడం అనేది ప్రధానంగా రాజకీయ విషయం. ఆ నిర్ణయం ప్రభుత్వం తీసుకొని అమలుచేయాలి. చట్టవ్యతిరేక నేరపరిశోధన పద్ధతులకు పాల్పడడానికి వీలులేదని ప్రభుత్వం పోలీసులకు కచ్చితంగా చెప్పాలి. అటువంటి చర్యలకు పాల్పడే వాళ్ళను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించాలి. పోలీసుల కార్యకలాపాలను పర్యవేక్షించే అధికారం వున్న ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లకు అంతటి సాహసం చేయడానికి అవసరమయిన రాజకీయ మద్దతు ప్రభుత్వం కల్పించాలి.

ఈ రాజకీయ నిర్ణయమే ప్రధానంగా లోపించిందని అర్థమవుతూవుంది. నిజానికి రాజకీయ నాయకులకూ పోలీసు యంత్రాంగానికీ దుశ్చర్యలకు పాల్పడడంలో చేదోడువాదోడు సంబంధం ఉంది. అక్రమ సంపాదనకు, భూముల దురాక్రమణకు, ఎన్నికలలో రిగ్గింగ్ చేయడానికీ, ప్రజలనూ, ప్రత్యర్థులనూ భయపెట్టి బెదిరించి గెలవడానికీ రాజకీయ నాయకులకు పోలీసుల అండదండలు కావాలి. ఈ పరిస్థితులలో వారు స్వచ్ఛందంగా పోలీసులను నియంత్రిస్తారనుకోవడం కల్ల. చాలా పెద్ద ఎత్తున ప్రజలవైపునుండి ఒత్తిడి అవసరం. ఒక సత్పరిణామం ఏమిటంటే ఈ మధ్యకాలంలో లాకప్పు మరణాలు తదితర పోలీసు అత్యాచారాలపట్ల ప్రజలు బలంగా స్పందిస్తున్నారు. బంద్‌లూ, రాస్తారోకోలూ చేసి అధికార్లను లొంగదీసుకొని తమకు విశ్వాసం ఉన్న డాక్టర్‌చేత పోస్టుమార్టం చేయించుకుంటున్నారు. పోలీసులమీద కేసు నమోదు చేయిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఇక్కడితో ఆందోళన ఆగిపోతూ వుంది. అది ఇంకా ముందుకుపోయి సంపూర్ణరూపం తీసుకున్ననాడు పోలీసు యంత్రాంగంమీద నియంత్రణ సాధ్యం అవుతుంది.

పోలీసు కాల్పులు మన రాష్ట్రంలో ఒకప్పుడు ప్రధాన పౌరహక్కుల సమస్యకాదు. ఒక ఇంద్రవెల్లి, ఒక టంగుటూరు, ఒక చీరాల, ఒక కొండమొదలు సంవత్సరానికి ఒకటో రెండో పెద్ద సంఘటనలు జరిగేవి. కాని గత రెండేళ్ళగా అడ్డూ ఆపూ లేకుండ కాల్పులు జరుగుతున్నాయి. సామాజిక శాంతికి భంగం కలిగించగల గుంపులమీద బలప్రయోగం జరిపేటప్పుడు పోలీసులు పాటించవలసిన ఖచ్చితమైన నియమాలు పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్‌లో ఉన్నాయి. పోలీసులు వాటిని ఎన్నడూ పాటించరు. అన్నిటికంటే ప్రాథమిక నియమం, అలజడి జరగగలదని తెలిసినప్పుడు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ను పిలవాలనేది. పోలీసులు దానితో మొదళ్ళు

పెట్టి దేనినీ పాటించరు. సమాజంలో అశాంతి, ప్రజలలో అసంతృప్తి, పాలనా వ్యవస్థపట్ల అసహనం పెరిగేకొద్దీ ప్రజాసమూహాలమీద పోలీసు కాల్పులూ పెరుగుతాయి. ఎందుకంటే వీటిలో దేనికీ తుపాకులతో తప్ప ఇతరత్రా సమాధానం చెప్పే సత్తా పాలనా వ్యవస్థలో లేదు.

పోలీసు చిత్రహింసల గురించి చెప్పుకునేటప్పుడు ఒక వింత విషయం ఏమిటంటే ఇవ్వాళ పౌరహక్కులను గురించి మాట్లాడని పోలీస్ ఆఫీసర్ లేడు, రాజకీయ నాయకుడు లేడు. కానీ చిత్రహింసలు ఎప్పటిలాగ ఉండడమే కాదు, కొత్త రూపాలు తీసుకుంటున్నాయి కూడ. కరెంట్ షాక్ ఒకప్పుడు చాలా తీవ్రమైన నేరాల విచారణలోమట్టుకే ప్రయోగించేవారు. ఇప్పుడు చాలా విరివిగా ప్రయోగిస్తున్నారు. అది మనిషి శరీరంమీద గుర్తు వదలని హింసారూపం కావడంవల్లనేమో, ఈనాటి చదువు మీరిన పోలీస్ అధికార్లకు నచ్చుతూవుంది. పైకి మాటలలో మట్టుకు చాలా తేడా వచ్చింది. ఒకప్పుడు పౌరహక్కులు అన్న మాట వింటేనే పోలీస్ ఆఫీసర్లు మండిపడేవారు. ఇప్పుడు వాళ్ళే చాలా సౌమ్యంగా పౌరహక్కుల గురించి లెక్చర్లిస్తున్నారు. పౌరహక్కుల నాయకులను పోలీస్ అకాడమీకి పిలిచి లెక్చర్లు ఇప్పించుకుంటున్నారు.

ఎన్‌కౌంటర్ల విషయంకూడ ఇంతే. 'నిజమైన ఎన్‌కౌంటర్లు జరగవచ్చునుగానీ బూటకపు ఎన్‌కౌంటర్లు ఎట్టి పరిస్థితులలోనూ జరగనివ్వమని' రాష్ట్ర ముఖ్యమంత్రి, డి.జి.పి.లు పదేపదే ప్రకటిస్తున్నారు. ఒకప్పుడు అటువంటి ప్రకటనలు ఇచ్చేవారే కాదు. అయినా జరిగేవిమట్టుకు జరుగుతూనే ఉన్నాయి. ఈ వ్యాసానికి అనుబంధంగా కాంగ్రెస్ పాలనలో గత సంవత్సరకాలంలో 45మంది ప్రాణాలు తీసిన 'ఎన్‌కౌంటర్ల' వివరాలు ఇచ్చాము. వాటిని చదివితే మాటలలోనేతప్ప ఆచరణలో తేడా ఏమీ రాలేదని అర్థం అవుతుంది. వీరిలో ఇద్దరు మాత్రమే పోలీస్ కానిస్టేబుళ్ళు.

రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో 'ఎన్‌కౌంటర్ల' గురించి వివరంగా ప్రస్తావించాము. నక్సలైట్ ఉద్యమం ప్రారంభమైన నాటినుండి మొన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చినదాకా మొత్తం 660 మంది ఎన్‌కౌంటర్లలో మరణించారని చెప్తూ ఈ విధంగా అన్నాము :

> హింసాత్మకమైన అణచివేత విధానం సమస్యను పరిష్కరించకపోగా, అట్టడుగు వర్గాల ప్రజానీకానికి చాలా హాని కలగజేస్తుంది. ఎన్‌కౌంటర్లలో ఇప్పటికి (అంటే 1990 జనవరి నాటికి) చనిపోయిన 660మందిలో అత్యధికులు పేద రైతాంగం, లేక గిరిజన రైతాంగానికి చెందినవారు. చిత్రహింసలు, ఆస్తుల విధ్వంసనం, అక్రమ కేసులు మొదలయిన అణచివేతను

అనుభవించినవారూ ప్రధానంగా ఈ వర్గాల ప్రజలే. ఈ అణచివేత ప్రారంభమైననాడు రాష్ట్రంలో 660 మంది నక్సలైట్లు ఉండి ఉందరు. అయినా అంతమందిని చంపిన తరువాతకూడ మీరు సమస్యను పరిష్కరించలేక పోయారు సరికదా, నక్సలైట్ ఉద్యమం వర్ధిల్లుతూనే వుంది. ఇదయినా మీ కళ్ళు తెరిపించాలి. అణచివేత విధానం రాజ్యాంగ వ్యతిరేకమేకాక సమస్య పరిష్కారానికి అయోగ్యమైన విధానం అని మీకు దీనినుండయినా అర్థం కావాలి.

కేవలం చట్టపరంగా చూసినా 'ఎన్‌కౌంటర్' అనేది ఆత్మరక్షణార్థం చేసే హత్య. ఆత్మరక్షణ చేసుకునే హక్కు భారత శిక్షాస్మృతి పోలీసులకే కాక పౌరులందరికీ ఇచ్చే మినహాయింపు. భారత సాక్ష్యాల చట్టం ప్రకారం, ఈ మినహాయింపును కోరేవారు దానికితగ్గ పరిస్థితులు ఉన్నాయని తామే రుజువు చేసుకోవాలి. ఈ విషయంలో చట్టం సాధారణ పౌరులకూ, పోలీసులకూ తేడా చూడదు. కాబట్టి 'ఎన్‌కౌంటర్' జరిగినప్పుడు సంబంధిత పోలీస్ అధికార్లను హత్య కేసులో అరెస్టుచేసి విచారించాలి. ఆత్మరక్షణకై చేయవలసి వచ్చిందని ముద్దాయిలే రుజువు చేసుకోవాలి. ఇదొక్కటే చట్టబద్ధమైన మార్గం.

మేము సుప్రీంకోర్టులో 'ఎన్‌కౌంటర్ల'పైన దాఖలుచేసిన రిట్ పిటిషన్ ప్రస్తుతం విచారణలో వుంది. (W.P. నెం. 68/1982, మందడి నరసింహారెడ్డి వర్సస్ స్టేట్ ఆఫ్ ఆం.ప్ర.) ఈ పిటిషన్‌లో 1980-81 సంవత్సరాలలో రాష్ట్రంలో జరిగిన 'ఎన్‌కౌంటర్ల'ను ప్రస్తావించాము. తరువాత మరికొన్ని ఎన్‌కౌంటర్ల వివరాలుకూడ సుప్రీంకోర్టుకు ఇచ్చాము. గత సంవత్సరం సుప్రీంకోర్టు ఈ కేసులో ఒక ఆర్డర్ జారీచేస్తూ, మమ్మల్ని రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని వివరాలతో అర్జీ పెట్టుకొమ్మని ఆదేశించింది. మేము 'ఎమర్జెన్సీ' ఎత్తివేసిన తరువాత జరిగిన అన్ని ఎన్‌కౌంటర్ల వివరాలూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చాము. ఇప్పుడు మీ ప్రభుత్వం వీటిమీద చర్య తీసుకొని సుప్రీంకోర్టుకు రిపోర్టు సమర్పించుకోవలసి ఉంది.

అయితే లాకప్పు మరణాలలాగే ఈ విషయంలోకూడ రాజకీయ నిర్ణయం ప్రధానమయినది. ఈ హత్యలు అధికారంలో వున్న ప్రభుత్వం ప్రోత్సాహంతో, అనుమతితో జరుగుతున్నాయనడంలో సందేహం అవసరం లేదు. ఈ హత్యలుచేసి పోలీస్ అధికార్లను చట్టంనుంచి కాపాడడమేకాక, వారికి ఆర్థిక పురస్కారాలూ ప్రమోషన్లూ ఇస్తున్నారు. పోలీసులు దీనిని

ఆసరా చేసుకొని సాయుధ నక్సలైట్లనే కాక రైతులనూ, కూలీలనూ, కార్మికులనూ కేవలం సానుభూతిపరులయినందుకు కాల్చేస్తున్నారు.

పౌరహక్కులను గురించి మాట్లాడడం, బూటకపు ఎన్‌కౌంటర్లు జరగవని హామీలు ఇవ్వడం పాలకులు కొత్తగా నేర్చుకున్నారుగానీ ఆచరణలో పై పరిస్థితి కొనసాగుతూ వుంది. ఆ నివేదికలో పేర్కొన్న 660 కి ఇప్పుడు మరొక 43 మంది చేరారు. వీళ్ళు అవే వర్గాలకు చెందినవారే, అదేవిధంగా చంపబడ్డవారే.

**2. వాక్ సభాస్వాతంత్ర్యాలు :** ప్రజల సమస్యలు పరిష్కారం చేయలేని పాలకులు కనీసం ఆ సమస్యల వ్యక్తీకరణకు స్వేచ్ఛనివ్వాలి. అది పాలనా వ్యవస్థనుండి ప్రజలు కోరుకునే కనీస న్యాయం. భారత రాజ్యాంగం అధికరణం 19(1)లో హామీ యిచ్చిన ప్రాథమిక హక్కుకూడ.

రాష్ట్రంలో ఈ హక్కు మీద, వ్యక్తీకరణ స్వేచ్ఛ మీద, పెద్ద ఎత్తున దాడి జరుగుతూవుంది. సంఘాలు పెట్టుకునే హక్కు, సభలూ సమావేశాలూ జరుపుకునే హక్కు, పోలీసుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే పరిస్థితి వచ్చింది. అచ్చంపేట, గజ్వేల్, భువనగిరి సభలను భగ్నం చేసినప్పుడు, రాడికల్స్ సభలకు అనుమతి పొందడం కోసం కిడ్నాప్‌లకు పాల్పడుతున్నారనీ, లారీయజమాన్లనూ ఆర్టీసీ డిపో మేనేజర్లనూ బెదిరించి వాహనాలు తీసుకుంటున్నారనీ, కరెంటు సప్లయి ఉచితంగా చేయాలని విద్యుత్ శాఖను బెదిరిస్తున్నారనీ పోలీసులూ, ప్రభుత్వమూ కారణంగా చూపారు. ఈ ఆరోపణల నిజానిజాలు అటుంచి ఇవేవీ కూడ సభకు అనుమతి ఇవ్వకపోవడానికీ, సమావేశమయిన ప్రజానీకం మీద తుపాకులు ప్రయోగించడానికీ నెపాలు కాజాలవు. చట్టవ్యతిరేకమయిన ఒత్తిడికి లొంగి బస్సులుకానీ, విద్యుత్తుకానీ ఇవ్వనవసరంలేదు. అయితే సభను భగ్నం చేయడానికి అది కారణం ఎట్లా అవుతుంది ?

తన వాదన వాదనకోసం చేస్తున్నదే తప్ప దానిలో నిజాయితీలేదని ప్రభుత్వమే త్వరలో రుజువు చేసుకుంది. ఏ నెపమయితే రాడికల్స్‌మీద పెట్టారో ఆ నెపం పెట్టలేని పార్టీలకూ, సంఘాలకూ కూడ సమావేశ హక్కు లేకుండ చేసినప్పుడు ఈ విషయం స్పష్టం అయింది. తిరుపతిలో ఓపిడిఆర్ సభను, చిల్లకల్లులో వివిధ దళిత సంఘాల సభనూ, విశాఖపట్నంలో పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటయిన మత వ్యతిరేక వేదిక సమావేశాన్ని భగ్నం చేసారు. ప్రగతిశీల మహిళాసంఘం సభలకూ, సమావేశాలకూ కరీంనగర్,

వరంగల్ జిల్లాలలో అనేక ఆటంకాలు ఏర్పరచారు. ఈ సంస్థ లేపీ ఎవ్వరినీ కిడ్నాప్ చేయలేదు; ఉచితంగా ఏ వసతీ ఇమ్మని ప్రభుత్వాన్ని బెదిరించలేదు.

ఈ వాదనలన్నీ కేవలం సాకులే. అధికార యంత్రాంగం పరిష్కరించ లేని సమస్యలను ఎత్తిచూపే స్వేచ్ఛను అది గౌరవించలేకపోతూవుంది. అణచి వేతకు గురయ్యే అట్టడుగు వర్గాల ప్రజల హక్కులను గురించి మాట్లాడే సంఘా లలో సభ్యత్వమే నేరం. వాటి కార్యక్రమాలలో పాల్గొనడం నేరం. వాటి సిద్ధాంతా లను అభిమానించడం నేరం. వాటి సాహిత్యం చదవడం నేరం. ఆ ఉద్యమాలలో, ఉద్యమ కారులు నేరాలకు పాల్పడితేనూ చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తే వా చర్యతీసు కోవడంపేరు. దానికి ఎవ్వరూ అభ్యంతరం చెప్పరు. ప్రభుత్వం శాంతిభద్రతలకర్త వ్యాలను వదిలేయాలని ఏ పౌరహక్కుల సంఘమూ అనడంలేదు. కానీ ప్రభుత్వా నికి ఇబ్బంది కరమయిన రాజకీయాలలో పాల్గొనడమే నేరం అనడానికి వీలులేదు. అదే ఇవ్వాళ జరుగుతూవుంది. పోలీసులు గ్రామాల మీద దాడులు చేస్తూ జనాన్ని హింసిస్తూవున్నది వాళ్ళేవో నేరాలు చేసారనికాదు (నేరాలు చేసినా హింసించే అధి కారం పోలీసులకు లేదన్నది వేరే సంగతి). వాళ్ళు ఫలాన సంఘంలో సభ్యులని, ఫలాన పాటలు పాడుతున్నారని, ఫలాన మీటింగ్‌కు వెళ్లారని, ఫలానా అభ్యర్థికి వోటువేసారని లేదా వోటునే బహిష్కరించారని, ఇంకా ఎక్కువగా ఫలానవారికి అన్నంపెట్టారని వాళ్ళను అరెస్టు చేస్తున్నారు. కరెంటుషాక్ ఇస్తున్నారు. తోలు ఊడగొడుతున్నారు. లాకప్పులో వారంరోజులో పదిరోజులో ఉంచుకొని ఏవో ఒక కేసులో ఇరికిస్తున్నారు. ఈ మధ్యకాలంలో తెలంగాణా జిల్లాలలో పోలీసుల చేతిలో దెబ్బలు తిన్నవాళ్ళు, అరెస్టయి జైలుకు పోయినవాళ్ళు, ఇతర రూపాల నిర్బం ధానికి గురయిన వాళ్ళ జాబితాచేసి వారిమీద పోలీసుల అభియోగం ఏమిటని పరిశీ లిస్తే 'అన్నలకు అన్నం పెట్టడం' అనేది ప్రధాన అభియోగం అని తెలుస్తుంది.

విలేఖరుల మీద జరుగుతున్న పోలీసు దాడులను పరిశీలిస్తే ఈ దాడు లకు శాంతి భద్రతల నిర్వహణతో ఏమీ సంబంధం లేదనీ, ఇది రాజకీయమనీ స్పష్టంగా అర్థమవుతుంది. 'నక్సలైట్ల వార్తలు రాసే విలేకర్లను తన్నండి' అని మెదక్ జిల్లా ఎస్.పి. ప్రజలను రెచ్చగొడుతూ మాట్లాడుతున్నాడు. మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లా లలో 'నక్సలైట్ల అణచివేత'లో భాగంగా పోలీసులు విలేకరుల మీదదాడులుచేసారు. కొట్టారు. అవమానించారు. హింసించారు. 'టాడా' కేసులు పెట్టారు. పోలీసు అధి కార్లు విలేఖరులంటేనే మండి పడుతున్నారు. పత్రికలు సమాజంలోని ప్రబలమయిన

వాస్తవాలను వ్యక్తీకరిస్తాయి. అది వాటి కర్తవ్యం. ఏ రాజకీయానికయినా ప్రజలలో ఉంటే ప్రభావాన్నిబట్టి ప్రాముఖ్యం ఇస్తాయి. పాలకులకు అప్రియమయిన ఉద్యమాలకు ప్రజలలో ప్రభావం ఉంటే వాటినీ పత్రికలు వ్యక్తీకరిస్తాయి. ఆ అప్రియమయిన ఉద్యమాలను పోలీసులకు అప్పజెప్పి, ఏ గడ్డయినా కరిచి అణచి వేయండి అని పాలకులు ఆదేశించేసరికి పత్రికల ఈ సహజకర్తవ్యం పోలీసు వ్యవస్థతో ఢీకొనవలసి వస్తూవుంది. పత్రికా యాజమాన్యం తమ హక్కులకొరకు నిలబడకపోతే సాధారణ విలేఖరులు బలవుతారు. భావప్రకటనా స్వేచ్ఛ మీద జరుగుతున్న దాడికి పరాకాష్ట రాష్ట్రంలో విలేకరుల అభద్రపరిస్థితి.

**3. అక్రమకేసులు, 'టాడా':** క్రిందటి సంవత్సరం రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమాన్ని అణచడంలో భాగంగా 6000 మందిని అరెస్టు చేసినట్టు డిజిపి స్వయంగా ప్రకటించారు. ఈ సంవత్సరం అదేవేగంతో అరెస్టులు సాగుతున్నాయి. దీనిని గురించి పౌరహక్కుల సంఘం బాధ్యులు నిరసన తెలపగా, 'కిడ్నాప్‌లు, బస్సుదహనాలు, హత్యలు చేసేవాళ్ళను అరెస్టుచేయొద్దంటారా' అని డిజిపి ఎదురు ప్రశ్నవేస్తున్నారు.

నిజమయిన నేరాలకు పాల్పడ్డ వాళ్ళను అరెస్టు చేయొద్దని ఎవరూ అన లేదు. నేరాలను నిరోధించడానికి అవసరమయిన చట్టపరమయిన చర్యలు చేపట్ట వద్దనీ అనలేదు. కానీ నిత్యం అరెస్టవుతూన్న వందల మంది నిజమయిన నేరాలకే అరెస్టవుతున్నారనుకుంటే అది పొరబాటే.

అరెస్టులు ఎక్కువగా కేవలం రాజకీయంగా జరుగుతున్నాయని పైన చెప్పాము. 'నక్సలైట్ల సానుభూతి పరులు' అనిచెప్పి అరెస్టు చేయడం, ఆపైన బాంబు పట్టుకొని తిరుగుతున్నారనో, ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్రచేస్తున్నా రనో కేసు పెట్టడం పరిపాటి అయింది.

ఇవికాక, భూమి దురాక్రమణ (ఐపిసి 447) క్రింద రెండు మూడువేల మందిని ఈ రెండేళ్ళలో అరెస్టు చేసారు. వీళ్ళు హైదరాబాద్‌లో, విజయవాడలో వున్న భూమికబ్జాదారులు కారు. ప్రజల భూములను లాక్కొని అనుభవిస్తూవున్న భూస్వాములుకారు. వీళ్ళంతా కూడ ప్రభుత్వ భూములు, భూస్వాముల భూములో మున్నుకుంటూ వున్న వ్యవసాయ కూలీలు. 40 ఏళ్ళుగా భూసంస్కరణలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయిన ప్రభుత్వం ఆ చట్టాన్ని పేదలే అమలుచేసు కుంటే వాళ్ళను అరెస్టుచేసి జైలుకు పంపించడం సిగ్గుచేటయిన విషయం. పైగా ఆ అరెస్టులు చేసిన పద్ధతి కూడ చాలా అమానుషమయినది. ఆక్రమించుకున్న

భూమిలో వేసుకున్న పంట కోతకు ఎదిగి చేతికొచ్చిన సమయంలో వాళ్ళను అరెస్టు చేసి నోటికాడి కూడు కొట్టేస్తారు.

ఈ రకంగా వివిధ అక్రమ కారణాలవల్ల అరెస్టవుతూన్న వాళ్ళమీద ఎక్కువగా 'టాడా' కేసులు పెడుతున్నారు. మొత్తం తెలుగుదేశం హయాంలో ఎంత మంది మీద 'టాడా' పెట్టారో ఆ సంఖ్యను కాంగ్రెసు పాలకులు ఒక్క సంవత్సరంలోనే మించి పోయారు. ఒక్క పర్మెట్ట కాల్పుల కేసులోనే 348 మంది మీద 'టాడా' పెట్టారు. 'టాడా' చట్టాన్ని రాష్ట్రంలో ఎట్టి పరిస్థితులలోనూ ఉపయోగించబోమని హామీ ఇవ్వాలని కోరుతూ, రాష్ట్రప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో ఈ విధంగా అన్నాము.

> టెర్రరిస్టు మరియు విచ్ఛిన్నకర కార్యకలాపాల (నిరోధక) చట్టాన్ని ('టాడా') 1985 లో కేంద్రప్రభుత్వం రూపొందించింది. పంజాబులోని ప్రత్యేక పరిస్థితి దృష్ట్యా ఈ ప్రత్యేక చట్టం అవసరం అని అనాడు కేంద్ర ప్రభుత్వం వాదించింది. ఈ చట్టం లక్ష్యప్రకటనలో పంజాబు, ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ ప్రస్తావన ఎక్కడాలేదు. 1988 మార్చిలో ఇచ్చిన ఒక తీర్పులో, సాధారణ శాంతి భద్రతల యంత్రాంగం పనిచేయలేని పరిస్థితి ఏర్పడినప్పుడు మాత్రమే 'టాడా' నుపయోగించాలిగానీ చీటికి మాటికీ ప్రయోగించకూడదని సుప్రీంకోర్టు అనింది. ఆంధ్రప్రదేశ్‌లో అంతటి పరిస్థితి ఉందనలేము. అయినప్పటికీ ఆ చట్టాన్ని రాష్ట్రంలో విస్తృతంగా ప్రయోగిస్తున్నారు.
>
> 'టాడా' క్రింద అరెస్టవుతున్న వారిలో అత్యధికులు అజ్ఞాత నక్సలైట్లుకారు. పేద రైతులు, కూలీలు, కార్మికులు, గిరిజనులు, 'టాడా' అత్యంత అప్రజాస్వామికమయిన చట్టం. సహజన్యాయ సూత్రాలకు వ్యతిరేకమయిన చట్టం. భారత రాజ్యాంగంలోని అధికరణాలు 14, 19(1), 20(3), 21 లకు టాడా వ్యతిరేకమనీ, ఆ చట్టాన్ని కొట్టి వేయాలనీ కోరుతూ దాఖలయిన రిట్ పిటిషన్లు ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ హైకోర్టులలోనూ సుప్రీం కోర్టులోనూ విచారణకు ఉన్నాయి.

ఈ నివేదిక సమర్పించిన తరువాత రాష్ట్రంలో 'టాడా' వినియోగం పెరిగింది!

'టాడా' గురించి చెప్పేటప్పుడు ఒక్క విషయం నొక్కి చెప్పాలి. ఆ చట్టాన్ని నక్సలైట్ సానుభూతిపరుల మీదనే కాక కొన్ని ఇతర వర్గాల మీద

కూడ ప్రయోగిస్తున్నారు. ప్రధానంగా, హైదరాబాద్ పాతబస్తీలో మత సంఘర్ష ణలో అరెస్టయిన వారిమీద, రాయలసీమ జిల్లాలలో నాటు బాంబుల ముఠా తగాదా లలో అరెస్టయిన వారిమీద. ఈ రెండు ప్రాంతాలలోనూ ఘర్షణలవల్ల ఉపయోగం పొందుతున్న వాళ్ళు ప్రముఖ రాజకీయ నాయకులు. హైదరాబాదులో ఈ మధ్య జరిగిన 'మతఘర్షణ'లలో కొందరు కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన పాత్ర, దాని ఫలితరగా వాళ్ళు పొందిన ప్రయోజనం రాష్ట్రమంతటా తెలిసిన విషయాలే. బి.జె.పి., మజ్లిస్ నాయకులు ఈ రకమయిన ఘర్షణల నుండి ప్రయోజనాన్ని ఎంతకాలంగానో పొందుతున్నారు. ఇక రాయలసీమ మాటకొస్తే అక్కడి ముఠా కొట్లాటలు రాజకీయ నాయకులకు ఆలంబన. అవే వాళ్ళ రాజకీయ పునాది.

ఈ నాయకులంతా బాగానే వున్నారు గానీ తెలిసో తెలియకో వాళ్ళ ముఠా ప్రయోజనాలకోసం పనిచేసినవారు మట్టుకు 'టాడా' క్రింద జైలుకు పోతు న్నారు. వీళ్ళందరితో కలుపుకుంటే రాష్ట్రంలో మొత్తం 'టాడా' ముద్దాయిల సంఖ్య 10 వేలకు సమీపంలో ఉంది.

**4) సామాజిక న్యాయం :** శాంతిభద్రతలు ప్రజాస్వామికంగా నెల కొనాలంటే పోలీసు యంత్రాంగాన్ని నియంత్రించడం, నల్లచట్టాలను తొలగించడం, అత్యాచారాలు చేసే పోలీస్ అధికార్లమీద కేసులు పెట్టడం ఇవన్నీ అవసరమే కానీ ఇవి సరిపోవు. ఈ పరిపాలనా వ్యవస్థలో తమకు న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ప్రజలలో కల్పించాలి.

ఇందులో ప్రజలలోని వివిధ వర్గాల జీవితాలు మెరుగుపడడం ఒక అంశం. భూమిలేని వారికి భూములు, పేదరైతులకు రుణ సౌకర్యం, సేద్యపు నీటి సౌకర్యం, మొత్తం రైతాంగానికి చవకగా విద్యుత్తు, ఎరువులు, మందులు, నీటి వసతి కల్పించాలి. గ్రామీణప్రాంత యువజనంలో ఇవ్వాళ సగభాగం ఏదో ఒక మేరకు నిరుద్యోగ పీడితులయి ఉన్నారు. వాళ్ళకు ఉద్యోగాలు కల్పించాలి. దానికోసం అవసరమయిన గ్రామీణ పారిశ్రామికీకరణ చేపట్టాలి. కూలీలకూ రైతు లకూ శ్రమకుతగ్గ ఫలం దక్కేటట్టు చూడాలి. 4 దశాబ్దాల తర్వాత దేశంలో అక్షరాస్యత 50 శాతం చేరుకుందని చెప్తున్నారు. మిగిలిన 50 శాతం ఇంకెన్ని దశాబ్దాలకు పూర్తి కావాలో. ఇప్పటికి మట్టుకు అదుపు లేకుండా పెరిగిపోతూన్న దరలను అరికట్టి 3 కోట్లు దాటిన నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పించడం తక్షణ సమస్యగా ముందుకొచ్చింది.

ఈ సమస్యల పరిష్కారం దిక్కుగా మన సమాజం ప్రయాణం చేస్తూ వుందన్న విశ్వాసం ప్రజానీకంలో విస్తృతంగా కలిగించలేని పాలన ఏదీ ప్రజా

స్వామికంగా ఉండలేదు. అది దేశాన్ని తుపాకీలతోనే పరిపాలించగలదు. ఆ తప్పు ప్రజల మీదికి నెట్టి ప్రజలు తీవ్రవాదులయిపోతున్నారనీ, విచ్ఛిన్నకారులయి పోతున్నారనీ కేసులు పెట్టి కాల్చిపారేసి అణచివేయాలని చూస్తే ప్రజాస్వామిక వాదులు ఊరుకోవడానికి వీలులేదు.

సంపూర్ణమయిన సామాజిక ఆర్థిక న్యాయం కోసమయినా, పీడితవర్గాలకు బలవంతుల దాడుల నుండి కనీస రక్షణ ఉంటుందన్న విశ్వాసమయినా ప్రజలలో కల్పించగలగాలి. ఈ విషయంలోనూ రాష్ట్ర పాలనా యంత్రాంగం వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతూ వుంది. భూస్వాముల దాడుల నుండి కూలివాళ్ళకుగానీ, అగ్రకుల పెత్తందార్ల దాడుల నుండి దళితులకుగానీ, పురుషాహంకారం నుండి స్త్రీలకుగానీ కనీస రక్షణ కరువయింది. కనీస న్యాయం కరువయింది. కడపజిల్లా పులివెందుల, శ్రీకాకుళం జిల్లా జీరుపాలెం, తూర్పుగోదావరి జిల్లా పేట్లపాలెం, పీరారం, ప్రకాశం జిల్లా తిమ్మసముద్రం, హైద్రాబాదులో ఎన్టీఆర్ నగర్, విజయ నగరం జిల్లాలో కస్పాగదబవలస దాడులు ఈ మధ్య కాలంలో రాష్ట్రంలో బాగా ప్రచారం అయ్యాయి. అన్ని సంఘటనలలోనూ బడుగువర్గాల ప్రజల ఇళ్ళు అగ్నికి ఆహూతయ్యాయి. కొందరు ప్రాణాలు కోల్పోయారు. అన్ని సంఘటనలలోనూ దాడి చేసిన పెత్తందార్లకు అధికార పార్టీనాయకులు, పోలీసుల అండ వుంది. అన్నింటిలోనూ నెలలతరబడి దుండగులను అరెస్టు చేయడం, కేసుపెట్టడం జరగ లేదు. తిరిగి మళ్ళీ బాధితులే భయభ్రాంతులయి బతకవలసి వస్తూవుంది.

గత నవంబర్‌లో పౌరహక్కుల పునరుద్ధరణ అయిపోయిందా అని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తూ అచ్చువేసిన బహిరంగ లేఖలో ఇటువంటి దాడులను ప్రస్తావిస్తూ ఈ విధంగా అన్నాము

> ఇక్కడ మరీ తీవ్రమయిన కొన్ని సంఘటనలను మాత్రమే పేర్కొన్నాము. నిజానికి రాష్ట్ర వ్యాపితంగా మీ పార్టీకీ, మీకూ సన్నిహితులయిన భూస్వాములు పేదలమీద దాడులు చేస్తున్నారు. పోలీసులు ప్రేక్షకులుగా చూస్తున్నారు. మీరు అధికారానికి వచ్చి 10 నెలలు గడిచినా కారంచేడు కేసు విచారణను త్వరితం చేయలేకపోయారంటే మీ నిర్లక్ష్యం ఎంతటిదో అర్థం అవుతుంది. దళితుల మనస్సులలో ఈ నిర్లక్ష్యం ఎంతటి వైమనస్యాన్ని కలిగిస్తుందో ఊహించడం కష్టం కాదు. గౌరవప్రదమయిన జీవితం కావా లనే ప్రాథమికమయిన ఆకాంక్షను ఇంతగా నిర్లక్ష్యం చేసిన తరువాత వాళ్ళకు శాంతియుతమయిన ఆందోళనా పద్ధతుల పట్ల విశ్వాసం సన్నగిల్లితే ఆ తప్పు మీదే అవుతుంది.

అయితే మీ వైఖరి అన్ని విషయాలకంటే రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన పట్ల మీరు చూపుతూ వున్న అసాధారణమయిన సహనంలో నగ్నంగా బయటపడింది. వాళ్ళు బహిరంగంగా దళితులను కించపరిచే మాటలు అంటున్నా మీరు కిమ్మనకుండ వున్నారు. రిజర్వేషన్‌లను వ్యతిరేకించే వాళ్ళకు వాక్ సభా స్వాతంత్ర్యాలు ఉండకూడదని మా ఉద్దేశ్యంకాదు. అయితే దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడవలసిన రాజ్యాంగ నిర్దేశిత కర్తవ్యం మీ ప్రభుత్వం మీద వుంది. అగ్రకులాల ప్రచారాన్ని మీరు బహిరంగంగా ఎదుర్కొని రిజర్వేషన్ విధానాన్ని వివరిస్తూ ప్రచారం చేపట్ట వలసి ఉండింది. అతికాక, మీ ప్రభుత్వంగానీ, గతంలో వేరే ఏ ప్రభుత్వం గానీ ఎవ్వరి ప్రజాస్వామిక స్వేచ్ఛలనూ ఇంతగా గౌరవించలేదనేది అందరికీ స్పష్టంగా తెలుస్తూ వుంది.

రిజర్వేషన్ వ్యతిరేకులు ప్రభుత్వ ఆస్తులను విచ్చలవిడిగా ధ్వంసం చేస్తూ వుంటే మీ పోలీసులు ఎంత ఉదారంగా చూస్తూ వున్నారో దళితులు గమనిస్తున్నారు. అదే పేదవాళ్ళు ఎక్కడయినా ఎంత న్యాయమయిన ఆందోళన నడిపినా వాళ్ళను పోలీసులు ఎంత పాశవికంగా అణిచేస్తారో అందరికీ తెలుసును. ఈ తేడా నుండి వాళ్ళు మీ పాలన తమకు కల్పించగల న్యాయాన్ని గురించి అవిశ్వాసం పెంచుకున్నా, సామాజిక శాంతికి భంగకరమయ్యే అభిప్రాయాలు ఏర్పరచుకున్నా ఆశ్చర్యం ఏముంది ?

గ్రామీణ పేదలు దళితులు భూస్వాముల దాడులనూ, కులపరమయిన దాడులనూ ఎదుర్కోవడానికి కనీసం సంఘటితమవుతున్నారు. పోరాటాలు చేస్తున్నారు. కానీ స్త్రీలలో ఆ సంఘటన కూడా చాలా బలహీనంగా ఉంది. వరకట్నం చావులకూ వరకట్న సంబంధమయిన వేధింపులకూ మనరాష్ట్రం దేశంలోనే విఖ్యాతి గాంచింది. ప్రతీరోజూ రాష్ట్రంలో కనీసం రెండు మూడు వరకట్న సంబంధమయిన మరణాల గురించి పత్రికలలో చూస్తూంటాము. ఈ వేధింపులకూ ఈ హత్యలకూ సంబంధించి బలమయిన చట్టాలున్నాయి. ఇవి చట్టాలతో ఆగిపోయే నేరాలు కాక పోయినప్పటికీ చట్టాలను సమర్థవంతంగా అమలుచేస్తే కొంతలో కొంతయినా అదుపులోకి వస్తాయి. కానీ పోలీసు యంత్రాంగమూ, న్యాయస్థానాలు ఈ కేసుల పట్ల చాలా నిర్లక్ష్యవైఖరిని ప్రదర్శిస్తూ వున్నాయి. మామూలుగానే నేరస్థులకు శిక్ష పడడం అరుదనుకుంటే ఈ 'కుటుంబ సంబంధమయిన' నేరాలలో మరీ అరుదయి పోయింది.

ముగింపు : పరిపాలనా యంత్రాంగం చేకూర్చే న్యాయం ఈ విధంగా వుంది. ఈ నేపథ్యంలో ప్రజలలో అసహనం, అసంతృప్తి పెరిగిపోతున్నాయన్నా ఆందోళనలూ అలజడులూ పెరిగిపోతున్నాయన్నా ఆశ్చర్యం ఏముంది ?

అటువైపు పాలక రాజకీయాలలో ప్రజాస్వామ్య లక్షణాలు మృగ్యం అయినాయి. హింసకు పాల్పడకుండ, రిగ్గింగ్ చేయకుండ, మతోన్మాద ప్రచారంతో ప్రజల మనసులను కలుషితం చేయకుండ, వోటర్లపైన గూండా దాడులు చేయకుండ ఎన్నికలలో గెలవలేకుండా వున్నారు. ప్రజల సమస్యలు వాటికి వివిధ పార్టీలు చూపే పరిష్కార విధానాలు అనే ప్రాతిపదిక మీద నడవవలసిన ప్రజాస్వామ్యం డబ్బు, సారాయి నుండి ఇప్పుడు గూండాయిజం ప్రాతిపదిక మీద నడుస్తూ వుంది. చెన్నారెడ్డిని గద్దెదించడానికి మతం పేరిట ఘర్షణలను కాంగ్రెస్ అసమ్మతి నాయకులు ఎంత అమానుషంగా వాడుకున్నారో మొన్ననే చూసాం. మతఘర్షణలను దేశవ్యాపితంగా రెచ్చగొట్టి అధికారానికి రావాలని చూస్తూన్న భారతీయ జనతాపార్టీ విన్యాసాలనూ రెండేళ్ళగా చూస్తున్నాం. ఈ పార్టీ ఆ పార్టీ అన్న తేడా లేకుండ పాలక పార్టీలన్నీ ఈ క్రమంలో పాలుపంచుకుంటున్నాయి.

రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతూ వున్న తుపాకీ రాజ్యానికి నేపథ్యం ఇది. ఈ నేపథ్యం పౌరహక్కుల ఉద్యమం మీదనున్న భారాన్ని సూచిస్తుంది. ఉద్యమ కర్తవ్యాన్ని నిర్దేశిస్తుంది.

# ఎన్‌కౌంటర్ల వివరాలు

## ఓబులనాయునిపల్లె (అనంతపురం జిల్లా)

ఇక జరగబోవని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన 'ఎన్‌కౌంటర్లు' అయిదున్నర నెలల సెలవు తరువాత మళ్ళీ ప్రారంభమయ్యాయి. 1989 సంవత్సరం నవంబర్ 25వ తేదీన తూర్పుగోదావరిజిల్లా యేలేశ్వరం దగ్గర ఒక 'ఎన్‌కౌంటర్' జరిగి అయిదారుగురు చనిపోయారు. అప్పటికి అసెంబ్లీ ఎన్నికలు అయిపోయాయిగానీ ఫలితాలు ప్రకటించలేదు. అంతకుముందే ఎన్టీఆర్ ప్రభుత్వం 'ఎన్‌కౌంటర్లు' ఆపేస్తాం అని చెప్పిందిగానీ ఆ హామీని అంతంత మాత్రంగా నిలబెట్టుకుంది. ఒకటీ అరా 'ఎన్‌కౌంటర్లు' జరుగుతూనే వచ్చాయి. ఆ తర్వాత అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాన్నే పూర్తిగా మార్చుకున్నట్టు ప్రకటించుకుంది. నక్సలైట్ ఉద్యమాన్ని అణచడంలో చట్టవ్యతిరేక పద్ధతులను ప్రయోగించడం జరగదనీ, హక్కుల ఉల్లంఘన జరగదనీ చెన్నారెడ్డి పదే పదే హామీలు ఇచ్చాడు. కొన్నాళ్ళు కొంతమేరకు నిలబెట్టుకుంటున్నట్టే అనిపించింది. కానీ క్రమంగా పాత అలవాట్లు తిరిగి ఒక్కొక్కటీ సాక్షాత్కరించాయి. అక్రమ అరెస్టులు, నిషేధాజ్ఞలు, కాల్పులు, ఇళ్ళ సోదాలు మొదలవుతున్నాయి. వాటితో పాటు 'ఎన్‌కౌంటర్లు' కూడ మొదలయ్యాయి. మొట్టమొదటి 'ఎన్‌కౌంటర్' అనంతపురంజిల్లా ధర్మవరం సమీపంలోవున్న ఓబులనాయునిపల్లె పక్కనున్న గుట్ట దగ్గర జరిగింది. చనిపోయింది అదే గ్రామానికి చెందిన కేశనాయక్ అనే లంబాడా యువకుడు. చంపింది ధర్మవరం ఎస్.ఐ. కేశవన్. తేదీ మే 8.

రాయలసీమలో అన్ని గ్రామాలలో ఉన్నట్టే ఓబులనాయునిపల్లెలోనూ రెండు ముఠాలున్నాయి. ఒకదాని నాయకుడు కాంగ్రెస్(ఐ)కి చెందిన పుల్లన్న. రెండవదాని నాయకుడు తెలుగుదేశంకు చెందిన సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవయ్య. కాంగ్రెస్ ముఠా సంఖ్యారీత్యా చిన్నదే అయినా అధికారపార్టీ కావడంవల్ల, అందులోనూ ఆ నియోజకవర్గం (పెనుగొండ) ఎం.ఎల్.ఎ శ్రీ చెన్నారెడ్డిగారు చాలా బలవంతులూ, శక్తిసంపన్నులూ కావడంవల్ల తనదే పైచేయి చేసుకోగలిగింది. చాలా కాలంపాటు తెలుగుదేశం మనుషులు ఊరు వదిలిపెట్టి వెళ్ళిపోయారు. రాడికల్స్ సహాయం ఆశ్రయించారు.

చివరికి ఏప్రిల్ 29వ తేదీన ఎం.ఎల్.ఏ. చెన్నారెడ్డి తమ్ముడు, ధర్మవరం ఎస్.ఐ. కేశవన్ దగ్గరుండి ఇరువర్గాలకూ పంచాయితీచేసి పారిపోయినవాళ్ళు గ్రామానికి తిరిగివచ్చే ఏర్పాటు చేశారు. అయినా ఘర్షణలు ఆగిపోలేదు. ఎం.ఎల్.ఏ. చెన్నారెడ్డి తన ఆధిపత్యాన్ని నియోజకవర్గమంతటా నెలకొల్పడానికి దేనికీ వెనకాడనివాడుకాగా (అనంతపురం జిల్లాలో తాడిపత్రి దివాకరరెడ్డి కోవకు చెందిన రెండవ మనిషిగా ఇతనిని చెప్పుకుంటారు), ఇటు ప్రత్యర్థివర్గం రాడికల్స్ అండతో బలం పుంజుకున్నారు. గ్రామంలో పోలీసు క్యాంపు కొనసాగింది.

మే 7వ తేదీ రాత్రి పుల్లన్న వర్గానికి చెందినవారి మోటార్లు ప్రత్యర్థివర్గం పగులగొట్టారు. 8 ఉదయం ఆ విషయం తెలియగానే క్యాంపు పోలీసులు బయలుదేరారు. పగలగొట్టినవారిలో రాడికల్ కార్యకర్త కేశనాయక్ ఉన్నాడనీ అతను గ్రామంలోనే ఉన్నాడనీ తెలిసింది. పోలీసులకూ కేశనాయక్‌కూ కొంతసేపు వాదన జరిగింది. కేశనాయక్‌తోబాటు గ్రామస్తులు మరికొందరు ఉన్నారు. వాళ్ళను లొంగిపొమ్మని పోలీసులు హెచ్చరించినా వాళ్ళు లొంగిపోలేదు. పోలీసులమీద వాళ్ళు ఆ దశలోనే దాడిచేశారని ఎస్.ఐ. అంటున్నాడుగానీ అటువంటిదేమయినా జరిగివుంటే ఒక కేసు నమోదుచేసేవారే. అటువంటిదేమీ జరగలేదు. పోలీసులు మాత్రం హెచ్చరికగా గాలిలోకి కాల్పులు జరిపారు. కేశనాయక్ బృందం గ్రామం వెలుపలకుపోయి అక్కడున్న ఒక గుట్టమీదికి ఎక్కిపోసాగారు. పోలీసులు ధర్మవరం పోలీస్‌స్టేషన్‌కుపోయి ఎస్.ఐ. కేశవన్‌కు విషయం తెలియజేశారు. ఆయన మరొక 5 మంది సాయుధ పోలీసులను వెంటబెట్టుకొని ఓబులనాయునిపల్లెకి బయలుదేరాడు. గ్రామంలోని క్యాంపులోవున్న 5 మందిని కలుపుకుంటే 11 మంది సాయుధ పోలీసులు అయ్యారు. అంతా కలిసి గుట్ట దగ్గరికి వచ్చారు.

అవతలవైపు ఎంతమంది ఉన్నారనేది వివాదాస్పదంగా తయారయింది. కేశనాయక్‌తోబాటు 60 మంది తమ ప్రత్యర్థి వర్గంవాళ్ళు ఉన్నారని పెనుకొండ ఎం.ఎల్.ఏ. అంటున్నాడు. 25 మంది ఉన్నారని ఎస్.ఐ. ఉవాచ. 8 మంది మట్టుకు ఉన్నారని ఓబులనాయునిపల్లె లంబాడా తండాలో ప్రత్యక్ష సాక్షుల కథనం. చెన్నారెడ్డికీ, ఎస్.ఐ.కీ అబద్ధం చెప్పడంవల్ల ప్రయోజనం ఉందిగానీ జనానికేమీ లేదు కాబట్టి జనం చెప్పిందే నిజం అయివుండాలి. సంఖ్య ఎంతవున్నా కేశనాయక్ చేతిలోవున్న ఒక 12 బోర్ తుపాకీ తప్ప వాళ్ళ దగ్గర వేరే ఆయుధాలేవీ లేవని అందరూ ఒప్పుకొంటున్నారు.

ధర్మవరం ఎస్.ఐ. కేశవన్ నాయకత్వంలోని పోలీస్ బృందం గుట్టను

సమీపించింది. కేశనాయక్‌నూ అతని అనుచరులనూ లొంగిపొమ్మని హెచ్చరించారు. తమకు లొంగిపోయే ఉద్దేశ్యం లేదనీ, కొంతసేపు మాట్లాడుకొని తమ దారిన తాము పోతామనీ కేశనాయక్ సమాధానం చెప్పినట్టు పక్కనే పనులు చేసుకుంటూ సంఘటనను తిలకించిన జనం అంటారు. 'చేతనయితే పట్టుకోండి మేము దిగిరాము' అని వాళ్ళు పోలీసులను ఎద్దేవా చేసినట్టు కూడ అంటారు. నిజానికి ఆ గుట్టమీదికి ఎక్కితే అవతలివైపున ఎత్తుగావున్న భూమిమీద నుండి పారిపోవడం కష్టంకాదు. కేశనాయక్ బృందం ఉద్దేశ్యం అదే అయి ఉంటాలి. అట్లాకాక పోలీసులతో తలపడే శక్తిసామర్థ్యాలు వాళ్ళకు లేవు. కాని పోలీసులు మాత్రం తుపాకులు పట్టుకున్న 11 మందితో కేశనాయక్ ఒంటరిగా తన 12 బోర్ తుపాకితో యుద్ధానికి పూనుకున్నాడని నమ్మమంటారు. గుట్టమీది నుండి అతను కాల్పులు జరపగా గుట్ట క్రింది నుండి ఎస్.ఐ. కేశవన్ ఆధ్వర్యంలో ఎదురు కాల్పులు జరిగాయంట. దాదాపు 3 గంటలసేపు బండరాళ్ళ మాటున దోబూచులాడుకుంటూ కాల్పులు జరుపుకోగా పోలీసులకు ఎట్టి గాయాలూ కాలేదుగానీ కేశనాయక్‌కు మట్టుకు ఒక గుండు ఛాతీలోనుండి దూసుకుపోయిందట.

నిజానికి ఒక్క నాటు తుపాకితో యుద్ధానికి దిగేంత మూర్ఖులెవరూ ఉండరు. కేశనాయక్‌కు అంత అవసరమూ ఉండలేదు. తన అనుచరులందరినీ గుట్ట అవతలివైపునుండి దిగి పారిపొమ్మని పురమాయించి తాను పోలీసులమీద కాల్పులు జరిపాడని ఎస్.ఐ. అంటున్నాడు. దీనినిబట్టే నిజంగా ఏం జరిగిందో ఊహించవచ్చును. పోలీసులు పట్టుదలగా ఉన్నారని చూసిన కేశనాయక్ బృందం గుట్టమీదికెక్కి అవతలివైపు నుండి దిగి పారిపోవాలని నిర్ణయించుకొని ఉండాలి. కాని ఎస్.ఐ. వాళ్ళ వెంట తనూ గుట్ట ఎక్కుతూ కాల్పులు మొదలుపెట్టాడు. గతంలో ధర్మవరం పోలీస్‌స్టేషన్ ఎస్.ఐ.గా వున్న వ్యక్తిమీద కేశనాయక్ ఒకసారి కాల్పులు జరిపాడని కేసు ఉంది. ఆ కోపం పోలీసుల మనసులలో వుంది. అందువల్ల కేశవన్ కాల్పులు జరుపుతుంటూ గుట్ట ఎక్కాడు. అటువంటప్పుడు వెనక్కి తిరిగి పారిపోతే ప్రాణాపాయం ఉంటుందని కేశనాయక్ తనవాళ్ళందనీ పారిపొమ్మని చెప్పి తాను వెనక్కి తగ్గుతూ ఆత్మరక్షణకోసం తనదగ్గరున్న నాటు తుపాకితో పోలీసులను ఎదుర్కొన్నాడు. అతని నాటు తుపాకీ పోలీసుల 303లతో సరితూగలేకపోయింది. పోలీసులకేమీ కాలేదుగానీ అతనికి తీవ్రంగా గాయం అయింది. అప్పుడు గుట్టమీదికి పారిపోయి కొంచెం దూరం వెళ్ళి పడిపోయాడు. పోలీసులు వెంటనే గుట్ట ఎక్కి వెతికివుంటే దొరికి వుండేవాడే. బహుశా ప్రాణమూ దక్కేదేమో. కాని వాళ్ళు వెనక్కి ధర్మవరం వెళ్ళిపోయి తాపీగా ఆ సాయంత్రం చుట్టుపక్కల గ్రామాలలో వాకబు చేయడం మొదలుపెట్టారు. అప్పుడుగానీ తాము కేశనాయక్‌ను హత్యచేసిన సంగతి వాళ్ళకు తెలియలేదు.

# సామా అంతిరెడ్డి (సత్తెన్న)

నక్సలైట్ కార్యకర్తలను 'మాయం' చేయడం తెలుగు దేశం పాలనలో మొదలయి కాంగ్రెసు పాలనలో కొనసాగుతూ వుంది. 25 ఏళ్ళగా కమ్యూనిస్టు ఉద్యమంలో నిబద్ధత గల కార్యకర్తగా పనిచేసి, ముఖ్యంగా వరంగల్ జిల్లా ఏటూరునాగారం అడవి ప్రాంతంలో గిరిజన గిరిజనేతర పేద ప్రజానీకం అదరాభిమానాలను చూరగొన్న సత్తెన్న అనే సామా అంతిరెడ్డిని రాష్ట్ర పోలీసులు జూన్ 6 రాత్రి హైదరాబాద్‌లో అపహరించి 8 రాత్రి లేక 9 ఉదయం కరీంనగర్ జిల్లా ముల్కనూరు పోస్ స్టేషన్ పరిధిలోని వంగర గ్రామ శివారులో చంపివడవేసి ఆ తరువాత తామే శవాన్ని వెతికి 'కనుక్కొని' గుర్తు తెలియని శవంగా చలామణి చేసి పూడ్చి పెట్టారు. వంగర గ్రామం మాజీ రాష్ట్ర ముఖ్య మంత్రి మాజీ కేంద్ర విదేశవ్యవహారాల మంత్రి, అయిన గౌరవనీయులు పి.వి. నరసింహారావుగారి స్వగ్రామం కావడం కాకతాళీయం కాదను కోవడం వారిని అనవసరంగా శంకించడం అవుతుంది కాబట్టి అవుననే అనుకుందాం.

జూన్ 6వ తేదీ రాత్రి హైదరాబాదులోని చిలకలగూడ ప్రాంతంలో ఒక వ్యక్తిని కలవడానికి అంతిరెడ్డి వెళ్ళారు. రాత్రి 9-15కు ఆయనను ఆఖరిసారి చూసారు. ఆ తరువాత ఆయన కనబడలేదు. ఆయన ఏమయ్యాడా అని ఆయన సహచరులు వాకబు చేసుకుంటూ ఉండి పోయారు.

9వ తేదీ ఉదయం కరీంనగర్ జిల్లా స్పెషల్ బ్రాంచినుండి ముల్కనూర్ ఎస్.ఐ వీరస్వామికి ఒక విచిత్రమైన వైర్‌లెస్ సందేశం వచ్చింది. ఆ రోజు ఉదయం స్పెషల్ బ్రాంచి వారికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి ముల్కనూరు పోలీసుస్టేషన్ పరిధిలోని గట్ల నర్సింగాపూర్ గ్రామందగ్గర వంగర గ్రామ శివారులో అంతిరెడ్డి శవం ఉందని చెప్పాడట. కాబట్టి ముల్కనూరు ఎస్.ఐ వెంటనే బయలుదేరి ఆ శవాన్ని వెతికి స్వాధీనం చేసుకోవాలని స్పెషల్ బ్రాంచి వారు ఆదేశించారు. అంతిరెడ్డి పేరు అంకిరెడ్డి అని వినబడిందనీ, ఆ వ్యక్తి గట్ల నర్సింగాపూర్ నివాసి అనే అభిప్రాయం తమకు కలిగిందనీ ముల్కనూరు ఎస్.ఐ ఇప్పుడు అంటున్నారు అది నిజమే కావచ్చు. ఆ రోజు ఆయన శవంకోసం గాలించాడు. శవం దొరకలేదు. అంతేకాక గట్ల నర్సింగాపూర్ గ్రామంలో అసలు రెడ్డి కులస్తులే లేరనికూడ తెలుసుకుని మరింత తికమక పడ్డాడు. అదీ నిజమే కావచ్చు. కానీ 10 తేదీ నాటికి మట్టుకు ఎటువంటి దురభిప్రాయాలకూ గందరగోళానికి ఆస్కారం లేనంత స్పష్టంగా ఆయనకూ హుజూరాబాద్ సి.ఐ. కృష్ణారావుగారికి విషయం విశదీకరించబడింది. కరీంనగర్ పోలీసులు 10వ తేదీన ముల్కనూరు ఎస్.ఐ కి మెమో పంపించారు. ఆ మెమోలో స్పష్టంగా 'నక్సలైట్' నాయకుడు

సామా అంతిరెడ్డి, తండ్రి సామా వెంకటరెడ్డి శవం ఫలానాచోట వుందని చెప్పినా కూడ ఎందుకు స్వాధీనం చేసుకోలేకపోయారో సమాధానం చెప్పవలసిందని ఉంది. ఇప్పుడు అడిగితే అటువంటి మెమో ఏదీ రాలేదని బుకాయిస్తున్నారుగానీ విషయం రచ్చకెక్కకముందు ముల్కనూరు హెడ్‌కానిస్టేబుల్ ఆ మెమోను ఒక అడ్వకేటుకు స్వయంగా చూపించాడు.

10వ తేదీ ఉదయం హుజూరాబాద్ సి.ఐ. శవం వేటలో తానే బయలుదేరాడు. పోతూ పోతూ హుజూరాబాద్ ప్రభుత్వ డాక్టరు అయిన రామిరెడ్డిగారిని వెంటబెట్టుకు పోవడంలో ఉద్దేశ్యం ఏమిటంటే ఈయన గతంలో వరంగల్ జిల్లా ములుగులోనూ ఏటూరునాగారంలోనూ ప్రభుత్వ డాక్టరుగా పనిచేశారు. అంతిరెడ్డిని గుర్తుపట్టగలరు. ఆయనను జీపులో తీసుకుపోతూ అంతిరెడ్డిని గుర్తుపట్టడానికి గుర్తులేమిటని సి.ఐ. అడిగాడు. కాబట్టి తాము వెతుకుతున్నది అంతిరెడ్డి శవం కోసమని పోలీసులకు అప్పటికే తెలుసుననేది మరొకసారి స్పష్టం అయింది. తమకు తెలియనే తెలియదనేది తరువాత తెచ్చిపెట్టుకున్న బుకాయింపు.

ఆయితే అప్పటికే అంతిరెడ్డి శవం పూర్తి పురుగులు పట్టిపోయి వుంది. ముఖాన్ని పూర్తిగా పురుగులు తినేసాయి. కాబట్టి డాక్టరు స్పష్టంగా పోల్చలేకపోయారుగానీ మొత్తం మీద అయివుండవచ్చునని భావిస్తున్నానని సి.ఐ.తో చెప్పారు. పోలీసులు అప్పటికయినా తమకు ఫోన్‌లో ఎవరో చెప్పారన్న కథను పత్రికలలో ప్రకటించి అంతిరెడ్డి బంధువులుగానీ, సహచరులుగానీ వచ్చి గుర్తుపట్టగలరేమో చూడండని ఆహ్వానించవలసింది. వాళ్లు అవేమీ చేయకుండ రామిరెడ్డిగారిచేత అక్కడికక్కడే శవపరీక్ష తంతు ముగించి అక్కడే పూడ్చిపెట్టారు. శవం నుదుటి మీద బుల్లెట్ దెబ్బలు ఉన్నాయనీ, దగ్గర నుండి గురిపెట్టి కాల్చినట్లు ఉందనీ, బుల్లెట్లు మూడూ శవంలోనే ఉన్నాయికానీ తాను తీయలేకపోయాననీ డాక్టర్ రామిరెడ్డి అంటున్నారు. అప్పటికే చనిపోయి 3 రోజులు అయిందంటాడు. అంటే 7వ తేదీనే చంపబడి ఉండాలి. 3 రోజులుగా శవం అక్కడే ఉండే ఆస్కారం లేదు. ఎందుకంటే శవం ఉన్న స్థలం సిద్దిపేట నుండి హుస్నాబాదు మీదుగా వరంగల్ వెళ్ళే రహదారికి బాగా సమీపంలో ఉంది. ఎవరో ఒకరు తప్పక చూసే ఉంటారు కాబట్టి 7వ తేదీన కాల్చేసి 8 రాత్రి లేక 9ఉదయం అక్కడ తెచ్చి పడేసి ఉండాలి.

తంతు మొత్తం ముగించాక హుజూరాబాదు సి.ఐ కృష్ణారావుగారు 13వ తేదీన ఒక పత్రికా ప్రకటన ఇచ్చారు. ఫలానచోట ఒక గుర్తు తెలియని శవం దొరికిందని ప్రకటిస్తూ శవం రూపురేఖలను వివరించి ఊరుకున్నారు. అది అంతిరెడ్డి లేక అంకిరెడ్డి అనే వ్యక్తి శవం అని తమకు ఫోన్‌లో ఎవరో చెప్పారని ఎందుకు పత్రికలలో ప్రకటించలేదు అని అడిగితే తాను ప్రకటించాననీ పేపర్ల

వాళ్ళే సరిగ్గా రాయలేదనీ అంటున్నాడు. అయితే అది అబద్ధమనీ కావాలంటే ఆయన ఇచ్చిన పత్రికా ప్రకటన కాపీ చూపిస్తామనీ హుజూరాబాదు విలేఖరులు ముక్త కంఠంతో అంటున్నారు.

అంతిరెడ్డి హత్యకు పోలీసులే బాధ్యులు కాకపోతే, ఎవరో ఫోన్‌చేసి చెప్తేనే వాళ్ళకు ఫలానాచోట అంతిరెడ్డి శవం ఉందని తెలిస్తే, పోలీసులు ఆ విషయాన్ని దాచిపెట్టవలసిన అవసరం ఏమీ లేదు. అంత ప్రముఖ నక్సలైట్ నాయకుడి మరణాన్ని నిశ్శబ్దంగా కప్పిపెట్టవలసిన అగత్యం లేదు.

## మదన్‌పల్లి (నిజామాబాద్ జిల్లా)

నిజామాబాద్ పట్టణానికి 15 కి.మీ.లు దూరాన మక్లూర్ మండలంలో వున్న మదన్‌పల్లి గ్రామంలో జూన్ 11 ఉదయం తెల్లవారుతుండగా ఇద్దరినీ, బాగా తెల్లవారిన తరువాత మరొక వ్యక్తినీ పోలీసులు కాల్చేశారు. చనిపోయిన వాళ్ళు ప్రసాద్, నర్సక్క, స్వామి. ముగ్గురూ ఆ గ్రామానికి చెందినవారే. ప్రసాద్ ఒకప్పుడు రాడికల్స్‌లో పనిచేసి ఎన్.టి.ఆర్. హయాంలో సరండర్ అయి తిరిగి మళ్ళీ ఈమధ్య రాడికల్స్‌లోకి పోయాడు. 'నేను క్షమించి వదిలేస్తే మళ్ళీ వెనక్కి పోతాడా' అని జిల్లా ఎస్. పి. రఘువీర్ ప్రసాద్‌మీనా పత్రికా విలేకర్ల సమక్షంలో ఆగ్రహించినట్టు వినికిడి.

12వ తేదీ మదన్‌పల్లిలో బహిరంగసభ జరపాలని రాడికల్స్ నిర్ణయించుకొని పోలీసుల అనుమతికోసం అడిగారు. పోలీసులు నిరాకరించారు. ఆ విషయం 10వ తేదీనే తెలిసింది. పోలీసు జీపుకు మైకు కట్టి నిషేధాజ్ఞలు ప్రకటిస్తూ పరిసర గ్రామాలన్నీ తిరిగారు. ఆ రాత్రి ప్రసాద్, నర్సక్క నర్సక్క ఇంట్లో పడుకున్నారు. నర్సక్క తల్లి ఆ యింట్లోనే పడుకుంది. స్వామి వేరే యింట్లో పడుకున్నాడు.

ఉదయం 3-30 ప్రాంతంలో నిజామాబాద్ డి.ఎస్.పి. శేషగిరిరావు 100 మందికి పైగా సాయుధ పోలీసులను తీసుకొని మదన్‌పల్లి వెళ్ళాడు. అంత రాత్రి అంతమంది పోలీసులతో ఆ గ్రామం వెళ్ళవలసిన అవసరం ఏమొచ్చిందని అడిగితే 'ప్రసాద్ మీద ఒక కేసుంది. ఇన్వెస్టిగేషన్‌కు వెళ్ళాను' అని నిస్సిగ్గుగా అంటాడు. ఒక కేసు విచారించడానికి వందమంది స్టెన్‌గన్‌లు పట్టుకున్న పోలీసుల అవసరం ఏమిటంటే సమాధానంలేదు.

వచ్చిన పోలీసులకు నర్సక్క ఇల్లెక్కడో తెలీదు. వాళ్ళకు తెలిసింది

తమ దగ్గరికి మీటింగ్ పర్మిషన్ కోసం వచ్చిన భూమయ్య ఇల్లు పట్టుకే. అతని ఇంటికే పోలీసులు వచ్చి ఇంట్లోని జనాన్ని లేపారు. అసలు భూమయ్య దొరకలేదు గానీ అదే పేరుగల అతని బంధువు దొరికాడు. అతన్ని ఊరిబయటవున్న గాంధీ బొమ్మదగ్గరికి తీసుకుపోయి కొట్టి నర్సక్క ఇల్లు చూపించమన్నారు. నర్సక్క ఇల్లు భూమయ్య ఇంటిపక్కనే. భూమయ్య పోలీసులను తీసుకొచ్చి నర్సక్క ఇల్లు చూపించాడు. పోలీసులు భూమయ్య చేతనే నర్సక్కను పిలిపించారు. ఆమెవచ్చి తలుపు తీసింది.

పోలీసులు అరెస్టుచేయడానికిపోగా ప్రసాద్ తన తపంచాతోనూ నర్సక్క గొడ్డలితోనూ దాడి చేసారని పోలీసులు ఎదురు కాల్పులు జరపవలసి వచ్చిందనీ పోలీసుల కథనం. కాని భూమయ్య కుటుంబీకులూ ఇతర ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం నర్సక్క తలుపులు తెరవగానే పోలీసులు లోపలికి పోయి ఆమెనూ, ప్రసాద్‌నూ పట్టుకున్నారు. వాళ్ళు కొంత ప్రతిఘటించి ఉండవచ్చునుగానీ అప్పుడు ఎదురు కాల్పులేమీ జరగలేదు. ఇద్దరినీ పోలీసులు బయటికి తీసుకొచ్చి గాంధీ బొమ్మ దగ్గరికి నడిపించారు. అక్కడ ప్రసాదును బాగా కొట్టారు. 'పాటలు పాడతావుకద, పాడవా!' అని వెక్కిరించారు. చివరికి 5 గంటలప్పుడు, తెల్లవారుతోండగా, వెనక్కి నర్సక్క ఇంటికే తీసుకుపోయారు. బయటవున్న ఇరుగు పొరుగును వెళ్ళిపొమ్మని హెచ్చరించారు. ఇంట్లోకి తీసుకుపోయి పడకగదిలోనే కాల్చేసారు.

ఆ తరువాత పోలీసులు జీపువేసుకొని ఊరంతా తిరుగుతూ ప్రసాదు, నర్సక్క చనిపోయారనీ, మిగిలిన కార్యకర్తలంతా సరండర్ కావాలనీ హెచ్చరించారు. ఇల్లిల్లూ సోదా చేసారు. వెతికే క్రమంలో ఒక యింట్లో దాక్కొని వున్న నర్సక్క తమ్ముడు స్వామిని కాల్చేసారు.

ప్రసాదు చనిపోయినట్టు గ్రామంలోనే వున్న అతని భార్యకు పోలీసులు కనీసం చెప్పలేదు. ఆమె ఆరోజు సాయంత్రం ఆ విషయం తెలుసుకుంది. ప్రసాదు శవాన్ని ఆమెకుగానీ, అతని అన్న వొద్దెన్నకుగానీ ఇవ్వనూ లేదు. పోలీసులే పోస్టుమార్టం చేయించి దహనం చేసారు.

## తిప్పాపూర్ (నిజామాబాద్ జిల్లా)

'మీ వూరిని మరొక తిప్పాపూర్ చేస్తాం' అని ఈ మధ్య వరంగల్ జిల్లా అన్నాసాగరం మీద దాడి చేస్తూ పోలీసులు బెదిరించారు. తిప్పాపూర్‌కు పోలీసుల నుడికారంలో స్థానం లభించడంలో ఆశ్చర్యంలేదు.

నిజామాబాద్ జిల్లా భిక్నూర్ మండలంలో 7 వ జాతీయ రహదారికి సమీపంలో వుంది తిప్పాపూర్ గ్రామం. ఇటు మెదక్ జిల్లా సరిహద్దుకు కూడ కనుచూపు మేరలో వుంది. ఆ వూళ్ళో రాడికల్స్ 'ఎన్‌కౌంటర్'లలో హతులయిన వారి స్మృతిలో ఒక పెద్ద స్థూపం నిర్మిస్తున్నారు. 'నేను చంపితే నువ్వు స్థూపాలు కడతావా ?' అని ఎస్.పి. రఘువీర్‌ప్రసాద్ మీనాగారికి కోపం. ఆ వూళ్లో ప్రతీ ఇంట్లోనూ ఒక 'రాడికల్' ఉన్నాడనీ, ఈ యువకులు తరచుగా ప్రజాకోర్టులు నిర్వహిస్తుంటారనీ పోలీసుల కథనం. ఇదికూడ మీనాగారికి కంటగింపే. మదన్‌పల్లి ఎన్‌కౌంటర్‌కు ప్రభుత్వ ఆమోదం లభించిన పిదప ఇంకొక్క ప్రయత్నం చేసి చూద్దాం అనుకున్నట్లున్నాడు. జూలై 23 వ తేదీన తిప్పాపూర్‌లో మదన్‌పల్లికంటె ఘోరమయిన 'ఎన్‌కౌంటర్'కు పాల్పడ్డాడు.

జూలై 23 తెల్లవారుజామున మీనా స్వయంగా 100 మందికిపైగా సాయుధ పోలీసులను తీసుకొని 4 జీపులు రెండు వ్యాన్లతో తిప్పాపూర్ వెళ్ళాడు. అప్పుడే జనం నిద్రలేచి బయటికి వెళ్తున్నారు. పోలీసులు అన్ని ఇళ్ళకూ బయటి నుండి గొళ్ళాలు పెట్టారు. జీపుకు మైకు కట్టి కొన్ని పేర్లు చదివి వీళ్ళంతా సరండర్ కావాలి అన్నారు. నర్సారెడ్డి, సాయిరెడ్డి, మన్నెం నర్సింహులు, యాదగిరి, నర్సాగౌడ్, బాలిరెడ్డి, గాలిరెడ్డి అనేవి వాళ్ళు ప్రకటించిన పేర్లు. వాళ్ళలో ఒక్కరూ వచ్చి సరండర్ కాకపోయేసరికి పోలీసులు విజృంభించారు. రోడ్లోకి అప్పటికే వచ్చి వున్న జనాన్నంతా పోగేసి రాడికల్స్ ప్రజాపంచాయితీలు నిర్వహించే దగ్గర కూర్చోబెట్టారు. దాదాపు 200 మందిని ఈ విధంగా కూర్చోబెట్టారు. తమకు కావలసిన వాళ్ళ ఇళ్ళ మీద దాడిచేసి నానా బీభత్సం చేసారు. ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసారు. తల్లిదండ్రులను కొట్టారు. కొంత డబ్బు దొంగిలించారు. సాయంత్రం అయ్యేసరికి బాలిరెడ్డి, గాలిరెడ్డి, నర్సాగౌడ్, యాదగిరిలను చంపేసారు. ఇందులో మొదటి ముగ్గురినీ బాలిరెడ్డిని వాళ్ళ పశువుల కొట్టంలో కాల్చేసారు. యాదగిరిని అతని ఇంటి పక్కనే ఒక గదిలో వున్న ఎండుగడ్డిలో దాక్కొని వుండగా వెతికి పట్టుకొని కాల్చేసారు.

గాలిరెడ్డి వాళ్ళ ఇంటికి పోయి అతనికోసం ఇల్లంతా వెతికారు. ఇంట్లోని ఆడవాళ్ళను బెదిరించారు. అతని తమ్ముడు రాజిరెడ్డిని తీసుకుపోయి రోడ్లో కొట్టసాగారు. అది తెలిసి గాలిరెడ్డి తానేపోయి పోలీసులను ఎదిరించాడు. తమ్ముడిని ఎందుకు కొడుతున్నారని దబాయించి అడిగాడు. అప్పుడు తమ్ముడు రాజిరెడ్డిని జీపులో కూర్చోబెట్టి గాలిరెడ్డిని బాలిరెడ్డి వాళ్ళ పశువుల కొట్టం దగ్గరికి తీసుకుపోయారు.

16 సంవత్సరాల 10 వ తరగతి విద్యార్థి నర్సాగౌడు పోలీసులు సోదా

చేసేటప్పటికి ఇంట్లో లేడు. పోలీసులు అతని తల్లి లక్ష్మిని కొట్టి ఇల్లంతా పాడుచేసి 150 రూ॥ల నగదు జేబులో వేసుకొన్నారు. ఆ తరువాత ఇంటి బయటే నర్సాగౌడు దొరికాడు. అతన్ని కూడా బాలిరెడ్డి వాళ్ళ పశువుల కొట్టం దగ్గరికి తీసుకుపోయారు.

బాలిరెడ్డిని అప్పటికే పశువుల కొట్టంలో పట్టుకున్నారు. అతని కోసం వాళ్ళ ఇల్లు సోదాచేసి తల్లి రాజవ్వను చంపుతాం అని బెదిరించారు. రాత్రి అతను ఇంట్లో పడుకోనేలేదని చెప్పారు. చివరికి పశువుల కొట్టంలో దాక్కొని వున్న బాలిరెడ్డిని పట్టుకున్నారు. అక్కడే ఒక గుంజకు కట్టేసి విపరీతంగా కొట్టారు. అతను మూత్రానికి పోతానంటే బయటికి తీసుకుపోయినప్పుడు అంగేటి లక్ష్మి అనే స్త్రీ చూసింది. అతనిస్థితి చూసి చంపేస్తారని ఊహించి, బాలిరెడ్డి వాళ్ళ ఇంటికి పోయి 'మన బాలిరెడ్డి ఇంకలేడు, చంపేస్తున్నారు' అని చెప్పింది.

మిగిలిన ఇద్దరినీ కూడ పశువుల కొట్టానికి తెచ్చిన తరువాత ముగ్గురినీ ఒకేసారి కాల్చేసారు. తూటాల శబ్దం గ్రామమంతా విన్నారు. అప్పటికి సమయం ఉదయం 11 గంటలు. గ్రామం మధ్యలో పోగేసి కూర్చోబెట్టిన జనంతో ఎస్.పి. 'ఇప్పుడే ఊరిబయట ఎన్‌కౌంటర్ జరిగి ముగ్గురు చనిపోయారు' అని చెప్పాడు.

ఆ తరువాత యాదగిరి కోసం వేట సాగించారు. వడ్రంగం వృత్తి చేసుకునే యాదగిరి హైదరాబాద్‌లో వాళ్ళ బావదగ్గర పనిచేసుకుంటాడు. మూడు వారాల క్రితమే గ్రామానికి తిరిగి వచ్చాడు. అతనికోసం పోలీసులు వెతకసాగగానే ఇంటి పక్కనున్న రూములో కుప్పగా పోసిన ఎండుగడ్డిలో దాక్కున్నాడు తల్లి పద్మను పోలీసులు ప్రశ్నించగా 'లేడు హైదరాబాదు పోయాడు' అని చెప్పింది. ఆమెను పోలీసులు కొట్టారు. ఇంట్లోని కుండలు, గిన్నెలూ ధ్వంసం చేసారు. 400 రూ॥ల నగదు తీసుకుపోయారు. తరువాత మళ్ళీ మధ్యాహ్నం రెండవసారి వచ్చారు. ఈసారి పక్కనున్న గదిలో గడ్డివాములో వెతకగా యాదగిరి దొరికాడు. ఇత నెవ్వరని తల్లిని అడిగితే నా కొడుకుకాదు. తమ్ముడు అని బొంకింది. అయినా పోలీసులు వాస్తవాన్ని పసిగట్టి ఆమెను బాగా కొట్టి యాదగిరిని అక్కడికక్కడే కాల్చేసారు. ఊరి నడిబొడ్డునే మరొక ఎన్‌కౌంటర్ జరిగి ఒక వ్యక్తి చనిపోయాడని ఎస్.పి. మీనా ప్రకటించాడు. అప్పటికి సమయం 3 గం॥లు.

చంపడానికికాకపోతే అంతమంది సాయుధ పోలీసులను తీసుకొని జిల్లా ఎస్.పి. స్వయంగా ఆ గ్రామానికి రావలసిన అవసరమేమీ వుండలేదు. వారు స్వయంగా 'ఇన్వెస్టిగేట్' చేయవలసిన నేరమేమీ అక్కడ జరగలేదు. కొంత కాలం క్రితం కొందరు నకిలీ రాడికల్స్‌ను ఆ గ్రామ రాడికల్స్ పట్టుకొని గాడిదల మీద ఊరేగించారనీ, ఆ తరువాత ఆ నకిలీలను పోలీసులు అరెస్టుచేయగా పోలీస్‌స్టేషన్

మీదికి పోయి మేము శిక్షించిన తరువాత మీరెందుకు అరెస్టుచేశారని గొడవచేసి విడిపించుకుపోయారనీ తెలుస్తూవుంది. ఆ నేరాన్ని పరిశోధించడానికి అంతటి బలగంతో ఎస్.పి. స్వయంగా బయలుదేరి రానవసరం ఏమీ లేదు. ఆయన ఆ గ్రామానికి 'బుద్ధిచెప్పడానికి' కొన్ని హత్యలు చేసి పోదామని వచ్చాడు. చేసిపోయాడు 'నాతో మంచిగా వుంటే నేను మంచి వాడిని లేకపోతే పుట్టుక నా అంతటి దుర్మార్గుడు లేడు' అని ఆయన పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీతో అన్నాడు. మాఫియాగ్యాంగ్ లీడర్లు వాడవలసిన మాటలివి. ఆ మాటలు వాడడమే కాక ఆచరిస్తున్న పోలీస్ ఆఫీసరుగారు మీనాగారు.

## గోదావరిఖని [కరీంనగర్ జిల్లా]

ఆగస్టు 4 వ తేదీ సాయంత్రం నమాజ్‌టైంలో జన రక్షణ సమితి కార్యకర్త అయిన పిట్టల సత్తయ్యను గోదావరిఖనిలో పోలీసులు తరిమి తరిమి కాల్చారు. 6 వ తేదీన తుమ్మకుంపల పద్య శవాన్ని 'తనుకొని' ఎన్‌కౌంటర్ జరిగిందని ప్రకటించారు.

జనరక్షణ సమితి గోదావరిఖనిలో కొంత కాలంగా పనిచేస్తూవున్న సంస్థ. బొగ్గుగనుల కేంద్రమయిన గోదావఖనిలో గుండాలకూ, రౌడీలకూ కొదవ లేదు. ఎంతమంది ఎన్ని ఫిర్యాదులు చేసినా పోలీసులు గానీ ప్రభుత్వంగానీ వాళ్ళను అదుపు చేయలేమ. ఈ నేపథ్యంలో కొందరు స్థానిక యువకులు జనరక్షణ సమితిని ఏర్పాటు చేసారు. రౌడీలకూ గూండాలకూ హెచ్చరికగా పోస్టర్లు వేసారు. ఒకరిద్దరిని చంపారు. చట్టం దృష్టిలో అవి నేరాలేగానీ ఈ చర్యలవల్ల గోదావరి ఖనిలో గుండాయిజం తగ్గిందని ప్రజలు భయం సహితం లేకుండ మెచ్చుకుంటున్నారు. గుండాయిజాన్ని నిరోధించడానికి యువకులు చట్టాన్ని చేతిలోకి తీసుకొని హత్యలు చేయడం కాళ్ళుచేతులు విరగ్గొట్టడం తప్పని ప్రభుత్వం భావిస్తే తాను చట్టబద్ధమైన న్యాయం కల్పించడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి. అందులో విఫలమయింది కాక, జనరక్షణసమితి కార్యకర్తలను చిత్రహింసలకు గురిచేయడం, ఎన్‌కౌంటర్లలో చంపడం ప్రజాస్వామిక పాలన అనిపించుకోదు.

గతంలో ఒకసారి భద్రయ్య, సుధాకర్, తాళ్ళపల్లి రాజయ్య అనే ముగ్గురిని అరెస్టుచేసి బాగా కొట్టారు. మహాదేవ్‌పూర్ అడవులకు తీసుకుపోయి చెట్లకు కట్టేసి కాల్చేస్తాం అని బెదిరించారు. వేరే కొందరు సానుభూతిపరులను

అరెస్టుచేసి 'వాళ్ళను మీరు చంపండి, మేము పూర్తిగా భద్రత కల్పిస్తాం' అని హామీ యిచ్చారు. పిట్టల సత్తయ్య తండ్రి పిట్టల వీరయ్యను ఒకసారి అరెస్టుచేసి గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వారం రోజులుంచి కొడుకును పట్టియ్యమని బెదిరించారు.

ఆగస్టు 4వ తేదీ సాయంత్రం 7 గంటలప్పుడు అశోక్‌నగర్ మసీదు దగ్గరున్న చాయ్ దుకాణాలలో తెల్లబట్టలలో పోలీసులు కూర్చొని వున్నారు. సత్తయ్య అటువైపు వస్తాడని సమాచారం ఉండబట్టి కాపువేసామని తామే అంటున్నారు. ఆ సంగతి తెలియని సత్తయ్య అటువచ్చాడు. పోలీసులకు అతని రూపురేఖలు తెలియవు. ఒక ఇన్‌ఫార్మర్‌ను వెంటబెట్టుకొచ్చారు. అతను సత్తయ్యను పోలీసులకు చూపించగానే పోలీసులంతా లేచి అతనివైపు పరుగెత్తారు. అక్కడ నాలుగయిదు దుకాణాలు, ఒక ఆర్ ఎం.పి. డాక్టరు క్లినిక్ ఉన్నాయి. అదే సమయంలో నమాజ్ అయిపోవడంతో మసీదు నుండి చాలా మంది బయటికి వచ్చారు. అంతా చూస్తూండగా పోలీసులు సత్తయ్యను తరిమి తరిమి కాల్చారు.

కాల్పులు జరిగిన వైనాన్ని గోదావరిఖని ప్రభుత్వ డాక్టరు పోచమల్లు చక్కగా వివరించగలిగారు. శవానికి మూడు బుల్లెట్ దెబ్బలున్నాయి ఒకటి మాత్రమే ముందు నుండి తగిలింది. అది తుంటి మీద తగిలింది. దానివల్ల ప్రాణానికేమీ అపాయం కలగలేదు. ఆ దెబ్బ తగలగానే సత్తయ్య పారిపోయాడు. మిగిలిన రెండు బుల్లెట్లూ వెనక నుండి తగిలాయి. వాటిలో మొదటిది వీపులో నుండి ఛాతిలోకి ప్రవేశించింది. దానివల్లనే ప్రాణం పోయిందిగానీ వెంటనే పోలేదు. సత్తయ్య పరుగెత్తుతూనే వున్నాడు. అతనికీ పోలీసులకూ మధ్య ఎడం పెరిగింది. చివరి బుల్లెట్ నేలకు ఒరుగుతూ అతని కాలిపిక్కమీద తగిలింది. ఆ తరువాత సత్తయ్య పోలీసులకు అందకుండా పారిపోయి ఎక్కడో పడి చనిపోయాడు

ఆ తరువాత ఏం జరిగిందో చెప్పడం కొంచెం కష్టమే. ఆ రాత్రి ఒంటి గంట దాకా పోలీసులు సత్తయ్య ఆచూకి కోసం వెతుకుతూనే ఉన్నారని జనం చెబుతారు. వాళ్ళ ఇంటికిపోయి తండ్రినికొట్టి తలుపులు పగలగొట్టి ఆ యిల్లూ పక్కిల్లూ వెతికారు. రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి స్వయంగా వెతికాడు. తల్లితో వేళాకోళంగా 'నీ కొడుకు రెండు లక్షలు తెస్తాడులే' అన్నాడు, వాళ్ళ ఇల్లేకాక కొందరు సానుభూతి పరుల ఇళ్ళు కూడ వెతికారు. అయితే 4వ తేదీ అర్ధరాత్రి తరువాత పోలీసులకు ఆసక్తి పోయింది.

మళ్ళీ 6వ తేదీ ఉదయం వన్‌టౌన్ ఎస్.ఐ. ఆ ప్రాంతంలో దట్టంగా వున్న తుమ్మకంపల మధ్య శవం దొరికిందన్న ప్రచారం మొదలుపెట్టాడు. అక్క-

డున్న కొంతమంది ఇళ్ళకుపోయి 'అక్కడ శవం దొరికిందని ఎవ్వరూ అనుకోవడం వినలేదా?' అంటూ ప్రశ్నించసాగారు. ఈ విధంగా పోలీసులు తామే ఒక పుకారు సృష్టించి ఉదయం 11 గంటలప్పుడు తామే తుమ్మకంపల మధ్య శవాన్ని 'కనుక్కొన్నారు'. శవం తల తుమ్మకంప లోపలికి కాళ్ళు బయటికి వున్నాయి. దెబ్బతిన్న వ్యక్తి తానే పరుగెత్తి ఆ రకంగా పడిపోయే అవకాశం లేదు. పైగా అది బహిర్భూమిగా ప్రజలు వాడుకునే ప్రాంతం. 4వ తేదీ రాత్రి నుండి 6 ఉదయం 11 గంటల దాకా ఎవ్వరూ చూడకుండ అట్లాపడివుండే అవకాశం లేదు. పోలీసులే శవాన్ని 4 రాత్రి వెతికి పట్టుకొని ఎక్కడో దాచిపెట్టి 6 ఉదయం ఆ కంప మధ్యపడేసి ఉండాలి. అతని క్లాస్‌మేట్స్ ఆపనిచేసి వుంటారని పోలీసులు అంటున్నారుగానీ, సామాన్య పౌరులెవ్వరూ పట్టపగలు ఊరివడిబొడ్డున శవాన్ని తీసుకొచ్చి దాచిపెట్టలేరు.

## లక్ష్మీదేవిపేట [వరంగల్ జిల్లా]

నక్సలైట్ గ్రూపుల మధ్యనున్న తగాదాలను వాడుకొని ఒక 'ఎన్‌కౌంటర్'ను కప్పిపెట్టడానికి మన రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటి సారిగా పోలీసులు వరంగల్ జిల్లాలో ప్రయత్నం చేశారు.

ములుగు నుండి మహదేవ్‌పూర్ అడవులకు వెళ్ళే రహదారికి కుడి పక్కన వుంది లక్ష్మీదేవిపేట గ్రామం. ఆ గ్రామానికి హేమ్లెట్ నర్సింగాపూర్. ఈ నర్సింగాపూర్‌కు చెందిన రవీందర్‌రెడ్డిని ఆగస్టు 6వ తేదీ రాత్రి పోలీసులు ఇంటినుండి తీసుకుపోయి ఊరిబయట కాల్చేశారు. రవీందర్‌రెడ్డి పి.డి.యస్.యు. (విజృంభణ) భూపాలపల్లి మండలం బాధ్యుడు. అతనిని చంపేసిన పోలీసులు ఆ హత్య చేసింది వేరే విప్లవ గ్రూపువారనే అభిప్రాయాన్ని కల్గించడానికి ప్రయత్నం చేశారు. కొన్ని రోజులయిన తరువాత గానీ వాస్తవాలు బయటపడలేదు.

ఆగస్టు 6 రాత్రి 12.30 ప్రాంతంలో ఆయుధాలు ధరించిన పోలీసులు రవీందర్‌రెడ్డి వాళ్ళ యింటికి వచ్చారు. తలుపు తట్టారు. 'ఎవరు?' అని తల్లి అడిగింది. 'ఎవరయితేనేం తలుపు తీయి' అన్నారు. ఆమె తీయకపోయే సరికి 'అన్నలం, తీయ్' అన్నారు. అయినా తీయకపోయేసరికి తిట్లకు దిగారు. అప్పుడు తమ్ముడు సలందర్ తలుపు తీసాడు. బయట 15 మందిదాకా ఉన్నారు. ఎదురుగా వున్న వ్యక్తి ఖాకీ ప్యాంటు వేసుకున్నాడు. చొక్కా లేదు. నడుంచుట్టూ తూటాలున్నాయి.

వాళ్ళు ఇంట్లోకి వచ్చి రవికోసం అడిగారు. అతను పడుకొని వున్నాడని చూపించగా అతన్ని లేపారు. అతని మంచం క్రింద వెతికారు. వచ్చిన వాళ్ళకు నాయకుడిలాగ కనిపించిన వ్యక్తికి ములుగు సి.ఐ. ప్రభాకరబాబు పోలికలు స్పష్టంగా వున్నట్టు ఇంటివాళ్ళకు అనిపించింది. పైగా మిగిలిన వాళ్ళు అతన్ని 'సార్' అని ప్రస్తావిస్తున్నారు. వాళ్ళు పేరొక నక్సలైట్ గ్రూపయితే ఒకరినొకరు 'సార్' అని పిలుచుకునేవారు కాదు. పైగా రవీంద్రరెడ్డి లేవగానే అతను కూడా ఆ వ్యక్తిని 'సార్' అనే సంబోధించాడు. బహుశా అతను ఆ పోలీస్ అధికారిని గుర్తుపట్టి వుండాలి.

వాళ్ళు రవిని బయటకు తీసుకుపోయారు. దేవేందర్, వెంకటయ్య అనే మరిద్దరి కార్యకర్తల ఇళ్ళు చూపించమన్నారు. ఆ యిద్దరు వ్యక్తులూ ఆ ప్రాంతంలో పనిచేసే అన్ని నక్సలైట్ గ్రూపులవారికీ పరిచయమే. వాళ్ళ ఇళ్ళు తెలియకపోయే ప్రసక్తిలేదని గ్రామస్తులంటున్నారు. పోలీసులకయితేనే వాళ్ళ ఇళ్ళు తెలియవు. రవిని వాళ్ళు ఆ తరువాత చొక్కా వేసుకొని రమ్మన్నారు. అతని తండ్రిసింగిరెడ్డి సాయిరెడ్డి తన కొడుకునేమీ చేయొద్దని కాళ్ళమీద పడ్డాడు. వాళ్ళు ఆయనను తమ బూటుకాళ్ళతో తన్నారు. అసలు కాళ్ళకు బూట్లు వేసుకునే అలవాటు అక్కడ పనిచేసే ఏ నక్సలైట్ పార్టీ దళానికి లేదని ప్రజల అభిప్రాయం.

వాళ్ళు రవీందర్ రెడ్డిని ఊరిబయట ఉన్న హరిజనుల ఇళ్ళ దగ్గరకు తీసుకుపోయి అక్కడ నిలబెట్టి పాటలు పాడమన్నారు. ఆ తరువాత కాల్చేశారు. మొదట 303తో కాల్చినట్టు, మూడు విడివిడి తుపాకీగుండ్ల శబ్దం, ఆ తరువాత ఆటోమేటిక్ తుపాకీతో కాల్చినట్టు వరుసగా తూటాల శబ్దం వినబడ్డాయి. మరొక రెండు గంటల తరువాత, అంటే ఉదయం మూడున్నర వేళ నాలుగు గంటలప్పుడు తమ్ముడు నలందర్ అన్నను వెతుక్కుంటూ పోయాడు. ఊరు బయట శవం కనబడింది. ఎడమ కంట్లో ఒకటి, చెంప మీద ఒకటి, ఎడమ చేతిమీద రెండు పొట్టలో రెండు, తొడలో ఒకటి తూటాలు ఉన్నాయి.

పొద్దున్న వీళ్ళు ఫోన్ చేయగా ఘన్‌పూర్ ఎస్.ఐ. వచ్చాడు. ఆ తరువాత ములుగు సి ఐ. ప్రభాకరబాబు తన గన్‌మాన్‌తో సహా వచ్చాడు. వాళ్ళిద్దరినీ చూడగానే వాళ్ళు క్రితం రాత్రి వచ్చిన వాళ్ళేనని రవీందర్ రెడ్డి బంధువులకు అనిపించింది. వాళ్ళ ప్రవర్తన కూడా అందుకు తగ్గట్టు విచిత్రంగానే ఉంది. ప్రభాకరబాబు శవం దగ్గరకు రాకుండా దూరంగా నిలబడి సిగరెట్టు కాల్చుకుంటూ ఉండగా అతని గన్‌మాన్ నేరుగా శవానికి పది గజాల దూరంలో ఉన్న తూటాల దగ్గరికి పోయి వాటిని ఏరసాగాడు. మరి కొంత సేపటికి జిల్లా ఎస్పీ నాగరాజు వచ్చి "ఇది ఫణి బాగ్చీ గ్రూప్‌వాళ్ళపనే అయి ఉంటుంది" అని సానుభూతి వాక్యాలు పలికాడు.

చెప్పుకోదగ్గ విషయమేమంటే ముందు రోజు రాత్రి తండ్రి సాయిరెడ్డి ఎక్కడికి తీసుకుపోతున్నారని అడగగా "జనార్ధనన్న రమ్మన్నాడు" అని సమాధానం చెప్పి తీసుకుపోయారు. జనార్దన్ ఆ ప్రాంతంలో పీపుల్స్‌వార్ దళనాయకుడు. అంటే నేరం ఎవరిమీద మోపాలో అన్న స్పష్టమైన ఆలోచన కూడా లేకుండా పోలీసులు బుకాయించారన్నమాట. అయితే కొద్ది కాలం పాటుకే హతుడి బంధుమిత్రులను తప్పుదారి పట్టించడంలో కృతకృత్యులయ్యారు. తరువాత వాస్తవాలు బయట పడ్డాయి.

## వెల్లుట్ల (నిజామాబాద్ జిల్లా)

మెదక్ జిల్లా నాగాపురం గ్రామానికి చెందిన గద్దె సిద్దయ్యను, మన్నె యాదగిరిని ఆగస్టు పదో తేదీ రాత్రి పోలీసులు నిజామాబాద్ జిల్లా వెల్లుట్ల గ్రామం వెలుపల ఉన్న ఎ.పి.ఎస్.పి. పోలీసు క్యాంపు దగ్గర కాల్చేసారు. మెదక్‌లో ఎన్‌కౌంటర్ చెయ్యడానికి వెనకాడి నిజామాబాద్‌లో చేసేస్తే మీనాగారి రాజ్యంలో జరుగుతున్న అత్యాచారాలలో కలిసిపోతుందని భావించి వెల్లుట్లకు తీసుకుపోయి కాల్చేసారో లేక నిజంగానే వెల్లుట్ల దగ్గరే దొరికారో తెలీదు. అంతకు ముందు, ఆగస్టు రెండవ తేదీన మెదక్ జిల్లా దర్పల్లి గ్రామంలో ఒక ఎన్‌కౌంటర్ కొద్దిలో తప్పింది. ఎర్రారపు పెంటయ్య, అంజాగౌడ్, లింగయ్య అనే ముగ్గురు రైతుకూలి సంఘం కార్యకర్తలను వెల్దుర్తి ఎస్.ఐ. మాణిక్యం అరెస్టు చేస్తానని బెదిరించి, పెంటయ్యను అయితే అరెస్టుచేసి ఆరురోజులు కొట్టి మొత్తం నాలుగువేల రూపాయలు వసూలు చేసుకున్న విషయం తెలిసి నక్సలైట్ దళం దర్పల్లి గ్రామానికి వచ్చి వాస్తవాలు విచారిస్తూ ఉండగా పోలీసులు మూడు జీపులలో వచ్చి దాడిచేసి నేరుగా కాల్పులు జరిపారు. మెదక్ సి.ఐ. సత్యనారాయణ అధ్వర్యంలో జరిగిన ఈ కాల్పులలో ఎవరూ చనిపోలేదు కానీ కొందరు గాయపడ్డారు. దీనినిబట్టి మెదక్‌లో కూడా ఎన్‌కౌంటర్లు చెయ్యడానికి పోలీసులు వెనకాడడం లేదని భావించవలసి ఉంటుంది.

ఇకపోతే నాగాపురానికి చెందిన గద్దె సిద్దయ్య ఒకప్పుడు రాడికల్స్‌లో పనిచేసి ఆ తరువాత మానుకున్నాడు. పోలీసులకు సన్నిహితుడయ్యాడనికూడా అంటారు. మెదక్ రూరల్ ఎస్.ఐ. కిష్టయ్య అతనిని తనతో తిప్పుకునేవాడనీ అతనికి ఏమైనా అయితే గ్రామానికి అగ్గి పెడతానని బెదిరించేవాడనీ నాగాపురం గ్రామస్తులు చెప్తారు. ఆగస్టు పదో తేదీ సాయంత్రం మన్నె యాదగిరి సిద్దయ్య ఇంటికి వచ్చి ఒక చిట్టీ చూపించి తనతో రమ్మన్నాడు. సిద్దయ్య అయిష్టంగానే

వెళ్ళాడు. గ్రామ సర్పంచ్ స్కూటరును అరువుకు తీసుకుని, మెదక్‌నుండి బాన్స్ వాడ వెళ్ళే రహదారిమీదుగా బయలుదేరాడు. సిద్దయ్య నడుపుతుండగా యాదగిరి వెనక కూర్చున్నాడు. వాళ్ళిద్దరి దగ్గరా తుపాకులు లేవనీ, సహా అయితే యాదగిరి దగ్గర బాంబులు ఉండి ఉండవచ్చుననీ గ్రామస్తుల కథనం.

ఆ రోజు అర్ధరాత్రి బాన్స్‌వాడ ఇవతల రోడ్డునుండి లోపలికి వున్న వెల్లుట్ల గ్రామం దగ్గర ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసుల కథనం. స్కూటర్‌మీద వచ్చిన ఆ ఇద్దరూ చాలా విచిత్రంగా వెల్లుట్ల రహదారివైపునుండి కాక అవతలి వైపునుంచి సమీపించారనీ, స్కూటర్‌ను గ్రామం బయట ఆపి, గ్రామం మొదట్లో వున్న ఎ.పి.ఎస్.పి. క్యాంపును సమీపించి బాంబులతో దానిమీద దాడి చేశారనీ సెంట్రీ గమనించి హెచ్చరిక చేయగా క్యాంపులోని పోలీసులు బయటకు వచ్చి ఎదురుకాల్పులు జరిపి ఆ ఇద్దరినీ కాల్చేసారనీ పోలీసులు అంటారు. మొత్తం ఏడు రౌండ్లు వినపడ్డాయని వెల్లుట్ల గ్రామసర్పంచ్ బాలరాజు అంటాడు. పంచనామా రిపోర్టు ప్రకారం ఒకరి శరీరంలో నాలుగు గాయాలు, ఒకరి శరీరంలో మూడు గాయాలు వున్నాయి. అంటే ఈ నక్సలైట్లు కాల్పులేమీ జరపలేదని స్పష్టం అవుతుంది.

అంతేకాక స్కూటర్ ఆపిన స్థలంనుండి పోలీసు క్యాంప్‌కు వెళ్ళే రహదారి చాలా ఇరుకుగా వుంది. రెండువైపులా మొక్కలు, కంచె, చెట్లు ఉన్నాయి. ఎక్కడనుంచి వాళ్ళు బాంబులు వేశారని చెబుతున్నారో, అక్కడినుంచి బాంబులు విసిరితే అది చెట్టు కొమ్మలకో కంచెకో తప్ప క్యాంపుకు తగలదు. క్యాంపునుండి ఆ స్థలంలో వున్న వాళ్ళమీద కాల్పులు జరిపి చంపడమూ సాధ్యంకాదు. మొత్తానికి వెల్లుట్ల ఎన్‌కౌంటర్ మీనాగారు పుణ్యం కట్టుకున్న మరొక హత్య తప్ప వేరేమీ కాదు.

## సిరిసిల్ల (కరీంనగర్ జిల్లా)

వ్యవసాయ కూలీ మహిళాసంఘం కార్యకర్తలు వసంత, సుజాతల అదృశ్యాన్ని గురించి హైకోర్టు ఆదేశం మేరకు కరీంనగర్ జిల్లా జడ్జి నిర్వహించిన విచారణను భగ్నం చేయడానికి సి.ఐ. మొగిలయ్య చేసిన ప్రయత్నం గురించి మీకు తెలిసిందే. ఆ తరువాత ఆ ప్రయత్నం మరొక హత్యదాకా వెళ్ళింది. విచారణకు సాక్షులను తేవాలని ప్రయత్నం చేస్తూన్న సుభాష్‌ను ఆగస్టు 24వ తేదీ తెల్లవారుజామున సిరిసిల్ల సమీపంలో కాల్చివేశారు పోలీసుల కస్టడీనుండి

తప్పించుకుని పారిపోవాలని ప్రయత్నించేస్తూ ఒక ఎస్.ఐ. రివాల్వర్‌ను లాక్కొని అతనినే చంపబోగా ఆత్మరక్షణార్థం సుభాష్‌మీద కాల్పులు జరపవలసి వచ్చిందని ఒక కథ అల్లి ప్రచారం చేశారు.

కరీంనగర్ కోర్టుకు సాయుధ పోలీసు పహారా పెట్టి సి.ఐ. మొగిలయ్య విచారణ జరగనివ్వకుండా అడ్డుపడుతున్నారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర హైకోర్టుకు నివేదించగా, హైకోర్టు విచారణను హైదరాబాద్‌లోని ప్రథమ మెట్రోపాలిటన్ కోర్టుకు బదిలీ చేసింది. ప్రథమ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జూలై 21వ తేదీన విచారణ ప్రారంభించారు. ఆరోజు మొగిలయ్య మళ్ళీ ముగ్గురు స్టెన్‌గన్‌లు పట్టుకున్న గన్‌మెన్లను వెంట తెచ్చుకున్నాడు. దీనికి పౌరహక్కుల సంఘం బాధ్యులు నిరసన తెలపగా జడ్జిగారు ఇక మీదట సాయుధ పోలీసులు కోర్టు బిల్డింగ్‌లోకి రావడానికి వీల్లేదని ఆదేశించారు. అట్లాగైతే తాను హాజరు కాజాలనని సి.ఐ. మొగిలయ్య విచారణను బహిష్కరించాడు. కోర్టు ఆగస్టు 18వ తేదీన పిటీషనర్‌ను విచారించింది. సాక్షుల విచారణ కోసం ఆగస్టు 25వ తేదీని కేటాయించింది. 22వ తేదీన పౌరహక్కుల సంఘం బాధ్యులు కరీంనగర్ వెళ్ళి సుభాష్‌ను కలిశారు. వసంతను అరెస్టు చేసిన గర్షకుర్తి గ్రామానికి చెందిన సాక్షులతో పౌరహక్కుల సంఘం బాధ్యులే మాట్లాడి హైదరాబాద్ తీసుకుపోవాలని, సుజాతను అరెస్టుచేసిన గుంలాపూర్ గ్రామానికి చెందిన సాక్షులను సుభాష్ తీసుకురావాలని ఏర్పాటు చేసుకున్నారు. అదేవిధంగా గర్షకుర్తి గ్రామానికి చెందిన ప్రధాన సాక్షి దాది మల్లమ్మను 25వ తేదీన హైదరాబాద్ తీసుకుపోవడం, ఆమె సాక్ష్యాన్ని రికార్డు చేయడం సవ్యంగా జరిగిపోయింది. కానీ సుభాష్‌ని మటుకు తన ప్రయత్నంలో ఉండగా 24వ తేదీ సాయంత్రం చొప్పదండి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొలిమికుంట గ్రామంవద్ద పోలీసులు అరెస్టు చేశారు. నర్సక్క అనే సాక్షితోపాటు సుభాష్ ఆ గ్రామం బస్టాండ్‌వద్ద నిలబడి వుండగా పోలీసులు వచ్చి దొంగ దొంగ అని వెంటబడ్డారు. నర్సక్క తప్పించుకోగా సుభాష్ దొరికాడు. జనం చూస్తూ ఉండగా దొరికాడు. కాబట్టి అతని అరెస్టును చొప్పదండి పోలీసు స్టేషన్‌లో రికార్డుచేసి విచారణ నిమిత్తం సిరిసిల్లకు తీసుకు వెళుతున్నామని చెప్పి దారిలో కాల్చేశారు. అతను మూత్రానికి వెళతానంటే జీపు ఆపి దిగనున్నారని, అతను ఆ అదను చూసుకుని పారిపోయే ప్రయత్నంలో ఎస్.ఐ. రివాల్వర్‌ను లాక్కున్నాడనీ ఒక పచ్చి అబద్ధపు కథ అల్లి ప్రచారం చేసారు. కరీంనగర్ పోలీసులు గతంలో కోటా నింపడానికి హత్యలు చేశారు. ప్రమోషన్ల కోసం హత్యలు చేశారు. పారితోషికం కోసం హత్యలు చేశారు. ఇప్పుడు ఒక జంట హత్యలమీద విచారణ జరపకుండా ఆపడానికి మరొక హత్య చేశారు.

## గోదావరిఖని [కరీంనగర్ జిల్లా]

సరిగ్గా పిట్టల సత్తయ్యను చంపిన పద్ధతిలోనే గోదావరిఖనిలో మరొక జనరక్షణసమితి కార్యకర్తను పోలీసులు కాల్చేశారు. ఎల్లంపల్లి వాస్తవ్యుడయిన బడికెల చంద్రమోహన్ (25) అనే కార్యకర్తను అక్టోబర్ 23 సాయంత్రం టి.వి.లో తెలుగువార్తలు వస్తున్న సమయంలో గోదావరిఖని 5 ఇంక్లయిన్ ప్రాంతంలో రెండువైపులా కార్మికుల ఇళ్ళున్న వీధిలో పోలీసులు కాల్చేశారు. 'ఎన్‌కౌంటర్' జరిగింది అన్నారు.

గోదావరిఖని డి.ఎస్.పి. గంగాధర్ 'ఎన్‌కౌంటర్' జరిగిన రెండు వారాలకు ఇంకా ఏం కథ చెప్పాలో నిర్ణయించుకోలేదు. సి.ఐ. వెంకట్రావు మట్టుకు ఒక కథానిక చెప్తున్నాడు. 23 సాయంత్రం 5 ఇంక్లయిన్ ప్రాంతంలో జనరక్షణ సమితి కార్యకర్తలు తిరుగుతున్నారని విని పోలీసులు వెళ్ళారంట. కాలినడకన వెళుతున్న పోలీసులకు రెండు సైకిళ్ళమీద ముగ్గురు జనరక్షణ సమితి కార్యకర్తలు ఎదురయ్యారు. ఒక సైకిల్‌మీద చంద్రమోహన్, రెండవ సైకిల్‌మీద నర్సయ్య అనే వ్యక్తి, మరొక గుర్తుతెలియని వ్యక్తి వున్నారు. పోలీసులు వాళ్ళను ఆగమంటే ఆగకుండ వాళ్ళలో ఒకరు అమెరికా తయారీ ఆటోమాటిక్ పిస్టల్ తీసి పోలీసులమీద కాల్పులు జరిపాడు. మొత్తం 9 రౌండ్లు కాల్చాడంట గానీ పోలీసులకు ఎటువంటి హానీ కలగలేదు. పోలీసులు అప్పుడు ఆత్మరక్షణార్థం ఎదురు కాల్పులు జరపగా చంద్రమోహన్‌కూ, నర్సయ్యకూ గాయాలయినాయి చంద్రమోహన్ తన సైకిల్‌ను అక్కడే వదిలేసి పారిపోయాడు. మిగిలిన ఇద్దరూ సైకిల్ మీద పారిపోయారు. ఆ తరువాత పోలీసులు వెతకగా వెతకగా రెండు మూడు రోడ్ల అవతల చంద్రమోహన్ శవం దొరికిందట.

అయితే ఆ ప్రాంతంలోని ప్రజల కథనాన్నీ డా॥ పోచమల్లు రాసిన శవ పరీక్ష నివేదికనూ చూస్తే ఇదంతా వచ్చి అబద్ధం అని అర్థమవుతుంది. కాల్పులు జరిగిన వీధిలో జనాన్ని అడిగితే అయిదు రౌండ్లకంటే ఎక్కువ వినబడలేదని ఏకగ్రీవంగా అంటున్నారు. చంద్రమోహన్‌కు నాలుగు తూటాలు తగిలాయి. నర్సయ్యకు కనీసం ఒకటయినా తగిలి ఉండాలి. అంటే అయిదు రౌండ్లూ జనరక్షణ సమితి కార్యకర్తలకే తగిలాయి. ఇంక వాళ్ళు కాల్చిన తూటాలేవి ?

అంతేకాదు, ఏ రోడ్లోనయితే చంద్రమోహన్ శవం దొరికిందో ఆ రోడ్లో కూడా తూటాలు పేల్చిన చప్పుడు స్థానిక ప్రజలు విన్నారు. ఈ తూటాలు ఎవరు పేల్చినట్టు? మరొక ముఖ్యమయిన విషయం శవపరీక్ష నివేదిక నుండి తెలుస్తూవుంది. చంద్రమోహన్‌కు నాలుగు తూటాలు తగిలాయన్నాము. వాటిలో

ఒకటి గుండెలో నుండి దూసుకుపోయింది. ఆ తూటా తగిలిన తరువాత చంద్ర మోహన్ లేచి పారిపోయి రెండు వీధుల అవతల పడిపోయే ప్రసక్తిలేదు. ఇంకొక రకంగా చెప్పాలంటే, చంద్రమోహన్ను ఎక్కడ కాల్చారో అక్కడే చని పోయాడు.

అసలేం జరిగిందో ఊహించడం పెద్ద కష్టంకాదు. జనరక్షణ సమితి కార్యకర్తలను దొరికితే తుదముట్టించడానికి పోలీసులు సిద్ధంగా వున్నారు. వాళ్ళను గురించి మీ అభిప్రాయం ఏమిటని గోదావరిఖని డి. ఎస్. పి. గంగాధర్ గారిని అడిగితే అంతా గూండాలూ, రౌడీలు, డాకూలు అని సమాధానం చెప్తాడు. అక్టోబరు 23 సాయంత్రం 5 ఇంక్లైయిన్ ప్రాంతంలో జనరక్షణ సమితి కార్యకర్తలు తిరుగు తున్నారని విని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు చంపడానికే బయలుదేరారు. ఒక రోడ్లో చంద్రమోహన్, నర్సయ్య, మరొకవ్యక్తి, రెండు సైకిళ్ళమీద ఎదు రయ్యారు. సైకిల్ తొక్కుతూ ఆటోమేటిక్ పిస్తోల్తో కాల్పులు జరపడం సాధ్యం అయ్యేపనికాదు. బహుశా వాళ్ళు తప్పకు ఎదురయింది పోలీసులని గమనించ లేదేమో కూడ. పోలీసులు పట్టుకు వాళ్ళమీద కాల్పులు జరిపారు. నర్సయ్య గాయపడ్డాడుగానీ మూడవ వ్యక్తి అతనిని సైకిల్మీద తప్పించాడు. చంద్ర మోహన్ మట్టుకు కిందపడ్డాడు. అయితే లేచి తమాయించుకొని పారిపోయాడు. రెండు మూడు వీధులు దాటేసరికి పోలీసులు అతనిని తరిమి పట్టుకొని కాల్చేశారు. శవాన్ని ఖాళీగావున్న ఒక ఇంటి బయట పారేసి రాత్రంతా కాపలా వున్నారు. పొద్దునగాని ఆ వీధిలోని ప్రజలకు చూపించి 'గుర్తుపడతారా' అని అడగలేదు.

## పులిమడుగు [ఆదిలాబాద్ జిల్లా]

మంచిర్యాలకూ మందమర్రికీ మధ్యన హైదరాబాద్–చాందా రహదారి మీద వుంది పులిమడుగు గ్రామం. డిసెంబర్ 11వ తేదీ ఉదయం 6 గంటలప్పుడు పులిమడుగు గ్రామ శివార్లలో ఒక కందిచేనులో 'పెట్రోలింగ్' చేస్తున్న పోలీస్ టీపుకు ఎదురుగా సైకిల్మీద డబుల్ రైడింగ్చేస్తూ పూరెల్లి తిరుపతి (ఉరఫ్ ఆనంద్, ఉరఫ్ సుదర్శన్), చాంద్పాషా (ఉరఫ్ దేవెడ్) అనే జనరక్షణ సమితి కార్యకర్తలు ఎదురు వచ్చారట. పోలీసులు ఆగి వాళ్ళను దిగమని చెప్పి దిగగానే పట్టుకొన్నారట. పోలీసులు పట్టుకోగానే ఊరుకొని అప్పుడు ఆ యిద్దరిలో ఒకడు సంచిలోని జర్మన్ రివాల్వర్ బయటికి తీశాడంట. రివాల్వర్ తీశాడంటే ఇంక హత్య చేయబోతాడని స్పష్టమే కాబట్టి పోలీసులు ఎదురుకాల్పులు జరిపి ఇద్దరినీ కాల్చేశారంట. పొద్దున్న 6 గంటలకు ఈ 'ఎన్కౌంటర్' జరగగా 8 గంటలకు

మందమర్రి ఎం.ఆర్.ఓ. సూర్యప్రకాశ్‌రావుగారిని పిలిచి చనిపోయినవారి పేర్లూ అడ్రస్‌లూ (ఉరఫ్‌తో సహా) చెప్పేశారు. మధ్యాహ్నం లోపల పంచనామా ముగించి, మంచిర్యాల ప్రభుత్వ డాక్టర్ హనుమంతరావుగారిని కందిచేనుకి రప్పించి అక్కడే పోస్ట్‌మార్టం జరిపించి రెండు శవాలను ఒకే చితిమీద పేర్చి తగలబెట్టేశారు. (ఒకరు హిందువు, ఒకరు ముస్లిం. పైగా ఒకరు ఉరఫ్ క్రైస్తవ నామధేయం కాబట్టి ఒకే చితిమీద దహనం చేయడం మతసామరస్యం కోసం అయి వుండాలి.)

కందిచేనులో పెట్రోలింగ్ ఏమిటా అని మొదటే ఎవరికయినా అనుమానం వస్తుంది. రివాల్వర్ తీశారని చెప్తున్న సంచి మృతుల భుజాలకు కాక సైకిల్‌కు వేళ్ళాడుతూ వుందనీ ఆ సైకిల్ వీళ్ళ శవాలకు 10 గజాల దూరంలో వుందనీ ఎం.ఆర్.ఓ. చెప్తే అనుమానం ఇంకా పెరుగుతుంది. ఈ ఎన్‌కౌంటర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన బెల్లంపల్లి అడిషనల్ ఎస్.పి. మహేందర్‌రెడ్డిగారు గతంలో కరీంనగర్ జిల్లా గోదావరిఖని డి ఎస్.పి.గా ఉన్నారనీ అప్పుడు ఆయన ఆధ్వర్యంలోనే మొట్టమొదటిసారిగా ఒక జనరక్షణ సమితి కార్యకర్త (పిట్టల సత్తయ్య) ఎన్‌కౌంటర్‌లో చంపడం జరిగిందనీ గుర్తుకురాగానే అనుమానం రెండింతలవుతుంది.

నిజానికి అంతకుముందు రెండు మూడు దినాలుగా తిరుపతి చాంద్‌పాషాలతో బాటు బొగ్గు రాములు అనే జనరక్షణ సమితి ముఖ్యుడు మందమర్రి, మంచిర్యాల, బెల్లంపల్లి ప్రాంతంలో తిరుగుతున్నారు. వీరిలో బొగ్గు రాములు పోలీసులకు చాలా 'కావలసిన'వాడు. డిసెంబర్ 10వ తేదీ సాయంత్రం 7-00 గంటలప్పుడు ఇతను మంచిర్యాలలో పోలీసుల చేతికి చిక్కినట్టే చిక్కి తప్పించుకున్నాడు. అతను తప్పించుకున్నాడుగానీ వేరే ఎవరో జనరక్షణ సమితి కార్యకర్తలు పోలీసుల చేతికి దొరికారని జనం అనుకోసాగారు. వాళ్ళు తిరుపతి, చాంద్‌పాషా అయివుండాలని. ఈ యిద్దరినీ ఆ రాత్రి బాగా కొట్టి 11వ తేదీ ఉదయం పులిమడుగు శివారు కంది చేనులోకి తీసుకొచ్చి కాల్చేశారు. రామగుండం దగ్గరున్న వాళ్ళ బంధువులకు పోలీసులే కబురుపెట్టారు. అయితే బంధువులొచ్చేదాకా ఆగకుండా తామే దహనం చేసేశారు. బంధువులు వచ్చి చూస్తే శరీరాలమీద బుల్లెట్ గుర్తులేకాక చిత్రహింసల చిహ్నాలు కూడ కనబడతాయనే పోలీసులు తొందరపడ్డారనుకోవాలి.

## గౌరిదేవిపల్లి [మహబూబ్‌నగర్ జిల్లా]

గోపాల్‌పేట మండలంలోని గౌరిదేవిపల్లి గ్రామంలో 13-12-90 ఉదయం 5–6 గంటల మధ్య పోలీసులు దేవుని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డిని గోడకు నిలబెట్టి కాల్చి చంపారు.

పెద్ద కొత్తపల్లి మండలం దేవుని తిర్మలాపురం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, గడ్డం బొజ్జన్న, గడ్డం నర్సిములు ఆ గ్రామ రైతుకూలీ సంఘం సాధారణ సభ్యులు. కృష్ణారెడ్డికి ఇద్దరు సోదరులు, దాదాపు ఏడున్నర ఎకరాల పొలం ఉంది. భార్య యిద్దరు పిల్లలు ఉన్నారు. చాలాకాలం ఆయన తెలుగుదేశం పార్టీ సభ్యునిగా వున్నాడు. గడ్డం బొజ్జన్న వయస్సు 40 సం॥లు. ఇద్దరు భార్యలు, ఒకే కుమార్తె, రెండు ఎకరాల పొలం ఉంది. భార్య బట్టలు కుట్టి సంపాదిస్తుంది. పాత యింజన్ల వ్యాపారము చేసేవాడు. గడ్డం నర్సిములు వయస్సు 25 సం॥లు. వివాహితుడు. ఒక కుమారుడు ఉన్నాడు. భార్యా, భర్తలు యిద్దరు హైద్రాబాదులోని పొట్టు బొల్లారంలో ఇనుముని కరగపోసే ఒక కంపెనీలో 1988 నుంచి పనిచేస్తున్నారు. ఈమధ్యనే పండగకు వూరికి వచ్చి తిరిగి పనికి వెళ్ళలేదు.

ఈ ముగ్గురిపై ఎలాంటి కేసులు యింతవరకు లేవు. వారి ప్రవర్తన గురించి కూడా గ్రామంలో ఎలాంటి ఫిర్యాదులు లేవు. వీరికి చదువు కూడా రాదు.

ఈ ముగ్గురు దేవుని తిర్మలాపురం గ్రామ రైతుకూలీ సంఘం సభ్యులైనందున 20-12-90నాడు అచ్చంపేటలో జరిగే రైతుకూలీ సభలకు సంబంధించి పోస్టర్లను 12-12-90న దేవుని తిర్మలాపురం గ్రామంలో గోడలపై అతికించారు. అదేరోజు దేవుని తిర్మలాపురం సర్పంచ్ శ్రీ హుసేనయ్య యింటి గోడలకు కూడా పోస్టర్లు అతికించాడు.

దేవుని తిర్మలాపురం గ్రామస్తుల కథనం ప్రకారం 12-12-90 గురువారం సాయంకాలము దాదాపు 5 గంటల సమయంలో కృష్ణారెడ్డి, గడ్డం బొజ్జన్న, గడ్డం నర్సిములు సైకిళ్ళపై అచ్చంపేట మీటింగు కరపత్రాలు, పోస్టర్లు తీసుకొని గ్రామం నుంచి బయలుదేరారు. వారు 7 గంటల ప్రాంతములో రావిపాకుల గ్రామానికి చేరుకుని పోస్టర్లు అతికించి కరపత్రాలు పంచారు. అక్కడ కృష్ణారెడ్డి మేనమామ నాగిరెడ్డి కలిశాడు. ఆ రాత్రికి అక్కడే వుండమని నాగిరెడ్డి కోరగా పోస్టర్ల పని వుందని చెప్పి ముగ్గురూ బయలుదేరి గౌరిదేవిపల్లికి దాదాపు రాత్రి 10 గంటల సమయంలో చేరుకున్నారు. రాత్రి ఎక్కువైనందున, శ్రీ ఆంజనేయస్వామి గుడిలో పడుకున్నారు. చలిమంట కూడా పెట్టుకున్నారు.

పక్కగ్రామము నాగపూర్‌లోవున్న పోలీసులు ఈ విషయాన్ని తెల్సుకొని రాత్రిపూటనే గౌరిదేవిపల్లిలోని గుడి దగ్గరకు చేరుకున్నారు. పోలీసులు గ్రామంలోనికి ప్రవేశించటము గమనించిన ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఆ సమయంలో నిద్రావస్థలోవున్న ఆ ముగ్గురిని పోలీసులు హెచ్చరించి, బయటికి రప్పించారు. ఇలా బయటకు వచ్చిన ఆ ముగ్గురి చేతులలో ఎలాంటి ఆయుధాలు లేవని, ముగ్గురూ చేతులు పైకెత్తుకొనే బయటకు వచ్చారని ప్రజలు తెలిపారు. వారిని సులభంగా పోలీసులు తమ కస్టడీలోకి తీసుకునే అవకాశమున్నా

అలా చేయకుండా పోలీసులు ఆ ముగ్గురిని గుడికి దాదాపు పది అడుగుల ధూరంలో ఉన్న బక్కా రెడ్డి యింటి గోడకు ఆనించి నిలబెట్టారు. గ్రామ ప్రజలు వారిస్తుండగానే పోలీసులు కృష్ణారెడ్డిపై కాల్పులు జరిపారు. అతడు వెంటనే నేలకొరిగాడు. అప్పుడు ప్రజలు మిగిలిన యిద్దరినీ కాల్చవద్దని పోలీసులను ప్రాధేయపడ్డారు. దాంతో పోలీసులు ఆ యిద్దరిని అనగా గడ్డం నర్సిములు, గడ్డం బొజ్జన్నలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసు కాల్పుల కంటే ముందు ఎలాంటి కాల్పుల చప్పుడు వినలేదని గ్రామస్తులు తెలిపారు. పోలీసులు పేల్చిన ఒకే ఒక్క తూటా మృతుడు కృష్ణారెడ్డి శరీరములోంచి దూసుకువెళ్ళి గోడకు పెచ్చు పూడటం కన్పించినది. కృష్ణారెడ్డి శరీరం నుండి కారిన రక్తం గోడ నుండి క్రింద భూమికి పారిన విషయం స్పష్టంగా కన్పించింది. అక్కడ గుమికూడిన ప్రజలపై పోలీసులు లాఠీచార్జీ చేశారు. సాయంకాలం వరకు పత్రికా విలేకరులను ఆ దరిదాపులకు రానీయలేదు. అదేరోజు దేవుని తిర్మలాపురంలో కృష్ణారెడ్డి యింటిపై దాడిచేసి భూమి కాగితాలు పోలీసులు తీసుకువెళ్ళారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. గడ్డం బొజ్జన్న, గడ్డం నర్సిములు ఇళ్ళు కూడా సోదా చేశారని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. బహుశా ఇంత నగ్నమయిన 'ఎన్‌కౌంటర్' హత్య మన రాష్ట్ర చరిత్రలోనే లేదేమో.

## మోస్రా [నిజామాబాద్ జిల్లా]

నిజామాబాద్ నుండి బోధన్ వెళ్ళే రహదారి ప్రక్కన, నిజామాబాద్‌కు 15 కి.మీ.ల దూరంలో, మోస్రా గ్రామ శివారులోవున్న ఒక చిన్న బోడు దగ్గర డిసెంబర్ 29 తెల్లవారుజామున జరిగిన 'ఎన్‌కౌంటర్'లో సిరడి బాలన్న, గిర్మాజీ యాదగిరి అనే తీవ్రవాదులు చనిపోయారని మీనాగారు ప్రకటించారు. రోడ్డుమీద తన మానాన పోతున్న పోలీసు వాహనంమీద ఆ ఇద్దరు తీవ్రవాదులు బోడుమీద నిలబడి కాల్పులు జరిపారనీ, పోలీసులు వాహనాన్ని ఆపి ఎదురుకాల్పులు జరిపి వారిద్దరినీ చంపారని ఆయన కథనం.

బాలన్న, యాదగిరిలది మోస్రానుండి రెండు కి.మీ.లు ఇవతల వున్న కొత్తపేట గ్రామం. యాదగిరికి ఎప్పుడూ విప్లవ రాజకీయాలతో ఏ సంబంధమూ లేదు. అయితే అతని పొలం బాలన్న పక్కపొలం. బాలన్న 4 ఏళ్ళు నక్సలైట్ రాజకీయాలతో పనిచేశాడు గానీ అతని ప్రవర్తన సరిగ్గా లేదని వాళ్ళ పార్టీయే అతన్ని బహిష్కరించింది. బహిష్కరించిన తరువాత అతను గ్రామానికి తిరిగి వచ్చాడుగానీ పోలీసుల భయానికి ఇంటిదగ్గర ఉండక, పొలానికి కావలాగా పొలం దగ్గరే ఉంటున్నాడు. వాళ్ళ ఊరికి దగ్గర చిట్టడవి సమృద్ధిగా ఉంది కాబట్టి అడవి

పందులు చేలమీదికి దాడులు చేస్తుంటాయి. అందువల్ల నిరంతరం కాపలాకూడా అవసరమే.

డిసెంబర్ 28 రాత్రి యాదగిరి, బాలన్న యాదగిరి చేనులోని మంచె మీద పండుకున్నారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో దాదాపు 50 మందితో కూడిన పోలీసు పార్టీ కొత్తపేట గ్రామ శివారులోనికి ప్రవేశించింది. భద్రునాయక్ అనే లంబాడా రైతును లేపి కొట్టి, బాలన్న చేనెక్కడ అని అడిగారు. అతను తోవ చూపించాడు. పోలీసులు ఆ దిక్కుగా వెళ్ళి ఇద్దరినీ లేపి తీసుకువెళ్ళి మోస్రా శివారులోని బోడు దగ్గర కాల్చేశారు.

భద్రునాయక్‌కు ఈ సంగతి తెలియదుగానీ, తనను అడిగినవాళ్ళు పోలీసులని గుర్తించాడు. పొద్దున్నే లేచి ఊళ్ళో చెప్పాడు. పార్టీయే బహిష్కరించిన బాలన్ననూ, ఏ సంబంధమూ లేని యాదగిరిని పోలీసులు చంపి వుంటారని ఊరి జనం ఊహించలేదు. అరెస్టుచేసి వుంటారనుకొని నిజామాబాద్ వెళ్ళి వాకబు చేద్దామని తయారవుతున్నారు. అంతలో, మోస్రాకు పాలు పోయడానికి వెళ్ళిన గ్రామస్తులు తిరిగివచ్చి ఆ యిద్దరి శవాలు ఫలాన చోట వున్నాయనీ, పోలీసులు కాపలా వున్నారనీ చెప్పారు. ఆ విధంగా వాళ్ళు తెలుసుకోవలసి వచ్చిందేతప్ప పోలీసులు చావు కబురు సహితం భార్యాపిల్లలకు చేరవేయలేదు.

## పిట్టంపల్లి (నల్గొండ జిల్లా)

జనవరి 4వ తేదీన రాడికల్స్ రిజర్వేషన్లకు మద్దతుగా రాస్తారోకో పిలుపిచ్చారు. ఆ రోజు ఉదయం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిమీద వాళ్ళు బలమైన మందు పాతరలతో ఒక బ్రిడ్జిని పేల్చేయడానికి ప్రయత్నించారని, ఒక ఆర్.టి.సి బస్సును తగలపెట్టడానికి ప్రయత్నించారని, ఈ ప్రయత్నంలో ఉన్నవారిని పోలీసులు తరమగా పిట్టంపల్లి గుట్టల దగ్గర 'ఎన్‌కౌంటర్' జరిగి యాదయ్య (ఉరఫ్ జిట్ల సుదర్శనరెడ్డి), జగన్‌లు మరణించారని, జిల్లా ఎస్.పి. జె.వి. రాముడుగారు ప్రకటించారు.

మందుపాతర సంగతి తెలియదుగాని, బస్సును ఆపి తగలబెట్టే ప్రయత్నం చేస్తున్న యువకులను పోలీసులు తరిమిన మాట వాస్తవం. వాళ్ళు పిట్టంపల్లి గ్రామంలోకి పరుగుతీశారు. అక్కడ అందే లక్ష్మయ్య అనే రైతు ఇంట్లో యాదయ్య, జగన్, మరొక 12 మంది వున్నారు. పోలీసులు పారిపోతున్న యువకులను వెంబడించి ఆ యింటిదగ్గరికి వచ్చారు. ఇంట్లోవున్న వారందరినీ అరెస్టుచేసి ఇద్దరిద్దరు చొప్పున ఒకరి వీపుకు ఒకరిని నిలబెట్టి కట్టారు. బట్టలు ఊడదీసి బాగా కొట్టి ఊరి బయటికి నడిపించుకువెళ్ళారు. గ్రామస్థులు గుంపుగా ఎదురురాగా వాళ్ళను చెదరగొట్టడానికి పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు.

అప్పటికి సమయం మధ్యాహ్నం 12 దాటింది. ఊరి బయటికి తీసుకు వెళ్ళిన వాళ్ళను పోలీసులు ఒక గుట్ట దగ్గర ఆపారు. జగన్‌ను, యాదయ్యను తప్ప తక్కిన వారినందరినీ (జాజుల వెంకటేశం, బోయ భిక్షం, జాజుల అశోక్, జాజుల భాస్కర్, బోయ యాదయ్య, మంచాల ఇమ్మాన్యుయెల్, మైల సత్తయ్య, కొమిరెల్ల నారాయణరెడ్డి, సుక్క శంకరయ్య, మేడి కిష్టయ్య, సర్వల్లి యాదగిరి, కత్తుల సాయిలు) చిట్యాల పోలీస్ స్టేషన్‌కు పంపించారు. వాళ్ళందరిమీద గత సంవత్సర కాలంలో రాడికల్స్ నల్గొండ జిల్లాలో చేసిన అన్ని నేరాలూ మోపారు. 'టాడా' పెట్టి జైలుకు పంపించారు.

ఇక్కడ పిట్టంపల్లి శివారులో జగన్‌ను, యాదయ్యను పట్టుకు కాల్చి పారేసి, 'ఎన్‌కౌంటర్' జరిగిందని ప్రకటించారు. శవాల పోస్టుమార్టం అక్కడే జరిపించి, పోలీసులే శవాలను దహనం చేశారు.

## బస్వాపూర్ (కరీంనగర్ జిల్లా)

నక్సలైట్లు ఆత్మరక్షణకోసం ఎదురుకాల్పులు జరిపి ఒక పోలీస్ కానిస్టేబుల్‌ను చంపిన ఉదంతం ఇది.

హుస్నాబాదు దగ్గర, కోహెడ మండలంలో వుంది బస్వాపూర్ గ్రామం. సంవత్సరానికొకసారి ఆ వూళ్ళో జరిగే జాతరలో ప్రతిసారీ ఉన్నట్టే ఈసారి కూడ పోలీసు బందోబస్తు ఏర్పాటయింది. కోహెడ పోలీసులతోబాటు కొందరు సాయుధ పోలీసులుకూడా బందోబస్తులో వున్నారు. జాతర్లలో అన్నిచోట్ల జరిగినట్లే ఇక్కడకూడా పోలీసులు పనిలో పనిగా జనాన్ని వేధిస్తున్నారు. వ్యాపారస్తుల దగ్గర మామూళ్ళు వసూలు చేస్తున్నారు. జనాన్ని లాఠీలతో అదిలిస్తున్నారు. ఈ సంగతి స్థానిక రాడికల్స్ గమనించి పోలీసులను హెచ్చరించారు. కానీ వాళ్లు వినలేదు. అయితే ఒక నక్సలైట్ దళం ఆ రోజు అదే పరిసరాలలో వుంది. వాళ్ళకు ఈ విషయం తెలిసి అక్కడికి వచ్చారు. పోలీసులతో ఘర్షణపడ్డారు. ఒక కానిస్టేబుల్ తుపాకీ ఇచ్చేయమని ఆదేశించారు. అతను అందుకు సిద్ధపడక, ఆ తుపాకీనే వాళ్ళమీద ఎక్కుపెట్టి కాల్పులు జరపబోయారు. నక్సలైట్లు అంతకంటే ముందే ట్రిగ్గర్ నొక్కి అతనిని కాల్చేశారు.

## జడేరు (తూర్పుగోదావరి జిల్లా)

చాలాకాలంగా బీకరమయిన 'ఎన్‌కౌంటర్ల'ను గురించి పేపర్లలో కథలు చదువుతున్నాము. గంటల తరబడి ఇరువైపులా కొన్ని వందల రౌండ్లు బుల్లెట్లు ఖర్చు చేసుకున్నట్టు పోలీసుల ప్రకటనలలో వింటున్నాము. నిజంగా ఆ విధంగా సాగిన 'ఎన్‌కౌంటర్లు' నూటికి ఒక్కటికూడా ఉండవు. అటువంటిదొకటి జనవరి

24 రాత్రి అడ్డతీగలనుండి రంపచోడవరం వెళ్ళే రహదారికి కుడివైపున వున్న బదేరు గ్రామంలో జరిగింది. ఒక కానిస్టేబుల్ చనిపోగా ఒక నక్సలైట్ దళ సభ్యుడు తీవ్ర గాయాలతో బ్రతికి బయటపడ్డాడు.

ఆ రోజు రాత్రి ఒక నక్సలైట్ దళం ఆ ప్రాంతంలో ఒక్కొక్క వూళ్ళో మీటింగ్‌లు పెడుతూ తిరుగుతూ వున్నది. ఒక్క దళం కాదనీ, మామూలుగా విడివిడిగా తిరిగే రెండు దళాలు ఆ రోజు కలిసి తిరుగుతున్నాయనీ అడ్డతీగల సి.ఐ. సుబ్బారావు అంటున్నారు. అది నిజమే కావచ్చు. ఆదే ప్రాంతంలో జీపులో ఇద్దరు ముగ్గురు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తిరుగుతున్నారు. వాళ్ళకు ఒక గ్రామంలో నక్సలైట్ దళం తారసపడింది. తక్కువ సంఖ్యలో ఉన్న కారణంగా వాళ్ళు తాము పోలీసులమని చెప్పక అటవీశాఖ వాళ్ళమని బుకాయించారు. తాము కూడా కొద్దిసేపు మీటింగులో కూర్చొని అడ్డతీగలకు వచ్చారు అక్కడినుండి జీపు నిండా జవాన్లను ఆయుధాలను తీసుకొని తిరిగి వెళ్ళారు. అప్పటికి రాత్రి 1 గంట అయింది. బదేరు గ్రామంలో నక్సలైట్లు వాళ్ళకు కనిపించారు. గ్రామస్తులతో మీటింగ్ జరుగుతూ వుంది. నక్సలైట్లను సరండర్ కమ్మని తాము హెచ్చరించామనీ, వాళ్ల సరండర్ కాకుండా 'ఈ బూటకపు ప్రజాస్వామ్యంమీద మాకు నమ్మకం లేదు. తుపాకీతోనే రాజ్యాధికారం వస్తుంది' అని డైలాగ్ కొట్టి కాల్పులు ప్రారంభించారని కొందరు అడ్డతీగల వాసులు అంటున్నారు. బదేరు గ్రామస్థులు ప్రస్తుతానికి ఏమీ చెప్పగలిగేంతగా కోలుకోలేదు.

ఎలాగయితేనేం, దాదాపు 3 గంటలసేపు మొత్తం 800 రౌండ్లు పేలాయి. మహంకాళీరావు అనే పోలీస్ కానిస్టేబుల్ చనిపోయాడు. ఒక నక్సలైట్ దళ సభ్యునికి కూడా తీవ్రంగా గాయం అయిందనడానికి చిహ్నంగా అక్కడ రక్తం మడుగు కట్టింది. అది దళనాయకుడు సాగర్ రక్తమేననీ సి.ఐ.గారు పదేపదే అంటున్నారుగానీ రక్తాన్నిబట్టి మనిషిని పోల్చుకునే సాంకేతిక విజ్ఞానం ఇప్పటిదాకా పుట్టలేదు. కాబట్టి అదినిజంకావచ్చు, కాకపోవచ్చు.

## అందుగులపల్లి [కరీంనగర్ జిల్లా]

జనవరి 27వ తేదీ తెల్లవారుజామున పెద్దపల్లి మండలంలోని అందుగులపల్లి గుట్టల దగ్గర 'ఎన్‌కౌంటర్' జరిగి ఒక 'గుర్తు తెలియని తీవ్రవాది' చనిపోయాడని పెద్దపల్లి డి.ఎస్.పి ప్రకటించారు. అతను పీపుల్స్‌వార్ గ్రూపువాడు అయివుంటాడని ఒకరు అన్నారు. అతనిది కరీంనగర్ జిల్లా, కాదు అదిలాబాద్ జిల్లా అని అనుమానిస్తున్నామని మరుసటిరోజు అన్నారు. బహుశా చంద్ర పుల్లారెడ్డి వర్గం వాడేమోనని మూడవరోజు అన్నారు. (శవాన్నిబట్టి అతని రాజకీయా

లను, అతని స్వంత జిల్లానుకూడా తెలుసుకోగల విచిత్ర జ్ఞానం మన పోలీసులకే వుంది!) ఈ నాటికీ అంతకంటే వివరాలు తెలియవనే పోలీసులు అంటున్నారు.

నిజానికి పోలీసులకు అతని గురించి అన్ని విషయాలూ తెలుసును. అయితే విషయాలు బయటపెడితే అతను రహస్య కార్యకర్తకాడనీ, అది నిజమైన ఎన్‌కౌంటర్ కాదనీ బయట పడుతుందని చెప్పి 'గుర్తుతెలియని తీవ్రవాది' అనే ఇప్పటికీ అంటున్నారు.

హతుని పేరు మంతెన సారయ్య. స్వగ్రామం పెద్దపల్లి తాలూకాలోని కుక్కలగూడూరు. అయితే ఉద్యోగరీత్యా అదిలాబాద్ జిల్లాలోని రామకృష్ణాపురంలో ఉంటుండేవాడు. రవీంద్రఖని 6వ జంక్షన్‌లో పనిచేసేవాడు. ఆరునెలల క్రితం పోలీసుల వేధింపుకు తట్టుకోలేక మహారాష్ట్ర పోయి చాందా జిల్లాలోని గగ్గూస్‌లో తన మేనమామ దగ్గర ఉంటూ ఒక ప్రైవేట్ కంపెనీలో సూపర్ వైజర్ పని సంపాదించుకున్నాడు. మేనమామ పేరు బొల్లి నర్సయ్య.

జనవరి 23వ తేదీ సాయంత్రం 6 గంటలప్పుడు సారయ్య గగ్గూస్‌లో తన స్నేహితులు మైకేల్, ఆనంద్, సుజ్జాలతో పోతువుండగా, తెల్లబట్టలలోవున్న ఆంధ్ర పోలీసులు జీపులో వచ్చి సారయ్యను బలవంతంగా జీపు ఎక్కించారు. ఎందుకు జీపెక్కిస్తున్నారని స్నేహితులు అడుగగా, 'బస్తీమే గడ్‌బిడ్ కిడియా' అని చెప్పారు. ఆ స్నేహితులు వెంటనే గగ్గూస్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదులో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు చెప్పారు.

మరుసటిరోజు ఈ కబురు రామకృష్ణాపురం చేరింది. సారయ్యను బహుశా స్థానిక (మందమర్రి) పోలీసులు అరెస్టు చేశారేమో అనుకొని అతని బంధుమిత్రులు స్థానికంగానే రెండు రోజులు వాకబు చేశారు. అక్కడికి తేలేదని తెలిసింది. అంతలో 26వ తేదీన గగ్గూస్ నుండి ఇంకొక కబురు వచ్చింది. సారయ్యను గగ్గూస్‌లో అరెస్టు చేయడానికి రెండురోజుల ముందు నుండి రామగుండం ఎస్.ఐ. బ్రహ్మానందం మరికొందరు పోలీసులతో బాటు గగ్గూస్‌లోనే వున్నట్లు చూసినవారు చెప్పారు. ఈ సంగతి తెలియగానే రామగుండంలో వాకబు చేద్దామని సారయ్య మిత్రులు సింగరేణి ఎక్స్‌ప్రెస్ ఎక్కి రామగుండం పోయారు. అయితే అప్పటికే 'ఎన్‌కౌంటర్' అయిపోయింది. పేపర్‌లో అచ్చయిన ఫోటోను బట్టి చనిపోయింది సారయ్యని గుర్తించారు. కాని పోలీసులకు ఈ విషయం చెప్పడానికి భయపడి పౌరహక్కుల సంఘం బాధ్యులకు వారంరోజుల తర్వాత తెలియజేశారు.

## హుస్సేనాబాద్ [నల్గొండ జిల్లా]

భువనగిరి పట్టణానికి చాలా దగ్గరలో వుంది హుస్సేనాబాద్ గ్రామం జనవరి 28 ఉదయం భువనగిరిలో సత్యనారాయణ అనే కాంగ్రెస్(ఐ) మునిసిపల్ కౌన్సిలర్‌ను కిడ్నాప్ చేయడానికి విజయకుమార్ అనే నక్సలైట్ కార్యకర్త ప్రయత్నం చేయగా, ప్రజలు అతనిని తరిమారని, ఆ సంగతి తెలిసి పోలీసులు కూడా వెళ్ళారనీ, విజయకుమార్ ఊరిబయటకు పోయి హుస్సేనాబాద్ శివారులోని గుట్ట దగ్గర వెనక్కి తిరిగి కాల్పులు జరపగా పోలీసులు ఎదురుకాల్పులు జరిపి అతనిని చంపారనీ జిల్లా ఎస్.పి. జె.వి. రాముడుగారి కథనం.

ఆమధ్య భువనగిరిలో పోలీసులు రాడికల్స్ పేరిట అరెస్టు చేసిన యువకులను కోర్టులో హాజరుపెట్టించి బెయిలు మీద విడిపించే బాధ్యత నీదేనని విజయకుమార్ ఆ మునిసిపల్ కౌన్సిలర్‌కు కబురు పంపాడు. అతను తనకది సాధ్యపడదనీ తనకేం పట్టిందనీ సమాధానం పంపాడు. 28 ఉదయం విజయ కుమార్ అతని ఇంటికిపోయి అతనితో ఘర్షణ పడ్డాడు. అతని తమ్ముడు జనార్ధన్ వాళ్ళ అనుచరులంతా పోగయి విజయకుమార్‌ను తరిమారు. అతను గంజ్ దాకా పరుగెత్తి వెనక్కి తిరిగి తన దగ్గరున్న తపంచా తీసి గాలిలోకి కాల్చాడు. దానితో వెంటపడ్డవాళ్లు తగ్గారు. విజయకుమార్ పరుగెత్తుతూ పోయి హుస్సేనాబాద్ శివారులోని పొలాలలోకి పోయాడు.

అంతలో పోలీసులకు తెలిసి వాళ్లు కూడా అటు వచ్చారు. వాళ్ళ కంటికి కనబడకుండా దాక్కున్న విజయకుమార్ ఊరుకోక తపంచాతో హెచ్చరికగా గాలిలోకి కాల్చాడు. దానితో అతనెక్కడున్నదీ పోలీసులకు తెలిసి దగ్గరికొచ్చారు. విజయకుమార్ పారిపోయే ప్రయత్నంలో దండబోయిన అగ్గయ్య అనే రైతు పొలం దగ్గరికి వచ్చాడు. పోలీసుల తూటా అతని కాలిమడమకు తగిలింది. అతను కాలు ఈడ్చుకుంటూ పోయి వరిచేనులో వంగి దాక్కున్నాడు. పోలీసులు నాలుగు వైపుల నుండి చుట్టుముట్టి అతనిని అరెస్టుచేసి ఉండవచ్చును. దానికి బదులు అతనిని కాల్చేయడానికే సిద్ధపడ్డారు. తాము సరండర్ కమ్మంటే కాకుండా తపంచా పైకి ఎత్తి కాల్పులు జరిపాడని అంటున్నారు. నిజానికి పోలీసులకు ఏవిధంగా హాని చేయగల స్థితిలో అతను లేడు. పోలీసులతన్ని నేరుగా కాల్చిచంపారు. అతని కాలిమడమకు తగిలిన మొదటి తూటా పోలీసుల కథ అబద్ధం అని రుజువు చేస్తుంది. అయితే కాలిమడమ మీద ఏ గాయం లేదని భువనగిరి ప్రభుత్వ డాక్టరు గారు అంటున్నారు. దూరం నుండి సంఘటనను కళ్ళారా చూసిన రైతులంతా అతని కాలికి మొదట గాయం అయిందనే అంటున్నారు. డాక్టర్ మాట కాదని వాళ్ళ మాటను ఏ కోర్టు నమ్మాలి?

6)

## భూపాలపట్నం (ఆదిలాబాద్ జిల్లా)

21 ఏళ్ళుగా రాష్ట్రంలో సాగుతున్న 'ఎన్‌కౌంటర్ల' హత్యలలో ఇప్పటికి 693 మందిని పోలీసులు కాల్చేశారుగానీ, భూపాలపట్నంలో జనవరి 30వ తేదీ మధ్యాహ్నం అలస కచ్చులు అనే గొల్ల యువకుడిని ఇండో టిబెటిన్ బార్డర్ ఫోర్స్ పోలీసులు చంపినంత క్రూరంగా ఎవరినీ చంపి ఉండరు. గ్రామస్తులంతా చూస్తుండగా మధ్యాహ్నం 12.00 నుండి సాయంత్రం 5.00 దాకా అతనిని కొట్టి కొట్టి, ఎత్తి బండలమీద పడేసి, మీదెక్కి తొక్కి చంపారు. సిర్పూర్ పోలీసులు ఆపైన శవాన్ని అడవిలోకి తీసుకుపోయి రాత్రంతా ఉంచి 31 ఉదయం శవానికి ఆలివ్‌గ్రీన్ యూనిఫారమ్ తొడిగి, పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి, ముందు రోజు రాత్రి అడవిలో 'ఎన్‌కౌంటర్' అయిందన్నారు.

భూపాలపట్నం సిర్పూర్‌కు 15 కి.మీ.ల దూరంలో దట్టమైన అడవి మధ్యనుంది. గ్రామంలో ఎక్కువమంది గొల్లవాళ్లు. అడవిలో గేదెలు మేపుకొని వాటి పాలు కాగజ్‌నగర్‌లో అమ్ముకొని బ్రతుకుతారు. అటువంటి ఒక కుటుంబానికి చెందినవాడు కచ్చులు. ఆ అడవిలో అందరికీ ఉన్నట్టే అతనికీ నక్సలైట్ దళాలతో పరిచయం ఉంది, అయితే ఊళ్ళో యువకులతో కలిసి ఒకటి రెండు పంచాయితీలు అదికూడా పూర్తిగా శాంతియుతంగా-నిర్వహించడం తప్ప అతను స్వయంగా చేసిన 'తీవ్రవాద' కార్యకలాపాలేమీ లేవు.

జనవరి 30 ఉదయం సిర్పూర్ ఎస్.ఐ. లింగారెడ్డి, బెబ్బర ఎస్.ఐ. కొమరయ్య వెంటరాగా ఇండో టిబెటిన్ బార్డర్ ఫోర్స్ దళం సిర్పూర్ మండలంలోని అడవి ప్రాంత గ్రామాలమీద దాడి మొదలు పెట్టింది. దాడి కేసవపట్నం దాకా వచ్చేసరికి భూపాలపట్నానికి తెలిసింది. యువకులు చాలామంది పారిపోయారు. కచ్చులు కూడా ఊరి వాళ్ళ తరఫున ఫెయిర్ ప్రైజ్ దుకాణం కోసం రూ. 4000 డిపాజిట్ చెల్లించడానికి ఆ పైకం జేబులో పెట్టుకొని సిర్పూర్ పోవడానికి తయారయ్యాడు. అంతలో పోలీసులు రానేవచ్చారు. కచ్చులను పట్టుకున్నారు. పట్టుకోగానే విపరీతంగా కొట్టారు. ఆ తరువాత గ్రామంలోని ఒక్కొక్క 'తీవ్రవాది' ఇళ్ళు చూపించమని వాడవాడా తిప్పారు. ఎవ్వరూ ఊళ్ళో లేకపోయేసరికి ఆ కసి అంతా కచ్చులు మీదనే తీర్చుకున్నారు. వాళ్ళతనిని తమ లాఠీలతో కాక ఊళ్ళో దొరికిన దడి కర్రలతో చావగొట్టారు. ఒళ్ళంతా చీలి రక్తసిక్తం అయ్యింది. దెబ్బలు కొట్టిన రాక్షసులలో 'నల్లరుమాలు చుట్టుకున్న సిక్కులోడిని' గ్రామ ప్రజలు బాగా జ్ఞాపకం పెట్టుకున్నారు. దెబ్బలు కొట్టగా కొట్టగా నక్సలైట్లు ఊరిబయట వాగు దగ్గర దాచుకున్న మందుగుండు సామాగ్రిని కచ్చులు చూపించాడు. పోలీసులు దానిని స్వాధీనం చేసుకొని ఇంకా చూపించమని

కొట్టారు. ఆ ఊళ్ళో గతంలో నక్సలైట్లు హత్యచేసిన ఒక ఇన్ఫార్మర్ కోసం కట్టిన రాతి సమాధి వుంది. అతను స్వయానా కచ్చేలు మేనమామే. కచ్చేలును పోలీసులు ఆ సమాధి దగ్గరికి తీసుకుపోయి పైకి ఎత్తి సమాధి రాళ్ళమీద పడేశారు. ఈ దెబ్బకు కచ్చేలుకు ఒక కనుగుడ్డు ఊడిపోయింది. ఆర్తనాదాలు చేస్తున్న అతన్ని వాళ్ళ ఇంటి పెరట్లోకి తీసుకొచ్చి ఛాతీమీద కర్రతో పొడిచారు. 'అయ్యో చచ్చిపోయాడు' అని సిర్పూర్ ఎస్.ఐ. లింగారెడ్డి తలపట్టుకున్నాడు.

తరువాత పోలీసులు శవంతో సహా బయటికి పోయి రాత్రంతా అడవిలో కూర్చున్నారు. తెల్లవారి బెల్లంపల్లి, అడిషనల్ ఎస్. పి. మహేందర్‌రెడ్డిగారి సలహామీద కాబోలు, శవానికి ఆలివ్‌గ్రీన్ యూనిఫారం తొడిగి రాత్రి అడవిలో భీకరమయిన ఎన్‌కౌంటర్ జరిగిందని, ఒక దళసభ్యుడు చనిపోయాడనీ చెప్పారు. మరుసటిరోజే సిర్పూర్ ఎం ఎల్.ఏ. పురుషోత్తమరావు (ఆయన స్వగ్రామం భూపాలపట్నంకంటే ఇంకా అడవిలోపలికివున్న రెచ్చెన) కచ్చేలు దళసభ్యుడు కాదనీ, సాధారణ యువకుడనీ ప్రకటించి పోలీసులను కఠిన పదజాలంతో మందలించారు.

## బట్టుపల్లి (కరీంనగర్ జిల్లా)

మంథని నుండి మహదేవ్‌పూర్‌కు వెళ్ళే రోడ్డు మీద వుంది బట్టుపల్లి గ్రామం. బట్టుపల్లి నుండి ఇంకా పైకి పోతే గోదావరి నది ఒడ్డున పల్చటి అడవి ప్రాంతంలో అరెంద గ్రామం వుంది. అరెందగ్రామ నివాసి అయిన నీలం హేంచందర్ అనే యువకుడిని బట్టుపల్లి సమీపంలో జనవరి 31 రాత్రి పోలీసులు కాల్చేశారు. మంథని నుండి అరెందకు పోతున్న నైట్‌హాల్ట్ బస్సును బట్టుపల్లి దగ్గర రాడికల్స్ తగలబెట్టడానికి ప్రయత్నం చేయగా 4 గురు దుండగులను పోలీసులు తరిమారనీ ఆ క్రమంలో ఎదురుకాల్పులయ్యాయనీ, హేంచందర్ చనిపోయాడనీ, గోదావరిఖని డి.ఎస్.పి. గంగాధర్‌గారు ప్రకటించారు. (అయితే ఆయన ఈ ప్రకటనకు వివరణ ఏమయినా ఇస్తాడేమో కనుక్కుందామని ప్రయత్నం చేస్తే ఆయన పౌరహక్కుల బాధ్యులను కలవడానికి నిరాకరించాడు. గతంలో చంద్రమోహన్ అనే జనరక్షణ సమితి కార్యకర్తను గోదావరిఖనిలోనే కాల్చేసినప్పుడు కూడా పౌర హక్కుల సంఘం బాధ్యులు కలవాలనిపోతే ఆయన చాలా అయిష్టంగా ఇంటర్వ్యూ ఇచ్చి, అసలు విషయాన్ని గురించి మాట్లాడకుండా ఇవీ అవీ ముచ్చటించి టీ ఇచ్చి పంపించేసారు. ఇక ఆ బెడదలేవీ లేకుండా ప్రభుత్వం ఆయనను స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ లేక గ్రేహేండ్స్ అసిస్టెంట్ అస్సాల్ట్ కమాండర్‌గా బదిలీ చేసిందని తెలుస్తూవుంది.)

హేంచందర్ నక్సలైట్ సానుభూతిపరుడిగా గతంలో కేసులలో ఇరుక్కున్నాడు. ఆ కేసుల వాయిదాలకు పోయి వస్తున్నాడు. గర్భవతి అయిన

తన సోదరి గిరిజతోబాటు ఆరెందలోనే ఉంటున్నాడు. జనవరి నెల ఆఖరులో ఆమె ప్రసవం కోసం కరీంనగర్ వచ్చింది ప్రసవం అయ్యేంతవరకు హేంచందర్ ఆమెతోనే కరీంనగర్‌లో వుండి, 28 ఉదయం మంథనిలో కేసు ఉందని బయలు దేరి వెళ్ళాడు. మంథనిలో కేసుకు హాజరయ్యాడు. ఆ సాయంత్రం కోర్టు నుండి బయటికి పోయిన తరవాత ఒక స్నేహితునితో మాట్లాడాడు.

అదే సాయంత్రం పోలీసులతన్ని అరెస్టు చేసారు. మంథనిలోనే అరెస్టు చేసారనేది ఒక కథనం. కాగా, అతను తన సోదరి ప్రసవించిన విషయం వాళ్ళ అత్తగారికిచెప్పడానికి మహదేవ్‌పూర్ వెళ్ళాడనీ అక్కడ మహదేవ్‌పూర్ పోలీసులు అరెస్టు చేసారనీ, మరొక కథనం. మొత్తానికి ఇక్కడో, అక్కడో 28 సాయంత్రమే పోలీసులు హేంచందర్‌ను అరెస్టు చేసి, 31 రాత్రి చీకట్లో బట్టుపల్లి దగ్గర కాల్చేసి 'ఎన్‌కౌంటర్' అయిందన్నారు. 13 సాయంత్రం మంథని నుండి ఆరెందకు పోయే నైట్‌హాల్టు బస్సు మామూలుగానే బయలుదేరింది. బట్టుపల్లి కంటే ముందు నెగ్లాస్‌పూర్‌లో పోలీసులు బస్సును అటకాయించారు. జనాన్ని దిగమనిచెప్పి బస్సును తగలబెట్టడానికి సమాయత్తమయ్యారు. అయినా తగలబెట్ట కుండా ఎందుకో జాప్యం చేసారు. ఇంతలో ఎదురుగా మహదేవ్‌పూర్ దిక్కు నుండి పోలీసు జీపు వచ్చింది. అంతకు ముందు బస్సును ఆపినవాళ్ళు తప్పు కున్నారు. పోలీసులు జీపును ఆపి వాళ్ళ వెంట అడవిలోకి పోయారు. కొద్దిసేపటికి 'ఎన్‌కౌంటర్' అయింది. ఇదంతా పోలీసులు ఆడిన నాటకమేనని, బస్సును తగల బెట్టబోతున్నట్లు నటించిన వాళ్ళు పోలీసులేననీ, ప్లాన్ ప్రకారమే అదే సమ యంలో తమ కస్టడీలో వున్న హేంచందర్‌తో సహా పోలీసులు జీపులో ఎదురుగా వచ్చి హేంచందర్‌ను పక్కకు తీసుకుపోయి కాల్చేసారనీ, ఆరెంద గ్రామస్తు లంటున్నారు.

## దేవాపూర్ (అదిలాబాద్ జిల్లా)

దేవాపూర్‌లోని బిర్లా వాళ్ళ ఓరియంట్ సిమెంట్ కంపెనీకి కనుచూపు మేరలో ఫిబ్రవరి 8 సాయంత్రం చీకటి పడుతూవుండగా ఒక 'ఎన్‌కౌంటర్' జరిగి చంద్రపుల్లారెడ్డి గ్రూపుకు చెందిన గుర్తు తెలియని తీవ్రవాది చనిపోయాడు. అతని పేరేమిటో ఇప్పటికి తమకు తెలియదని బెల్లంపల్లి అడిషనల్ ఎస్.పి. మహేందర్ రెడ్డి అంటున్నారు. అయితే పౌరహక్కుల సంఘం బాధ్యులకు గ్రామం లోకి అడుగుపెట్టిన అరగంటలో తెలిసిన విషయం పోలీసులకు నిజంగానే తెలియ దంటే అది నమ్మశక్యంకాదు. పోలీసులు అతని ఊరు, పేరు బయట పెట్టకపోవ డానికి కారణం ఏమంటే అతను ఏ ప్రధాన నక్సలైట్ గ్రూపుకూ చెందినవాడు కాడు. తనదే ఒక చిన్న గ్రూపు తయారు చేసుకొని చంద్రపుల్లారెడ్డి గ్రూపు

పేరుతో లెటర్ పాడ్ అచ్చువేయించుకొని దేవాపూర్ పరిసరాలలో తిరుగుతున్నాడు. కాంట్రాక్టర్లనుండి చందాలు సేకరించాడు. (50,000/—దాకా సేకరించాడని ఇచ్చిన వాళ్ళు అంటున్నారు. మృతుని దగ్గర 12,000/- మాత్రమే దొరికాయని అతన్ని హత్యచేసిన పోలీసులు అంటున్నారు. వాళ్ళు అబద్ధం చెబుతున్నారో, మిగిలింది వాళ్ళు భోంచేసారో తెలుసుకోవలసి వుంది.) ఒకరిద్దరు 'దొంగల'ను పట్టుకొని పంచాయితీ చేసి దేహశుద్ధి చేశాడు. ఈ మాత్రం 'తీవ్రవాద' కార్యకలాపాలకు అతన్ని 'ఎన్‌కౌంటర్' చేయడం అవసరం అని పోలీసులు ఎవ్వరినీ నమ్మించ లేరు కాబట్టి, తామేదో ఘనకార్యం చేసినట్లు జనం అనుకోవాలని 'చంద్రపుల్లారెడ్డి' వర్గానికి చెందిన గుర్తుతెలియని తీవ్రవాది అంటున్నారు.

అతని అసలు పేరు ఎర్రోజు రమేశ్. కరీంనగర్ జిల్లా తక్కెళ్ళపల్లి నివాసి. దేవాపూర్‌లో అతని బంధువులున్నారు. ఆ కారణంగానో లేక అక్కడ కంపెనీ వున్న కారణంగానో దేవాపూర్‌ను కేంద్రం చేసుకొని తిరిగేవాడు. అతని 'తీవ్రవాద కార్యకలాపాలు' అంతాచేసి నెల రోజులకంటే ఎక్కువ సాగలేదు. అంతలో ఎన్‌కౌంటర్ల కోటా నింపుకొనడానికి అతను పనికొస్తాడని పోలీసులకు తోచింది. అతని ప్రాణం పోయింది. ఇప్పుడు పోలీసులు దేవాపూర్‌లోని అతని బంధువులను అతనికి అన్నం పెట్టిన వాళ్ళనూ లాకప్పులో వేసి రోజూ కొడు తున్నారు. అయినా తమకు తెలియదనే అంటున్నారు.

## మంచిర్యాల (అదిలాబాద్‌జిల్లా)

ఇది చాలా నగ్నంగా జరిగిన హత్య. మృతుడు శ్రీనివాస్ ఉరఫ్ దేవేందర్‌రెడ్డి. రామకృష్ణాపురం వాస్తవ్యుడు. ఫిబ్రవరి 11 వ తేదీ ఉదయం ఇతను ఫణిబాగ్చి గ్రూపు ఆర్గనైజర్ అయిన సత్తెన్నతో మోటార్ సైకిల్ మీద మంచిర్యాల హమాలీవాడలో పోతూ పోలీసులకు ఎదురయ్యాడనీ, పోలీసులు హెచ్చరించగా వాళ్ళ మీద వీళ్ళు కాల్పులు జరిపారని, పోలీసులు జరిపిన ఎదురు కాల్పులలో శ్రీనివాస్ చనిపోగా సత్తెన్న తప్పించుకున్నాడనీ పోలీసుల కథనం.

అసలు జరిగింది పూర్తిగా వేరే కథ. మంచిర్యాల హమాలీవాడలో నివసించే తిప్పని రాజయ్య అనే కాంట్రాక్టర్‌ను కలవడానికి వీళ్ళు అపాయింట్ మెంట్ తీసుకున్నారు. 10 వ తేదీనే కలవవలసి ఉండింది. రాజయ్య ఆ సంగతి పోలీసులకు చెప్పి వాళ్ళను ఇంటికి పిలిపించుకున్నాడు. పోలీసులు వచ్చారుగాని రావలసిన వాళ్ళు రాలేదు. పోలీసులు ఆ రాత్రి అక్కడే ఉండిపోయారు. మరుసటి రోజు ఉదయం శ్రీనివాస్, మరొక వ్యక్తి కాంట్రాక్టర్ రాజయ్య దగ్గరికి వచ్చారు. ఆ మరొక వ్యక్తి తాను కానేకాదనీ, తాను కొద్దిలో 'ఎన్‌కౌంటర్' తప్పించుకున్నా నన్న ప్రకటన అబద్ధమనీ సత్తెన్న ఒక పత్రికా ప్రకటనలో తెలిపాడు.

వీళ్ళు రాజయ్య ఇంట్లోకి రాగానే పోలీసులు మీదపడ్డారు. శ్రీనివాస్ దొరికాడు కాని రెండవ వ్యక్తి పక్కింటి గోడ దూకి పారిపోయాడు. శ్రీనివాస్‌ను రోడ్లో అందరూ చూస్తూండగా పోలీసులు అర కి.మీ. నడిపించుకొనివెళ్ళి శ్రీనివాస సామిల్ అండ్ టింబర్ డిపో దగ్గర ఆగారు. అక్కడి నుండి మంచిర్యాల పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌చేసి జీపు తెప్పించుకున్నారు. జనమంతా చూస్తూ వుండగా జీపులోకి ఎక్కించి పోలీసుస్టేషన్ దిక్కుగా కాక వేములపల్లి గ్రామం వైపు తీసుకొని పోయారు. మరికొద్దిసేపటికి ఊరిబయట 'ఎన్‌కౌంటర్' అయిపోయింది.

## అహమ్మద్‌పూర్ (మెదక్ జిల్లా)

అన్ని జిల్లాల్లో ఎన్‌కౌంటర్లు అవుతూ వుంటే మేము పుట్టుకు తీసిపోయామా అని మెదక్ పోలీసులు గజ్వేల్ దగ్గరిలోని అహ్మదీపూర్‌లో ఫిబ్రవరి 22 సాయంత్రం 7-20 గంటలప్పుడు ఒక 'ఎన్‌కౌంటర్' చేసారు. గిరాయిపల్లి తరువాత మెదక్ జిల్లాలో ఇదే మొదటి ఎన్‌కౌంటరేమో' చాలా కాలం గడిచిందని ఒకేసారి అయిదుగురిని కాల్చేసారు. ఆరేళ్ళ క్రితం అన్నగారి పాలన రాక్షసపర్వం ఆరంభదినాల్లో కరీంనగర్ పోలీసులు కొండాపూర్- వెంకట్రావుపేట గ్రామాల సరిహద్దు దగ్గర అయిదుగురిని చేతులు వెనక్కి కట్టి కాల్చేసారు. ఆ తరువాత మళ్ళీ ఒకే ఎన్‌కౌంటర్‌లో అయిదుగురిని చంపడం ఇదే మొదటిసారి.

చనిపోయిన వాళ్ళలో ఉడిది రాజయ్య (50), ఆయన కొడుకు మల్లయ్య (30) సామాన్య గ్రామీణులు. భూమిలేని పేదలు. వేరేవాళ్ళ భూమిని పాలికి సేద్యం చేస్తారు. మిగిలిన ముగ్గురూ (జహీర్ సిద్దికీ ఉరఫ్ సుధాకర్, లింగం ఉరఫ్ ప్రకాశ్, ప్రసాద్) నక్సలైట్ కార్యకర్తలు, అయితే పోలీసులు వాళ్ళను కాల్చినప్పుడు వాళ్ళు కూడా నిరాయుధులే.

ఫిబ్రవరి 7వ తేదీన ఇదే ప్రాంతంలో మరొక గ్రామంలో జరిగిన ఒక 'ఎన్‌కౌంటర్'లో సిద్దికీ గాయపడ్డాడనీ ఇంకాకోలుకోలేదనీ ఒకవదంతి ఉంది. బహుశా ఆ కారణంగా విశ్రాంతి తీసుకొంటున్నాడేమో ఏదయితేనేం, అతను మిగిలిన ఇద్దరూ ఫిబ్రవరి 21 రాత్రి అహమ్మదీపూర్ వచ్చారు. ఆ రాత్రి, మరుసటి దినం ఉడిది రాజయ్య ఇంట్లో ఉన్నారు. ఈ సంగతి పోలీసులకు తెలిసి 22 సాయంత్రం 50 మందికి పైగా వున్న స్పెషల్ పోలీసు బృందం అహమ్మదీపూర్ చేరుకుంది. గ్రామం మొదట్లోనే కొందరు ఆగి గ్రామంలోకివస్తున్న వాళ్ళను ఆపారు. మిగిలినవాళ్ళు రాజయ్య ఇంటివైపు వెళ్ళారు. రాజయ్య ఇల్లు గ్రామానికి అటు చివరవుంది. ముఖం పొలాల వైపు తిప్పుకొనివుంది. పోలీసులు రెండుగా చీలి ఇంటి వెనకనుండి ముందుకు ఇరువైపుల నుండి వచ్చారు ఆ విధంగా చుట్టుముడితే ఎవ్వరికీ తప్పించుకునే అవకాశం లేదు.

రాజయ్య ఇల్లు రెండు భాగాలుగా వుంది. రెండు భాగాలకూ వరండాలు వున్నాయి. ఒక వరండాలో బల్లమీద నక్సలైట్ కార్యకర్తలు ముగ్గురు కూర్చుని వున్నారు. వాళ్ళ చేతిలో ఆయుధాలు లేవు. వాళ్ళ ఆయుధాలన్నీ రెండవ వరండా లోని గదిలో వున్నాయి. ఆ గదికి గొళ్ళెం పెట్టివుంది.

వెనకవైపు నుండి ఇంటిముందుకొచ్చిన పోలీసులు మొదట మల్లయ్యను పట్టుకున్నారు. పట్టుకొని వరండావైపు నడిపించుకొని రాసాగారు. మల్లయ్య తల్లి కిష్టమ్మ ఏదో అపదరానున్నదని భయపడి తన కొడుకునేమీ అనొద్దని పోలీసులను వేడుకొంది. వాళ్ళు ఆమె కళ్ళ ఎదుటే ఆమె కొడుకును నిర్దాక్షిణ్యంగా కాల్చేశారు. కొడుకు శవం మీదపడి ఆమె ఏడుస్తూ ఉండగానే భర్త రాజయ్యను కాల్చేసారు.

ఇది గమనించిన నక్సలైట్ కార్యకర్తలు లేచి తమ ఆయుధాలున్న గదివైపు వెళ్ళారు. గది గొళ్ళెం తీయడానికి వాళ్ళు ప్రయత్నిస్తూ ఉండగా పోలీసులువాళ్ళను కూడా నేరుగా కాల్చేశారు. చనిపోయిన అయిదుగురి శరీరాలలోను 5 నుండి 10 దాకా బుల్లెట్లు ఉన్నాయని పంచనామా సాక్షి సర్పంచ్ మైసయ్య చెప్పాడు.

పోలీసులు వెంటనే శవపంచనామా జరిపించలేదు. పత్రికలకు వార్త ఇవ్వలేదు. అందుకే ఈ హత్యజరిగింది సాయంత్రం 7-30కే అయినా, అహమ్మద్ పూర్ హైదరాబాదు నుండి 70 కి.మీ.లలోపే వున్నా మరుసటి రోజు పేపర్లలో సరయిన రిపోర్టు సహితం రాలేదు. బహుశ చనిపోయిన వారిలో ఇద్దరు సామాన్య రైతులు కావడం వల్ల తాము అల్లదల్చుకున్న కథకు జిల్లా ఎస్.పి. నండూరి సాంబ శివరావుగారి క్లియరెన్స్ కావలసి వచ్చిందేమో. అది లభించిన తరువాత 23 ఉదయం పంచనామా జరిపించి, గజ్వేల్ నుండి సిద్దిపేట నుండి డాక్టర్లను రప్పించి చెరుపు కట్టమీదనే పోస్టుమార్టం చేయించి, మధ్యాహ్నానికల్లా తామే శవాలను తగల బెట్టి చేతులు కడుక్కున్నారు. ఎంతోకాలంగా 'నక్సలైట్లను చంపండి, కేసులుండవు' అని జనాన్ని రెచ్చగొడుతున్న ఎస్.పి. చివరికి తానే ఆ పుణ్యం కట్టుకొని తనను తానే ఆశీర్వదించుకున్నారు.

## బట్టోనిపల్లి [వరంగల్ జిల్లా]

మార్చి 2వతేదీ మధ్యాహ్నం ములుగు ఘనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వున్న గుర్రంపేట గ్రామ పంచాయితీకి చెందిన హామ్లెట్ అయిన బట్టోనిపల్లి అనే 17 గుడిసెల కుగ్రామం అవతల నక్సలైట్ దళానికీ పోలీసులకూ కాల్పులు జరిగాయి.

'బట్టోళ్ళు' లంబాడాలలో ఒక నికృష్టమయిన ఉపతెగ. లంబాడాల దగ్గర అడుక్కు తింటారని ఇతర లంబాడాలు అంటారు. అటువంటి కుటుంబాలు

17 సుబ్బయ్యపల్లి అనే గ్రామానికి అవతల గుట్ట మొదట్లో గుడిసెలు వేసుకొని బట్టోనిపల్లి అని తమ పల్లెకు పేరుపెట్టుకున్నారు ప్రభుత్వం ఇచ్చిన భూమి దున్నుకొని బతుకుతున్నారు. 7వ తేదీ ఉదయం గుట్ట అవలి నుండి నక్సలైట్ దళం వచ్చి పల్లె బయట అడవిలో ఉంది. వాళ్ళు అక్కడ ఉండగా పోలీసులు గుర్రంపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులను పట్టుకొని, నక్సలైట్ల ఆచూకీ చెప్పమని బలవంతం చేసి, వాళ్ళు చూపించగా బట్టోనిపల్లికి వచ్చారు. రాగానే ఊరిమీదపడి అందరినీ కొట్టారు. దెబ్బలు తిన్న బట్టుశీత ఆస్పత్రి పాలయ్యాడు.

జనాన్ని కొట్టిన తరువాత పోలీసులు ఊరిబయట అడవిలోకి వెళ్ళారు. పోలీసులు 12 మంది ఉన్నారనీ, తెల్లబట్టలలో ఉన్నారనీ గ్రామస్తులు అంటున్నారు. నక్సలైట్ దళం ఆచూకీ తెలియగానే రెండు వైపుల నుండీ కాల్పులు జరిగాయి. దాదాపు 40 రౌండ్లు పేలాయని గ్రామస్తుల అంచనా. అంతటితో దళం వెళ్ళి పోయింది. అయితే సెంట్రీ లింగంపల్లి బాబూరావు మట్టుకు పోలీసులకు దొరి కాడు. వాళ్ళు అతన్ని పట్టుకుపోయి కేసుపెట్టి ఉండవచ్చు. దాని బదులు అక్కడే బాగా కొట్టి, కాళ్ళు చేతులు విరగ్గొట్టి, రెండు కిలోమీటర్లు తీసుకుపోయి మల్లయ్య పల్లి గ్రామ శివారులోని యూకలిప్టస్ ప్లాంటేషన్ దగ్గర కాల్చేసారు. ఆ ప్లాంటే షన్ దగ్గరే 'ఎన్‌కౌంటర్' అయిందని ప్రకటించారు.

## నరసింహసాగర్ (వరంగల్ జిల్లా)

ఈ సంఘటనలో కూడ ఒక నక్సలైట్ దళం సెంట్రీ చనిపోయాడు. అతని పేరు దేవేందర్.

మార్చి 16వ తేదీ సాయంత్రం దళం నరసింహసాగర్ గ్రామానికి వచ్చి మీటింగ్ పెట్టింది. నరసింహసాగర్ ఏటూరునాగారం నుండి మణుగూరు వైపు విస్తరించిన అడవిలో బాగా లోపలికి ఉంది. ఆ గ్రామంలోకి రావడాని కయినా పోవడానికయినా ఒకే రోడ్డు.

మీటింగ్‌లో 100 మందికి పైగా ఆడామగా జనం కూర్చున్నారు. ఊరి నుండి బయటికి పోయే రోడ్డుకు వీపు తిప్పుకొని వాళ్ళు కూర్చున్నారు. నక్సలైట్లు జనానికి ఎదురుగా, రోడ్డుకు అభిముఖంగా కూర్చొన్నారు. అంతలో మంగపేట నుండి బయలుదేరిన పోలీసు బృందం నరసింహసాగర్ చేరింది. మంగపేట ఎస్.ఐ. ముగ్గురు కానిస్టేబుళ్ళు జీపులో వచ్చారు. వాళ్లు వచ్చీరాగానే మీటింగ్ మీదికి కాల్పులు జరిపారు. నక్సలైట్లు ఎదురు కాల్పులు జరిపితే జనం చచ్చేవారే. అప్పటికే పోలీసు తూటాలు తగిలి జనంలోని వారయిన షరీఫున్నిసా బేగం, వెంకటమ్మ, గురవమ్మ, లక్ష్మయ్య (స్కూలు హెడ్‌మాస్టరు) గాయపడ్డారు.

గాభరాపడి లేచి పారిపోతుండగా తగిలిన తూటాలు కావడం వల్ల గాయాలన్నీ తొడ వెనుక భాగాన తగిలాయి.

దళం తప్పించుకొని వెనకనుండి వెళ్ళిపోయింది. అయితే పోలీసులకూ జనానికీ మధ్యనున్న సెంట్రీ దేవేందర్ మట్టుకు చనిపోయాడు. పూర్తిగా ఏక పక్షంగా జరిగిన ఈ కాల్పులలో జనం కూడ చనిపోయే ప్రమాదం ఉంది.

## లక్ష్మీపురం (కరీంనగర్ జిల్లా)

సిద్దిపేట నుండి సిరిసిల్లకు వెళ్ళే దారిలో సిరిసిల్లకు దగ్గరగా వుంది లక్ష్మీపురం గ్రామం. లక్ష్మీపురం క్రిందనున్న ఒక గొల్లవాళ్ళ హామ్లెట్‌లో మార్చి 18వ తేదీన కొండపనేని మల్లేశ్ (20) మహమ్మద్ నసీరుద్దీన్ (20) అనే రైతు కూలీ సంఘం కార్యకర్తలను సిరిసిల్ల పోలీసులు అరెస్టుచేసి బాగాకొట్టి చంపేసి 'ఎన్‌కౌంటర్' జరిగిందని ప్రకటించారు.

మార్చి 18 ఉదయం ఆ యిద్దరు యువకులూ హామ్లెట్‌కు వచ్చారు. జనం అన్నాలు తిని పనిలోకి వెళ్ళిపోయారు. ఆ తరువాత పోలీసులు వచ్చి ఆ ఇద్దరినీ పట్టుకున్నారు. వాళ్ళ దగ్గర ఆయుధాలేవీ లేవనీ, ఒకని చేతిలో గొడ్డలి, ఒకని చేతిలో కొడవలి ఉన్నాయనీ జనం అంటున్నారు. వాళ్ళను పోలీసులు అరెస్టు చేసి తీసుకుపోయి సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో బాగా కొట్టారు. పోస్టుమార్టం చేసిన ప్రభుత్వ డాక్టరు చెప్పే దాని ప్రకారం మల్లేశం తొడ ఎముక విరిగిపోయి వుంది. తొడ కండరాలు గుజ్జుయి పోయి వున్నాయి. నసీరుద్దీన్ ఎడమచేతి చర్మం ఊడి పోయివుంది. ఈ గాయాలు చాలా తీవ్రమయిన చిత్ర హింసలను సూచిస్తాయి. 'ఎన్‌కౌంటర్'లో ఇటువంటి గాయాలయ్యే అవకాశం లేదు. ఈ దెబ్బలకే ఆ యువకులిద్దరూ చనిపోగా శవాలలోకి తూటాలు దించి 'ఎన్‌కౌంటర్' అయిందన్నారో లేక కొన ప్రాణంతో ఉండగా కాల్చేసారో తెలీదుగానీ మొత్తానికి చిత్ర హింసలు పెట్టిన అనంతరం పోలీసులు వాళ్ళను కాల్చేసి లక్ష్మీపురంలో 'ఎన్‌కౌంటర్' అయిందన్నారు. లక్ష్మీపురం ప్రజలు సాక్ష్యం ఇస్తారేమోనని వాళ్ళందరినీ తీసుకుపోయి 4 దినాలు సిరిసిల్ల లాకప్‌లో పెట్టుకున్నారు.

## అగ్గిమల్ల (కరీంనగర్ జిల్లా)

బిల్ల ఐలయ్య ఉరఫ్ ప్రసాద్ పది సంవత్సరములకు పైగా కరీంనగర్ జిల్లాలో ప్రజలకు, పోలీసులకు పరిచయం ఉన్న నక్సలైట్ కార్యకర్త. మార్చి 28 మధ్యాహ్నం 3 గంటలకు చిల్వకోడూరు పోలీసు స్టేషన్ పరిధిలోని అగ్గిమల్ల గ్రామం శివారులోని ఈతచెట్ల దగ్గర పోలీసులు అతనిని కాల్చివేసి "గుర్తు తెలియని

తీవ్రవాది" చనిపోయాడన్నారు. అతనితోపాటు మరొక వ్యక్తి ఉన్నాడని, వాళ్ళు సమావేశమైనట్లు వున్నారని తెలిసి చిల్వకోడూరు ఎస్.ఐ. అరెస్టు చేయడానికి రాగా లొంగిపోకుండా ఎస్.ఐ. మీదికి కాల్పులు జరిపారని, ఎస్.ఐ. ఎదురు కాల్పులు జరపగా ఐలయ్య చనిపోయి, రెండవ వ్యక్తి పారిపోయాడన్నది పోలీసుల కథనం.

ఇది పట్టి అబద్దం. ఐలయ్యను అదే రోజు ఉదయం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో కరీంనగర్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. అతను, అతని భార్య, రవి, ప్రవీణ్ అనే మరి ఇద్దరు కార్యకర్తలు కమ్మరపల్లిలో ఒక ఇంటి నుంచి బయటకు వస్తుండగా పోలీసులు వచ్చారు. అయిలయ్య భార్య అతనిని హెచ్చరించి గోడదూకి పారిపోయింది. పోలీసులు ఆమెపై కాల్పులు జరపాలని చూశారుగాని ఆమె పారిపోయిన దిక్కున బహిర్భూమికి పోతున్న స్త్రీలు చాలామంది ఉన్నారు. కాబట్టి కాల్పులు మానుకున్నారు. మగవాళ్ళ ముగ్గురినీ అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరూ ఏమయ్యారో గాని, ఐలయ్యను మటుకు మెట్టుపల్లి, జగత్యాల, గొల్లపల్లిల మీదుగా అగ్గిమల్లకు తీసుకు వచ్చి ఈతతాపు దగ్గర కాల్చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు 'ఎన్‌కౌంటర్' జరిగితే ఆ రోజంతా గ్రామస్థులు శవాన్ని చూడకుండా పహారా పెట్టి, మరుసటిరోజు ఉదయం పంచనామా జరిపించి, అక్కడే శవపరీక్షచేసి తామే తగులబెట్టారు.

## బూర్గుపల్లి మెదక్ [జిల్లా]

సిద్దిపేటకు 3 లేక 4 కిలోమీటర్ల దూరాన వున్న బూర్గుపల్లి గ్రామ శివారులో తారురోడ్డు పక్కన ఏప్రియల్ 9 రాత్రి 9 లేక 9-30 ప్రాంతంలో ఒక 'ఎన్‌కౌంటర్' జరిగింది. గొలకొండ లింగారెడ్డి అనే నక్సలైట్ రామన్న దళానికి చెందిన మరొక గుర్తు తెలియని నక్సలైటు మరణించినట్టు సిద్దిపేట డి.ఎస్.పి. వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఈ దళం సభ్యులు 7వ తేదీ రాత్రి సిద్దిపేటకు చెందిన డా॥ బాలరాజును గొడ్డలి, కత్తి చూపించి బెదిరించి 1 లక్ష 50 వేలు ఇమ్మన్నారనీ, ఆయన ప్రాణభయంతో అప్పుడే 45 వేలు ఇచ్చి మిగిలినది 9వ తేదీ రాత్రి ఫలానాచోట అందజేస్తానని ఒప్పుకున్నాడనీ, ఈ సంగతి పసిగట్టిన పోలీసులు ఆ ప్రదేశానికి వెళ్ళారనీ డి.ఎస్.పి.గారు అంటున్నారు. తాము అక్కడికిపోయే సరికే డా॥ బాలరాజు 4500 నగదు మిగిలిన బంగారం వాళ్ళకు అప్పగించి తిరిగి వస్తున్నాడనీ, ఆయనను ఆపి ప్రశ్నించి విషయాలు తెలుసుకొని దుండగులను వెంబడించామని వారు మొదటి ప్రకటనలో అన్నారు. తరువాత ఎందుకో కథ కొంచెం మార్చి, సొమ్ము చేతులు మారుతున్నప్పుడు తాము మాటుగాసి చూసామనీ, డాక్టరు వెళ్ళిపోగానే దుండగులను వెంబడించామనీ అన్నారు. దుండగులు లూనా

మీద పారిపోతూ వెనక్కి తిరిగి పోలీసుల మీద కాల్పులు జరిపారంట. పోలీసులు యధావిధిగా ఎదురుకాల్పులు జరిపి వాళ్ళిద్దరినీ చంపేశారంట.

నిజానికి మృతులిద్దరూ ఏ దళం సభ్యులూ కారు. వాళ్ల 'నకిలీ' నక్స లైట్లు. అంటే విప్లవ పార్టీల సభ్యుల్లా నటించి జనాన్ని బెదిరించి డబ్బులు వసూలు చేసుకొని బ్రతుకుతున్న బాపతు. రెండవ వ్యక్తి పేరు పిన్నక మురళి. ఇద్దరిదీ రావురూకల గ్రామం. ఒకప్పుడు మురళి పేరు పోలీసుల లిస్టులో వుంటే లింగారెడ్డి డి.ఎస్.పి. దగ్గర అతన్ని సరండర్ చేయించగా వారు ఎం.ఆర్.వో. ద్వారా అతన్ని 'బైండోవర్' చేయించారు. ఆ తరువాత ఇద్దరూ సిద్దిపేటలో పాన్ షాపులు పెట్టుకొని వీళ్ళనూ, వాళ్ళనూ బెదిరించి పైసలు సంపాదించుకొని బతుకు తున్నారు. లింగారెడ్డి పాన్‌షాప్ సిద్దిపేట పోలీస్‌స్టేషన్ దగ్గరే వుంది. పోలీసులు సిగరెట్లకోసం, పాన్‌లకోసం నిత్యం పోయి వస్తూంటారు, మురళి షాపూ పోలీస్ స్టేషన్‌కు దగ్గరే. అతనూ సిద్దిపేట పోలీసులకు తెలియకపోయే ప్రసక్తి లేదు. అతన్ని "గుర్తు తెలియని తీవ్రవాది" అని ప్రకటించడం, తాము చంపింది ప్రమాద కరమయిన దళసభ్యుడిననే భ్రమ కలిగించడానికి మాత్రమే.

ఇంక మిగిలిన విషయాలు ఊహించడం కష్టం కాదు. 7వ తేదీ రాత్రి వీళ్ళ బెదిరింపుకు భయపడి 45 వేలు ఇచ్చి 9వ తేదీ రాత్రి మిగిలినది ఇస్తానని ఒప్పుకున్న డాక్టరు మరుసటి దినమంతా డబ్బుకోసం ప్రయత్నించడమేకాక, వాళ్ల నిజమయిన నక్సలైట్లా, కాదా తెలుసుకునే ప్రయత్నం కూడ చేశాడు. ఈ క్రమంలో పోలీసులకు సమాచారం అందింది. వాళ్ళు ఒక ప్రైవేట్ అంబాసిడర్ కారులో ముందే అక్కడికిపోయి ఉన్నారు. డాక్టరు పైసలిచ్చి వెనక్కిపోగానే లింగారెడ్డి, మురళిల మీదికి కాల్పులు జరిపారు. వాళ్ళు పోలీసులమీద కాల్పులు జరిపే ప్రసక్తే లేదు. ఆ తర్వాత లింగారెడ్డి ఇల్లు సోదా చేసినప్పుడు బెదిరించడానికి ఉపయోగించే బొమ్మ తుపాకులే తప్ప నిజమయినవి దొరకలేదు.

ఆ తరువాత షరామామూలుగా అక్కడే పోస్టుమార్టం జరిపించి తామే శవాలను తగలబెట్టారు.

## వెంకటాపూర్ [ఆదిలాబాద్ జిల్లా]

మంచిర్యాల-మందమర్రి ప్రాంతంలో గడచిన సంవత్సరకాలంలో ఇది నాలుగవ 'ఎన్‌కౌంటర్'. హతులు రైతుకూలి సంఘం, ప్రగతిశీల యువజన సమాఖ్య కార్యకర్తలు. పేర్లు బరిగల లింగయ్య, బుచ్చన్న ఉరఫ్ జగన్, జాల మల్లన్న ఉరఫ్ పాపన్న.

మందమర్రినుండి దాదాపు 25 కిలోమీటర్ల దూరాన, దేవాపూర్‌లోని

బిర్లావాళ్ళ ఓరియంట్ సిమెంట్ కంపెనీకి అవతలవున్న చిట్టడవి ప్రాంతంలో వుంది వెంకటాపూర్ అనే కుగ్రామం. మండలం కాశీపేట, పోలీస్ స్టేషన్ దేవాపూర్.

ఏప్రిల్ 11 ఉదయం 10 గంటల సమయానికి పై ముగ్గురూ వెంకటాపూర్ గ్రామంలో ఉన్నారు. జగన్ 10వ తేదీ రాత్రే ఆ గ్రామం చేరుకున్నాడు. మిగిలిన ఇద్దరూ 10-11 తేదీలలో వరంగల్‌లో జరిగిన ప్రగతిశీల మహిళాసంఘం సభలకు ఆ ప్రాంతంనుండి వెళ్ళిన జనానికి ప్రయాణపు ఏర్పాట్లు చేసి 11వ తేదీ ఉదయం వెంకటాపూర్ చేరుకున్నారు. ముగ్గురూ ఒక ఇంటి ముంగిట్లో బెంచిమీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. బాలయ్య అనే చాకలి అతను వాళ్ళ బట్టలు అక్కడే ఇస్త్రీ చేస్తున్నాడు. వాళ్ళ సామాన్లేవీ (వాళ్ళదగ్గరున్న ఒక్క రివాల్వర్‌తో సహా) వాళ్ళదగ్గర లేవు. గ్రామంలో ఒకరి ఇంట్లో వున్నాయి.

ఆ సమయంలో ముగ్గురు పోలీసులు తెల్ల బట్టలలో అటు వచ్చారు. వీళ్ళకు అనుమానం వచ్చి వాళ్ళను ప్రశ్నించారు. వాళ్ళ ప్రవర్తననుబట్టి వాళ్ళు పోలీసులని గ్రహించిన జగన్ వాళ్ళను కట్టేసి కొట్టడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఇంకెవరయినా వస్తున్నారేమోనని చూడమని ఇద్దరు యువకులను ఊరి బయటికి పంపాడు. వాళ్ళు ఊరి మొదట్లో వున్న వొర్రె (వంక) దగ్గరికి పోయేసరికి వొర్రెలో దాదాపు 40 మంది ఇండోటిబెటన్‌బార్డర్ ఫోర్స్‌కూ, స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్స్‌కూ చెందిన సాయుధ పోలీసులు కనిపించారు. వాళ్లు ఊరిలోనికి వస్తున్నారు. ఈ యువకులిద్దరూ భయపడి వొర్రెలోపడి పారిపోయారు. సాయుధ పోలీసులు ఊరిలోకి రావడం చూసి లింగయ్య, జగన్, పావన్నలు పారిపోబోయారు. పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి ఆగమని గద్దించారు. వాళ్లు ఆగి వెనక్కి వచ్చారు. వాళ్లు అంతకుముందు కూర్చున్నచోటే నిలబడ్డారు. పోలీసులు 'హాండ్సప్' అనగానే వాళ్లు చేతులెత్తారు. రెండు మూడు నిమిషాలు ఇరుపక్షాల మధ్య మాటలు సాగాయి. అంతలోనే నిరాయుధులయి చేతులెత్తి నిలబడ్డ ఆ ముగ్గురినీ పోలీసులు నేరుగా కాల్చేశారు.

ఆ తరువాత ఊరిలోని ఇళ్ళన్నీ వెతికి వాళ్ళ రివాల్వర్‌నూ, ఇతర సామగ్రినీ పట్టుకొని శవాల పక్కన పెట్టి ఫోటో తీయించి 'ఎన్‌కౌంటర్' చిత్రం కల్పించారు.

★★

## ఎన్‌కౌంటర్ల జాబితా (1990 - ఏప్రిల్ 1991)

| ఊరు | తేదీ | మృతుల పేర్లు |
|---|---|---|
| 1. ఓబులనాయునిపల్లి | 8-5-90 | కేశనాయక్ |
| 2. ముల్కనూరు | 9-6-90 | సామా అంతిరెడ్డి |
| 3. మదన్‌పల్లి | 11-6-90 | ప్రసాద్, నర్సక్క, స్వామి |
| 4. తిప్పాపూర్ | 23-7-90 | బాలిరెడ్డి, గాలిరెడ్డి, నర్సాగౌడ్, యాదగిరి |
| 5. గోదావరిఖని | 4-8-90 | పిట్టల సత్తయ్య |
| 6. లక్ష్మీదేవిపేట | 6-8-90 | రవీందర్‌రెడ్డి |
| 7. వెల్లుట్ల | 10-8-90 | గద్దె సిద్దయ్య, మన్నె యాదగిరి |
| 8. సిరిసిల్ల | 24-8-90 | సుభాష్ |
| 9. గోదావరిఖని | 23-10-90 | బడికెల చంద్రమోహన్ |
| 10. పులిమడుగు | 11-12-90 | పూరెల్లి తిరుపతి, చాంద్‌పాషా |
| 11. గౌరిదేవిపల్లి | 13-12-90 | కృష్ణారెడ్డి |
| 12. మోప్రా | 29-12-90 | నీరడి బాలన్న, గిర్మాజీ యాదగిరి |
| 13. పిట్టంపల్లి | 4-1-91 | యాదయ్య, జగన్ |
| 14. బస్వాపూర్ | | కానిస్టేబుల్ |
| 15. జడేరు | 24-1-91 | మహంకాళీరావు (కానిస్టేబుల్) |
| 16. అందుగులపల్లి | 27-1-91 | మంతెన సారయ్య |
| 17. హుస్నాబాద్ | 28-1-91 | విజయకుమార్ |
| 18. భూపాలపట్నం | 30-1-91 | అలస కచ్చులు |
| 19. బట్టుపల్లి | 31-1-91 | నీలం హేంచందర్ |
| 20. దేవాపూర్ | 8-2-91 | ఎర్రోజు రమేశ్ |
| 21. మంచిర్యాల | 11-2-91 | శ్రీనివాస్ |
| 22 అహమ్మదీపూర్ | 22-2-91 | ఉడిది రాజయ్య, ఉడిది మల్లయ్య, జహీర్, లింగం, ప్రసాద్ |

| ఊరు | తేదీ | మృతుల పేర్లు |
|---|---|---|
| 23. బట్టోనిపల్లి | 2-3-91 | లింగంపల్లి బాబూరావు |
| 24. నరసింహ సాగర్ | 16-3-91 | దేవేందర్ |
| 25. లక్ష్మిపురం | 18-3-91 | కొండవేని మల్లేశ్, మహమ్మద్ నసీరుద్దీన్ |
| 26. అగ్గిమల్ల | 28-3-91 | బల్ల బలయ్య |
| 27. బూర్గుపల్లి | 9-4-91 | గోలకొండ లింగారెడ్డి, పిన్నం మురళి |
| 28. వెంకటాపూర్ | 11-4-91 | బరిగల లింగయ్య, జగన్, పాపన్న |
| 29. తంగెళ్ళపల్లి (దీని వివరాలు ఇంకా అందలేదు) | 22-4-91 | వి. రామిరెడ్డి |

మొత్తం మృతుల సంఖ్య=46 (వీరిలో ఇద్దరు పోలీసులు)

ఏ దేశంలోనయినా పరిపాలనా యంత్రాంగం ఏమాత్రం ప్రజాస్వామికంగా నడుస్తోందనడానికి ఒక అంతిమ ప్రమాణం ఉంటుంది. బ్రిటిష్ ప్రభుత్వానికి ఉత్తర ఐర్లాండ్ ప్రమాణమయినట్టు, భారత ప్రభుత్వానికి పంజాబ్ కాశ్మీర్‌లు ఈశాన్య రాష్ట్రాలు ప్రమాణం అయినట్టు ఆంధ్రప్రదేశ్ పరిపాలనా యంత్రాంగానికి నక్సలైట్ ఉద్యమం ప్రమాణం. ఈ మాట ఒప్పుకోవడానికి ఆయా ఉద్యమాలతో రాజకీయంగా ఏకీభవించనవసరం లేదు. వాళ్ళు చేపట్టే అన్ని చర్యలనూ మెచ్చుకోనవసరంలేదు.

పరిపాలనా యంత్రాంగంలోని ఏ సంస్థా - పోలీసులు, జైళ్ళు, న్యాయస్థానాలు, పరిపాలనా నిర్వాహకశాఖ, అభివృద్ధిశాఖలు, సంక్షేమ శాఖలు, విద్యావైద్య శాఖలు - బడుగు వర్గాలకు ఎన్నడూ న్యాయం చేయలేదు. అట్టడుగువర్గాలు సంఘటితమయి తిరగబడితే పాలనాయంత్రాంగం మరింత అన్యాయంగా స్పందిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటిదాక బడుగువర్గాల నుండి వచ్చిన బలమైన తిరుగుబాటు నక్సలైట్ ఉద్యమం కాబట్టి ఆ గీటురాయితో పరీక్షిస్తే ఏ సంస్థలోనూ, ఏ శాఖలోనూ ఆవగింజంతయినా ప్రజాస్వామ్యం మిగలదు. భవిష్యత్తులో బడుగువర్గాల నుండి వేరే ఏ ఉద్యమం బలంగా ముందుకొచ్చినా పరిస్థితి ఇంతకంటే భిన్నంగా ఉండబోదు.